ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
బుధవారం 11, డిసెంబరు 2024



వైసీపీ అధినేత జగన్ మానస పుత్రిక సాక్షి పత్రిక ఆవిర్భావానికి నిధులు సమకూర్చిన ఘనుడు మిడ్‌వెస్టు గ్రానైట్ అధినేత రాఘవరెడ్డి అనేది జగమెరిగిన సత్యం. అయినా గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ గ్యాంగ్.. సొంత మనిషైన ఆయననూ వదలలేదు. పైగా తాడేపల్లి ప్యాలెస్ కనుసన్నల్లో మిడ్‌వెస్ట్‌తోపాటు ఇతర గ్రానైట్ సంస్థల నుంచి భారీగా సీఎం మనుషులు దండుకున్నారు. కేవలం ఏపీ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న క్వారీల నుంచే వందల కోట్లు నొక్కేశారు. అందులో కొంత తాడేపల్లి ప్యాలెస్‌కు కూడా చేరిందన్న ప్రచారం ఉంది. ఈ వ్యవహారంలో కీలక పాత్రధారులుగా కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలు వ్యవహరించారు. అవినాష్‌రెడ్డి తరఫున ఆయన సొంత మామ ప్రతాప్‌రెడ్డి ప్రత్యక్షపాత్ర పోషించగా వైవీ తన మనుషుల ద్వారా వ్యవహారం నడిపించారు. అయితే వైవీ ఆదాయ వ్యవహారాలన్నీ ఆయన కుమారుడు విక్రాంత్‌రెడ్డి కనుసన్నల్లో జరిగినట్లు ప్రచారం ఉంది.

కోట్లు కొల్లగొట్టారు

వెలుగుచూస్తున్న వైసీపీ అక్రమాలు

- సొంత మనుషులనూ వదలని జగన్ గ్యాంగ్
- గత ప్రభుత్వ హయాంలో చీమకుర్తిలో పాగా
- అవినాష్, వైవీల సారథ్యంలో గ్రానైట్ దందా
- కూటమి ప్రభుత్వం రాగానే పరార్
- ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న పరిశ్రమ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

చీమకుర్తి ప్రాంతంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ నిక్షేపాలను గత వైసీపీ పాలకులు యథేచ్ఛగా కొల్లగొట్టారు. ఇందుకు సంబంధించిన వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. నిశితంగా పరిశీలిస్తే గడిచిన ఐదేళ్లలో పైసా పెట్టుబడి లేకుండా సాదాసీదా నిర్వహణ ఖర్చుతో రూ.100కోట్లకు పైగా ధనాన్ని జగన్ గ్యాంగ్ చేజిక్కించుకున్నారు. 2019 ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్దినెలలకే రంగంలోకి వచ్చిన బృందం గత ఎన్నికల్లో ఫలితాలు వెలువడిన మరుసటిరోజే తట్టాబుట్ట సర్దుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ గనుల అభివృద్ధి కార్పొరేషన్ పరిధిలో 80 ఎకరాల భూమి ఉంది. అందులో 25 ఎకరాలు వివాదంలో ఉండగా మిగిలిన భూమి ఏపీఎండీసీ పరిధిలోనే ఉంది. అందులో సుమారు 46 ఎకరాలకు పైగా భూమి కార్పొరేషన్ జాయింట్ వెంచర్‌లో లీజుకు ఇచ్చింది. అందుకోసం తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ ఏ పార్టీ అధికారంలో ఉన్నా చక్రం తిప్పగల మిడ్‌వెస్టు సంస్థ లీజును దక్కించుకుంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో కూడా గెలాక్సీ గ్రానైట్ లీజుల మంజూరు, అక్రమ తవ్వకాలు ఇతరత్రా వ్యవహారాల్లో ఆయనదే పెత్తనం. అప్పట్లో జగన్ ఏర్పాటు చేసిన సాక్షి పత్రికకు ప్రధాన పెట్టుబడిదారుడు అతనే అని కూడా ప్రచారంలో ఉంది. రాష్ట్ర విభజన అనంతరం తెలుగుదేశం

మిగతా 6లో...

ఆదాయం వంద కోట్ల పైమాటే

జగన్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలకే రంగంలోకి వచ్చిన ప్రతాప్‌రెడ్డి మిడ్‌వెస్టు పరిధిలోని క్వారీల్లో తిష్ట వేసి తన ఆధీనంలోకి తీసుకున్నారు. వెనువెంటనే పెరల్ సంస్థ నిర్వహిస్తున్న పల్లవకు చెందిన క్వారీల్లోకి వైవీ సుబ్బారెడ్డి ప్రతినిధులు ప్రవేశించారు. అప్పటికే ఆ సంస్థ నిర్వహిస్తున్న మిషనరీతోనే వీరు పనులు చేయించుకొని లబ్ధిపొందటం ప్రారంభించారు. మిడ్‌వెస్టు సంస్థకు సాలీనా 30వేల క్యూబిక్ మీటర్ల గెలాక్సీ గ్రానైట్ రాయి ఎగుమతి చేసేందుకు అనుమతి ఉంది. అలాగే రెండో సంస్థకు 10,746 క్యూబిక్ మీటర్ల గెలాక్సీ గ్రానైట్‌ను ఎగుమతి చేసే అనుమతి ఉంది. అప్పట్లో విదేశాల్లో డిమాండ్ కూడా ఉండటంతో క్యూబిక్ మీటరు రూ.60వేల నుంచి రూ.80 వేల వరకు అమ్మారు. ఆ రకంగా అటు మిడ్‌వెస్టు లీజు క్వారీల నుంచి ప్రతాప్‌రెడ్డి, పల్లవ గ్రానైట్ లీజు క్వారీ నుంచి వైవీ మనుషులు భారీమొత్తంలో లబ్ధిపొందారు. కొద్దిపాటి నిర్వహణ వ్యయం తప్పా పెట్టుబడి కూడా లేకపోవటం, ప్రభుత్వ శాఖలు అన్నివిధాలుగా పచ్చజెండా ఊపడంతో ఎక్కువ మొత్తంలో వారికి ఆదాయం లభించింది. అలాగే అనధికారికంగా పెద్దమొత్తంలో గెలాక్సీ నిక్షేపాలను ఎగుమతి చేశారు. భారీగా తవ్వకాలు జరిపి ఎగుమతి చేసిన రాయిలో నూటికి 90 శాతం ఆదాయం లభించేది. ఇలా సాలీనా ఇరువురు అధికారికంగా 40,746 క్యూబిక్ మీటర్ల గెలాక్సీ నిక్షేపాలను ఎగుమతి చేయటంతోపాటు అనధికారికంగా మరో 20వేల క్యూబిక్ మీటర్ల రాయిని వారు ఎగుమతి చేసుకోగలిగారు. వీటితోపాటు వేస్టు రాయి విక్రయం ఇతరత్రా కూడా వారికి ఆదాయం లభించింది. ఇలా చూస్తే అటు అవినాష్‌రెడ్డి ఇటు వైవీలు క్వారీల ద్వారా నాలుగేళ్లల్లో రూ.100 కోట్లకు పైగా ఆదాయం పొందిన పరిస్థితి స్పష్టంగా కనిపించింది.





పట్టుబడిన బియ్యంతో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

300 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పొదిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కాపురం అడ్డ రోడ్డు సమీపంలో ఉన్న ధనలక్ష్మీ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 300 బస్తాలను రేషన్‌బియ్యాన్ని కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి మంగళవారం సీజ్ చేశారు. రాత్రి ఒంటిగంట సమయంలో ఆర్డీవోకు వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో రైస్‌మిల్లుపై దాడి చేశారు. 300ల బస్తాలను గుర్తించి స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తెలిపారు. అనంతరం పట్టుబడిన బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేఖ, రమేష్ ఆధ్వర్యంలో దగ్గరలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించారు. ఈ దాడిలో పొదిలి, కనిగిరి ఎస్‌ఐలు ప్రమోద్, శివగంగిరెడ్డి, వీఆర్వో సుబ్బారావు పాల్గొన్నారు. సురేష్‌పై 6ఏ కేసు నమోదు చేశారు.

నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు

ఒంగోలు విద్య, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలకు బుధవారం నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్-1 మోడల్ పేపర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 11వ తేదీన తెలుగు/ఉర్దూ1 కాంపోజిట్ తెలుగు, 12న హిందీ, 13న ఇంగ్లీషు, 16న లెక్కలు, 17న సైన్స్, 18న బయాలజీ సైన్స్, 19న సాంఘికశాస్త్రం పరీక్ష ఉంటుందన్నారు. 1నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 11న తెలుగు, 12న ఇంగ్లీషు, 13న గణితం, 16న సైన్స్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రశ్నపత్రాలను ఎంఈవో కార్యాలయం నుంచి ఏ రోజుకారోజు గంట ముందు తీసుకెళ్లాలన్నారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి ఈనెల 22లోపు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపడంతోపాటు సీఎస్ఈ వెబ్‌సైట్‌లోనూ నమోదు చేయాలని తెలిపారు.



ఎమ్మెల్యే బీఎన్ చేతుల మీదుగా కప్పు అందుకుంటున్న ప్రకాశం జట్టు సభ్యులు

కబడ్డీ విజేత ప్రకాశం

6

చేజారుతున్న కేడర్

ఆగమేఘాలపై పార్టీ జడ్పీటీసీ, ఎంపీపీ, ఇతర సంస్థల అధ్యక్షులకు జగన్ పిలుపు

నేడు తాడేపల్లిలో భేటీ

- స్థానిక సంస్థల పట్టును కాపాడుకునే ప్రయత్నం
- టీడీపీ ఖాతాలోకి చేరిన కార్పొరేషన్, ఒక మునిసిపాలిటీ
- అదే బాటలో మండల పరిషత్‌లు
- రెండు సమావేశాలతో జడ్పీటీసీల పోకడపైనా అనుమానాలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విపక్ష వైసీపీ నుంచి చేజారుతున్న స్థానిక సంస్థలపై పెత్తనాలను కాపాడుకునేందుకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా రంగంలోకి వచ్చారు. ఇప్పటికే ఒంగోలు కార్పొరేషన్, గిద్దలూరు మునిసిపాలిటీలు టీడీపీ ఖాతాలోకి వెళ్లాయి. మొన్నటికి మొన్న త్రిపురాంతకం మండల పరిషత్ వైసీపీ నుంచి చేజారింది. నిన్నటికి నిన్న ఆ పార్టీ హేమాహేమీ నేతలంతా నియోజకవర్గాల పర్యటనకు వెళ్తే కొందరు జడ్పీటీసీలు మొహంచాటేశారు. రానున్న రోజుల్లో జిల్లా పరిషత్ కూడా చేజారే అనుమానాలతో జగన్ వద్ద పంచాయితీకి సిద్ధమయ్యారు. అందుకు అనుగుణంగా బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వైసీపీకి చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, మునిసిపల్ చైర్మన్లు స్థానిక సంస్థల అధినేతలను తాడేపల్లికి తరలిరావాలని ఆపార్టీ ఆదేశించింది.



గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా పరిషత్‌తోపాటు ఇతర స్థానిక సంస్థలన్నింటినీ వైసీపీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కింది స్థాయి నేతలు పులోమని కూటమి పార్టీల్లోకి ముఖ్యంగా టీడీపీలోకి చేరేందుకు సిద్ధమయ్యారు. ప్రతిష్ఠాత్మకమైన ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు గిద్దలూరు మునిసిపాలిటీలు ఇప్పటికే టీడీపీ చేతిలోకి వెళ్లాయి. ఇటీవల మిగిలిన కొన్ని మునిసిపాలిటీల్లో టీడీపీ నేతలు ఊ అంటే వైసీపీ పగ్గాలు చేజారే అవకాశముంది. ఇటీవల ఆ పార్టీ ఎమ్మెల్యే ఉన్న వైపాలెం నియోజకవర్గంలో త్రిపురాంతకం మండల పరిషత్‌లో వైసీపీకి చెందిన ఎంపీపీని పదవి నుంచి తప్పించి టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఎంపీటీసీని ఎంపీపీని చేశారు. ఇలాంటి పరిస్థితి మరికొన్ని మండలాల్లో ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తోంది. అదే సమయంలో జిల్లా పరిషత్ చేజారే అవకాశాలు పెరుగుతున్నాయి.

9నెలల్లో అవిశ్వాసానికి అవకాశం

ప్రస్తుత నిబంధనల మేరకు మరో తొమ్మిది నెలల్లో జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం రానుంది. ఎన్నికల ముందు టీడీపీలో చేరిన జడ్పీటీసీలతోపాటు మరో 25 మంది టీడీపీ, జనసేన నేతలకు టచ్‌లో ఉన్నారు. దీంతో అప్రమత్తమైన జడ్పీ చైర్‌పర్సన్ కుమారుడు దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీలకు గోవా టూర్ నిర్వహించిన విషయం తెలిసిందే. అయినా జడ్పీటీసీలు వలసలకు అవకాశం ఉందని గ్రహించి సోమవారం గిద్దలూరు, వైపాలెం

మిగతా 6లో...

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులపై దృష్టి సారించింది. కీలకమైన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవులను ఇచ్చేందుకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ మేరకు మార్గదర్శకాలను జారీ చేశారు. వాటికి అనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. జిల్లాలో పది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా వాటి పరిధిలోని శాసనసభ్యుల సూచనలు, సలహాలను కూడా తీసుకుని రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందుకోసం రెండు వారాలు గడువు ఇవ్వడంతో తదనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు. బుధ, గురువారాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నారు. దీంతో శుక్ర లేదా శనివారాల్లో మార్కెటింగ్ శాఖ అధికారులు రిజర్వేషన్ల ఖరారుపై చర్చించిన అనంతరం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. తదనంతరం ఆయా కమిటీల పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో చర్చించిన అనంతరం రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంది. సంక్రాంతి పండుగ అనంతరం పాలక వర్గాలను నియమించే అవకాశం ఉంది. .

మార్కెట్ కమిటీలపై దృష్టి

- పాలక వర్గాలను నియమించేందుకు కసరత్తు
- రెండు వారాల్లో రిజర్వేషన్లు ఖరారు చేసి ప్రతిపాదనలు పంపాలని సర్క్యులర్ జారీ

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

- కీలక అంశాల నివేదికతో పాల్గొంటున్న కలెక్టర్ అన్సారియా
- ముందుగా అధికారులతో సమీక్ష
- వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఇతర శాఖల అధికారులు హాజరు

7

నేడు నీటిసంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

- జిల్లాలో 342 డబ్ల్యూయూఏలు
- ఓటర్లుగా 2.10 లక్షల మంది రైతులు

ఒంగోలు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. అందుకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది. వైసీపీ పాలనలో నీటిసంఘాలు నిర్వీర్యం కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక వాటికి ఎన్నికలు నిర్వహించాలని సంకల్పించి ఏర్పాట్లు చేసినా పలు కారణాలతో మూడు సార్లు వాయిదా పడింది. తాజాగా ఈనెల 11న నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లా యంత్రాంగం తదనుగుణంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మేజర్, మీడియం,



మిగతా 6లో...

నకిలీపత్రాల కేసులో ఐదుగురు అరెస్ట్

- రెవెన్యూ అధికారుల పాత్రను నీరుగార్చిన వైనం
- నాలుగేళ్లు యథేచ్ఛగా దోపిడీ
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం

6

నేడు నీటిసంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

(5వ పేజీ తరువాయి)

మైనర్ ఇరిగేషన్ విభాగాలలో 342 డబ్ల్యూయూఏలు ఉండగా వాటి పరిధిలో మొత్తం సుమారు 2.10లక్షల మంది ఆయకట్టుదారులుగా రైతులు ఉన్నారు. వారందరికి ఆయా సంఘాల పరిధిలో ఓటుహక్కు ఉండనుంది. మేజర్ నీటివనరులైన ఎన్నెస్పీ పరిధిలో ప్రాజెక్టు, డిస్ట్రిబ్యూటరీ(డీసీ), డబ్ల్యూయూఏ అలా మూడు స్థాయిల్లో కమిటీలు ఉండగా మీడియం విభాగంలో ప్రాజెక్టు, డబ్ల్యూయూఏ, మైనర్ విభాగంలో డబ్ల్యూయూఏలు ఉన్నాయి. అలా అన్ని విభాగాల్లో కలిపి 342 డబ్ల్యూయూఏలు ఉండగా ఎన్నెస్పీలో 10 డీసీలు ఉన్నాయి. వీటికి ఎన్నికల నిర్వహణకు బుధవారం నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. అలాగే 14వతేదీన డబ్ల్యూయూఏలకు, 17న డీసీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రాజెక్టు కమిటీ ఎన్నికలపై ప్రభుత్వం ఇంకా నిర్దిష్టంగా తేదీ ప్రకటించలేదు. కాగా బుధ, గురువారాల్లో కలెక్టర్ సదస్సుకు హాజరయ్యేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా అమరావతి వెళ్లనున్న నేపథ్యంలో జిల్లాలో నీటిసంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై సంబంధిత అధికారులతో ఆమె చర్చించారు. తదనుగుణంగా బుధవారం నోటిఫికేషన్ విడుదల కానుంది.

చేజారుతున్న కేడర్

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో ఆ పార్టీ అగ్ర నేతలంతా కలిసి పార్టీ విస్తృత సమావేశాలు నిర్వహించార. ఇప్పటికే టీడీపీలోచేరిన జడ్పీటీసీలు, మరో ముగ్గురు వైసీపీ జడ్పీటీసీలు ఆ సమావేశాలకు డుమ్మా కొట్టిన విషయం తెలిసిందే. దీంతో పరిస్థితి చేజారుతుందని గుర్తించి వైసీపీ నేతలు సమాచారాన్ని ఆ పార్టీ అధినేతల జగన్ కు తెలిపారు. నియోజకవర్గ ముఖ్య నేతలతోపాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలోని పలువురు నేతలను ఆ సమావేశాలకు పంపినా కొందరు జడ్పీటీసీలు రాకపోవడం ఆపార్టీలో ఆందోళన రేకెత్తించింది. నిజానికి మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో కూడా విస్తృత సమావేశాలు నిర్వహించాక జిల్లా ముఖ్య నేతలతో జగన్ సమావేశంకావాల్సి ఉంది. కానీ కేవలం రెండుచోట్ల సమావేశాలు పూర్తికాగానే పరిస్థితి తీవ్రతను గుర్తించిన ఆపార్టీ స్థానిక సంస్థల్లో కీలకంగా ఉండే వారందర్నీ జగన్ వద్ద సమావేశానికి ఆహ్వానించడం గమనార్హం. జగన్ ద్వారా వీరికి మనోధైర్యాన్ని కల్పించి స్థానిక సంస్థలు ముఖ్యంగా జడ్పీ చేజరాకుండా చూసుకోవాలనేది ఆ పార్టీ లక్ష్యం. మరి ఆ ప్రయత్నం ఎంత ఏమరకు ఫలిస్తుందో చూడాల్సి ఉంది.

మంచం పట్టిన పల్లామల్లి

- తాండవిస్తున్న విషజ్వరాలు
- బీసీకాలనీలో ఇంటికి ఇద్దరు బాధితులు
- ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


బీసీ కాలనీలో జ్వరపీడితురాలు రావులపల్లి అంజమ్మ


జ్వర భాదితుడు నల్లపాటి సుబ్బారావు

చీమకుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం పల్లామల్లి గ్రామంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామంలోని బీసీకాలనీలో ఇంటికి ఇద్దరు విషజ్వరపీడితులు మంచం పట్టి ఉన్నారు. కొంతమందికి జ్వరం తగ్గినా రోజుల తరబడి కాళ్లు, చేతుల నొప్పులు తగ్గకపోవటంతో ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవటంతో వేలరూపాయలు ఖర్చు అవుతున్నాయి. మరోవైపు కూలి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి నొప్పుల వల్ల పనులకు పోలేక ఇంటిపట్టునుండటంతో భృతి కరవయింది. పక్షం రోజులకు పైగా గ్రామంలో వీర జ్వరాలు విజృంభణ చేస్తున్నా వైద్యశాఖ సీరియస్‌గా తీసుకొని ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు, మందుల పంపిణీ, పరీక్షల నిర్వహణలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవటం గమనార్హం. మరోవైపు బీసీకాలనీలో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉంది. కాలనీలో ప్రధాన సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం ముందు భారీగా మురుగునీరు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారింది. ఇంతలా విషజ్వరాలు చెలరేగినా ప్రత్యేకంగా శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించకపోవటంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులకు చేసుకొని జీవనం సాగిస్తూ ఉన్న ఇక్కడవారికి విషజ్వరాలు సోకటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారయంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బీసీ కాలనీలో ఎన్టీఆర్ విగ్రహం ముందు నిల్వ ఉన్న మురుగునీరు

రూ.30వేలు ఖర్చయినా కుదురుకోలేదు



ఇరవై రోజుల క్రితం నొప్పుల జ్వరం వచ్చింది. ఎంతకీ తగ్గకపోవటంతో ఒంగోలు వెళ్లి ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకున్నాను. ఇప్పటి వరకు రూ.30వేలకుపైగా ఖర్చయింది. ఇంకా నొప్పులు తగ్గక ఇబ్బంది పడుతూనే ఉన్నా. బీసీకాలనీలో ప్రతి ఇంట్లో జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వైద్యసేవలు ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలి. **- గుమ్మడి గోవిందయ్య, బీసీకాలనీల**

నొప్పులు తీవ్రంగా బాధిస్తున్నాయి



పదిరోజుల క్రితం జ్వరం వచ్చింది. జ్వరం నుంచి కోలుకున్నా నొప్పులు మాత్రం తీవ్రంగా బాధిస్తున్నాయి. మా ఇంట్లో అందరికీ జ్వరాలు వచ్చాయి. పనులకు పోలేకపోవటంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. కాలనీ మొత్తం శుభ్రం చేస్తే జ్వరాలు తగ్గుతాయి. గవర్నమెంట్ డాక్టర్లు ఇక్కడకి వచ్చి జ్వరాలు తగ్గించాలని కోరుతున్నాం.

- సీహెచ్.రమణయ్య, బీసీకాలనీ

నకిలీపత్రాల కేసులో... ఐదుగురి అరెస్ట్

- రెవెన్యూ అధికారుల పాత్రను నీరుగార్చిన వైనం
- నాలుగేళ్లు యథేచ్ఛగా దోపిడీ
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం

కొనకనమిట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాల కేసులో ఐదుగురు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి పొదిలి కోర్టులో హాజరుపరిచారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి నిందితులకు 14రోజులు రిమాండ్ విధించారు. వివరాల్లోకి వెళితే, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గొట్లగట్టులో నకిలీపత్రాలు దందాను కొంతమంది వ్యక్తులు అధికారుల అండదండలతో యథేచ్ఛగా నడిపారు. నకిలీపత్రాల సృష్టించడంలో ముఖ్యంగా కొంతమంది రెవెన్యూ అధికారుల కీలకపాత్ర ఉన్నట్లు బహిర్గతమైంది.

దందా సాగింది ఇలా..

గొట్లగట్టు గ్రామానికి చెందిన మంత్రి శ్రీను వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్‌గా పనిచేస్తూ పార్ట్‌టైం కింద నెట్ సెంటర్ నడిపేవాడు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన శ్రీను కొంతమంది అధికారుల ఇచ్చిన సలహా మేరకు ఆన్‌లైన్‌లో లేని 1బీ, అడంగల్‌ను తయారు చేసి రైతులకు ఇచ్చేవాడు. రైతుల వద్ద నుంచి డబ్బులు తీసుకొని జేబులు నింపుకున్నాడు. నకిలీపత్రాలు గొట్లగట్టు కేంద్రంగా నడుస్తున్న విషయం తెలుసుకున్న కొంతమంది వాటిని సృష్టించుకొని బ్యాంక్‌లను మోసగించారు. ఈ వ్యవహారంలో దళారులు కూడా కీలకపాత్ర పోషించారు. ఆన్‌లైన్‌లో ఉన్న రెవెన్యూ రికార్డులను సాంకేతికత పరిజ్ఞానాన్ని జోడించి నకిలీ పత్రాలను తయారుచేయడంలో నెట్ సెంటర్ నిర్వాహకుడు ఆరితేరాడు. నకిలీపత్రాలను బ్యాంక్‌ల్లో పెట్టి కొంతమంది బ్యాంకులో రుణాలు పొందారు. అయితే కొంతమంది గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో నకిలీపత్రాల వ్యవహారం గుట్టు రట్టైంది. అయినా అటు రెవెన్యూ అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ముఖ్యంగా రెవెన్యూ అధికారులు నకిలీపత్రాల దందాకు పరోక్షంగా సహకరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో 'నకిలీ కేసు నీరుగార్చారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు లోతుగా విచారించి ఎట్టకేలకు మంగళవారం ఏ1 పొనుగోటి తిరుపతయ్య, ఏ2 పొనుగోటి వెంకటేశ్వర్లు, ఏ3 తోటకూర నారాయణ, ఏ4 మంత్రి శ్రీను, ఏ5 దివ్వేల సుబ్బారావును బాధ్యులను చేశారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీరికి పొదిలి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ప్రత్యూష రిమాండ్ విధించారు. అయితే కీలకమైన అధికారులను కేసు నుంచి తప్పించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద నకిలీపత్రాల సృష్టికర్తలకు అరదండాలు పడినట్లయింది.

'ఉపాధి'లో డొల్ల బట్టబయలు

- వలంటీర్లకు, ఆశావర్కర్లకు, అంగన్‌వాడీలకు మస్టర్లు
- మరణించిన వారికి కూడా
- పథకంలో వేసిన తోటలు ఎండిపోయాయి
- పనుల కొలతల్లో 15శాతానికి పైగా వ్యత్యాసాలు
- ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్
- రికవరీకి ఆదేశాలు
- క్షేత్ర సహాయకుడిపై కేసు నమోదు చేయాలని హుకుం

పొన్నలూరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం అమలులో డొల్లతనాన్ని సోషల్ ఆడిట్ బృందం బట్టబయలు చేసింది. మండలంలోని 24 గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిశీలన చేసి దాదాపు 25కుపైగా అంశాల్లో అభ్యంతరాలను గుర్తించింది. పొన్నలూరులోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో వాటిని బయటపెట్టింది. అన్ని గ్రామాల్లో అబ్జర్వర్లు పనుల పరిశీలనకు హాజరు కాలేదని ఆడిట్ బృందం సభ్యులు తెలిపారు. అదేవిధంగా మస్టర్లలో సంతకాలు లేకుండా వేతనం చెల్లించారని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కుంటల్లో చేసిన పనుల్లో 10 నుంచి 19 శాతం వరకు కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఏ గ్రామంలో కూడా జాబ్ కార్డులు అప్డేట్ చేయలేదని, ఒకే ఇంటిలో వేరువేరుగా జాబ్‌కార్డులు ఇచ్చారని తెలిపారు. చేసిన పనులకు జియోట్యాగింగ్, ఎం.బుక్ జెరాక్స్‌లు కొన్ని పనులకు ఇవ్వలేదని వివరించారు. సుంకిరెడ్డిపాలెం, చెరుకూరు, పొన్నలూరు, మాలెపాడు ఇతర గ్రామాల్లో వలంటీర్లకు మూడు రోజులకు మాత్రమే హాజరు వేసే అవకాశం ఉండగా వారంలో ఆరు రోజులు హాజరు వేశారు. అదేవిధంగా ముండ్లమూరివారిపాలెంలో వీవోఏకు, కోటపాడులో అంగన్‌వాడీ టీచర్ వసంతకు, ఆశావర్కర్ శిరీషకు హాజరు వేశారు. శింగరబొట్లపాలెంలో ఇద్దరికి చనిపోయిన వారికి కూడా హాజరు వేశారని ఆడిట్ బృందం అభ్యంతరాలు తెలిపింది. అదేవిధంగా పలుగ్రామాల్లో హార్టికల్చర్ సాగుకు డబ్బులు ఇవ్వగా మొక్కలు వేశాక ఎండిపోయాయని, పర్యవేక్షణ లేకపోవడంతో ఎండిపోయాయని, ప్లాంటేషన్‌కు ఇచ్చిన నిధులు వృథా అయ్యాయని తెలిపారు. అదేవిధంగా వెంకుపాలెంలో రైతు కొబ్బరి మొక్కలు వేయగా అవి బతికి ఉన్నా ఆయనకు పెర్టిలైజర్‌కు, నీటి వసతులకు డబ్బులు చెల్లించడం లేదని రైతు ఆడిట్ అధికారులకు అభ్యంతరాలు తెలిపాడని ఆడిట్ సభ్యుడు సభలో నివేదించారు. ఈవిషయాలపై కూలంకుషంగా పరిశీలించిన డ్వామా పీడీ ఆడిట్ బృందం లేవనెత్తిన అంశాలపై సిబ్బందిని హెచ్చరించారు. మొక్కలు వేసిన రైతుకు నిర్వహణకు డబ్బులు ఇవ్వకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరణించిన వారిపేర్లు అన్ని గ్రామాల్లో వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని, ఒకే కుటుంబంలో జాబ్‌కార్డులు వేరుగా ఉంటే రద్దు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పథకం జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ రాణి, ఎస్‌ఆర్పీ వెంకటేశ్వర్లు, ఏపీడీ రాజారావు, ఎంపీడీవో సుజాత, ఏపీవో మాచర్ల పాల్గొన్నారు.


ప్రజావేదికలో పాల్గొన్న పీడీ జోసెఫ్‌కుమార్, అధికారులు

క్షేత్రసహాయకులు డుమ్మా...

ప్రజావేదిక కార్యక్రమానికి క్షేత్ర సహాయకులు ఐదారుగురు మాత్రమే హాజరయ్యారు. మిగతా వారు గ్రామాల్లో ఆడిట్ అధికారులకు సహకరించలేదు. అదేవిధంగా ప్రజావేదిక కార్యక్రమానికి హాజరు కాలేదు. గతంలో జరిగిన 15వ ఆడిట్‌లో 91,223 రూపాయలు రికవరీకి అధికారులు ఆదేశించగా, కేవలం 8278 రూపాయలు మాత్రమే రికవరీ అయ్యాయి. తిమ్మపాలెం క్షేత్ర సహాయకుడు కె. రమేష్ 58,680 రూపాయలు చెల్లించాల్సి ఉండగా చెల్లించలేదు. దీంతో పీడీ వెంటనే క్షేత్ర సహాయకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ఆమేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో సుజాతను ఆదేశించారు. మంగళవారం నాటి 16వ సోషల్ ఆడిట్ 2023 నంచి 2024 వరకు మండలంలో 734 పనులు జరగ్గా అందుకుగాను 13 కోట్లా, 39 లక్షలా 70 వేలా 269 రూపాయలకు బిల్లులు చెల్లించగా, వీటిలో 11 కోట్లా 63 లక్షలా 99వేల 967 రూపాయలు వేతనాలు కింద కూలీలకు చెల్లించారు. 1 కోటీ 75 లక్షలా 70 వేల 302 రూపాయలు మెటీరియల్ కాంపోనెంట్ చెల్లించారు.

కబడ్డీ విజేత ప్రకాశం

- పురుషుల విభాగంలో ప్రథమస్థానం
- మహిళల విభాగంలో కృష్ణాజిల్లా గెలుపు
- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు



సంతనూతలపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జెడ్పీ హైస్కూల్లో 71వ ఆంధ్ర సీనియర్ పురుషులు, మహిళల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు విజయవంతంగా ముగిశాయి. సూదనగుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 13 జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరయ్యారు. గత నాలుగు రోజుల పాటు హోరాహోరీగా కొనసాగిన పోటీలు మంగళవారంతో ముగిశాయి. పురుషుల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో తూర్పుగోదావరి జిల్లా జట్టుపై ప్రకాశం జిల్లా జట్టు 12 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. మహిళల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో విజయనగరం జిల్లా టీంపై కృష్ణా జిల్లా టీం ఒక పాయింట్ తేడాతో విజయం సాధించింది.

విజేతలకు ట్రోఫీలు

సూదనగుంట ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎస్‌ఆర్‌ఐ డాక్టర్ సూదనగుంట రాఘవేంద్రప్రసాద్, ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరశింహారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.అరుణల చేతుల మీదుగా ప్రథమస్థానంలో నిలిచిన పురుషులు, మహిళల విజేతలకు ట్రోఫీలను అందజేశారు. అలాగే సెమీఫైనల్స్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభచూపిన పురుషుల టీంలో ముగ్గురు, మహిళల టీంలో ముగ్గురికి రూ.10వేల చొప్పున జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, హైదరాబాద్ డీఎస్పీ అన్ను వేణుగోపాల్, హైదరాబాద్‌లో సీఐగా పనిచేస్తున్న మహేంద్రరెడ్డి సొంత నగదును ప్రోత్సాహకంగా అందజేశారు. అనంతరం సూదనగుంట కుటుంబీకులను ఎమ్మెల్యేలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి, సెక్రటరి యలమంచిలి శ్రీకాంత్, ట్రెజరర్ సుబ్బరాజు, జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, నిర్వాహకులు సూదనగుంట కృష్ణమూర్తి, మందాడి వెంకటేశ్వర్లు, ముప్పరాజు శ్రీనివాసరావు, పావులూరి నారాయణస్వామిచౌదరి, నాయకులు, ఈదర విష్ణు, ఆర్.అంకారావు, తన్నీరు శ్రీను, ఆర్‌వి.సురేష్, బి.శంకర్, సాధినేని శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అమృత్ సరోవర్ 2.0లో ప్రతి గ్రామానికి చెరువు

- డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్

పొన్నలూరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): అమృత్ సరోవర్ 2.0 పథకంలో భాగంగా జిల్లాలోని 729 గ్రామ పంచాయతీల్లో ప్రజల భాగస్వామ్యంతో ఒక చిన్నపాటి చెరువు నిర్మాణం చేయాలని, అంతకుముందే చెరువు ఉంటే అన్ని విధాలా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని, త్వరలోనే ఆ కార్యక్రమం ప్రారంభమవుతుందని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ చెప్పారు. ఆయన మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందుకు ఏ శాఖలో నిధులు ఉంటే ఆ శాఖ సహకారంతోపాటు, దాతలు, గ్రామాల్లోని స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటామని చెప్పారు. చెరువును సర్వతోముఖాభివృద్ధి, బహుళార్థ ప్రయోజనకారిగా చేస్తామన్నారు. అదేవిధంగా ప్రతి క్షేత్ర సహాయకుడు విధిగా ఒక రైతువారీ కుంట నిర్మాణంలో పాలు పంచుకోవాలని, ఒక టెక్నికల్ అసిస్టెంట్ ప్రతి మండలంలో ఒక రూఫ్ హార్వెస్టింగ్ గుంట నిర్మాణం చేయాలని ఆదేశించామన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రభుత్వ నిధులు రూ.165 కోట్లు, ఎంపీ నిధులు మరో రూ.8 కోట్లతో జరుగుతున్న సీసీరోడ్లు, సైడు కాల్వలు, లింక్ రోడ్లు పనులకు బిల్లులు చెల్లింపులు వారం వారం జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే 40కోట్లు చెల్లించామన్నారు. జిల్లాలో పశువుల షెడ్లు 1075 మంజూరు కాగా 870 వివిధ దశాల్లో ఉన్నాయన్నారు. సమావేశంలో కనిగిరి ఏపీడీ రాజారావు, ఎంపీడీవో సుజాత, ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మాచర్ల పాల్గొన్నారు.

సౌదీ అరేబియాలో నర్సింగ్ ఉద్యోగాలు

- 15లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆల్ యూసుఫ్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువత సౌదిఅరేబియాలో ఉద్యోగం చేసేందుకు ఈనెల 15వతేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18నుంచి 40 ఏళ్లలోపు మధ్యగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకటి నుంచి ఐదేళ్ళు పనిచేసిన అనుభవం ఉండాలని, సౌదీఅరేబియా దేశంలో పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.37,500లతో పాటు జీఎస్టీ ఉండాలని, ఎంపికైన అభ్యర్థులకు వీసా ఫీజు, రానుపోను విమాన టిక్కెట్లు ఆల్ యూసుఫ్ ఎంటర్‌ప్రైజెస్ చెల్లిస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 18న ప్రీ అసెస్మెంట్ జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9988853335 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్సీ వర్గీకరణపై వినతుల కోసం ఏకసభ్య కమిషన్ కార్యాలయం ఏర్పాటు

- జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్

ఒంగోలునగరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కార్యాలయం విజయవాడలోని మొఘల్రాజపురంలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ ప్రధానకార్యాలయంలో ఉన్న మొదటి అంతస్తులో ఏర్పాటు చేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్ మంగళవారం తెలిపారు. రిటైర్డు ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజాన్‌మిశ్రా నేతృత్వంలో ఈ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎస్సీ కులాల్లోని ఉప వర్గీకరణపై తమ విజ్ఞప్తులను, వినతులను కమిషన్ కార్యాలయం పనివేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటలలోపు అందజేయాలని కోరారు. అలాగే రిజిస్టర్ పోస్టు ద్వారా కూడా తమ వినతులను పంపుకోవాలని, లేదా ఓఎస్‌ఎస్సీసబ్‌క్లాసిఫికేషన్ ఎట్ ది రేట్ ఆఫ్ జీమెయిల్.కామ్ అనే ఈమెయిల్ అడ్రస్ కూడా పంపుకోవచ్చని సూచించారు. షెడ్యూల్డు కులాల ప్రజలు, దళితసంఘాల నాయకులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

కోట్లు కొల్లగొట్టారు

(5వ పేజీ తరువాయి)

పార్టీ అధికారంలోకి వచ్చినా ఆయన వ్యాపారం సాఫీగానే సాగింది. 2019 జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక అంతా తనదే హవా అన్నట్లు రాఘవరెడ్డి వ్యవహారాలు ప్రారంభించారు. అయితే జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు తిరగకముందే ఆయనకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు అందాయి. మా వాళ్లు వస్తారు. చెప్పినట్లు చేయండి అంటూ హెచ్చరిక రూపంలో చెప్పినట్లు సమాచారం. ఆ మరుసటి రోజే మిడ్‌వెస్టు సంస్థ లీజు పొంది క్వారీయింగ్ చేస్తున్న ఏపీఎండీసీ పెత్తనంలోని క్వారీల్లోకి గ్రానైట్ వ్యాపారి ప్రతాప్‌రెడ్డి ప్రవేశించారు. ఆయన కడప ఎంపీ అవినాష్‌రెడ్డికి స్వయానా మామ. జాయింట్ వెంచర్‌లో ఉన్న క్వారీల్లో రమారమీ 46 ఎకరాలకుపైగా మిడ్‌వెస్ట్ కింద ఉండగా మరో 20 ఎకరాల వరకు పల్లవ గ్రానైట్ సంస్థ లీజులో ఉంది. ఆ సంస్థ యాజమాన్యం కూడా రెడ్డి సామాజిక వర్గీయులే. పైగా రాజకీయంగా వైసీపీని అనుసరించే వారే. అయితే వారు మొదటి నుంచి ఉన్న సొంత స్థలంలో క్వారీ నిర్వహిస్తూ జాయింట్ వెంచర్‌లో వచ్చిన స్థలాన్ని సబ్ లీజుకు ఇచ్చారు. రాజకీయాలకతీతంగా అందరితో కలిసిమెలిసి సాగే పెరల్ సంస్థ అధినేత రాజా ఆ సబ్ లీజు తీసుకుని క్వారీయింగ్ ప్రారంభించారు.

తాడేపల్లి ప్యాలెస్‌కు వాటా

కాగా చీమకుర్తి గ్రానైట్‌లో లభించిన ఆదాయంలో ఇటు అవినాష్ అటు వైవీ కుటుంబాలకే కాక తాడేపల్లి ప్యాలెస్‌కు వాటా ఉందన్న ప్రచారం జోరుగా సాగింది. అలా కాకపోతే రాఘవరెడ్డి సంస్థల జోలికి వచ్చి ఉండేవారు కాదని అందరి నమ్మకం. కాగా ఈ వ్యవహారాన్ని కదిలించేందుకు జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు చాలామంది అప్పట్లో ప్రయత్నం చేశారు. తాడేపల్లికి వాటా ఉన్నందునే చివరకు ఆ నాయకులు ఎవరికి వారు సర్దుకు పోయినట్లు తెలిసింది. అయితే ఒకరిద్దరు జిల్లా నాయకులు మాత్రం ఆ క్వారీల్లో లభించే గ్రానైట్ వేస్టును విక్రయించుకొని ఆదాయం పొందే అవకాశాన్ని తమ మనుషులకు ఇప్పించుకున్నారు.

ఫలితాలు వచ్చినరోజే పరార్

గత ఎన్నికల ఫలితాల రోజే ఆ క్వారీల నుంచి అటు అవినాష్ మామ ప్రతాప్‌రెడ్డి ఇటు వైవీ మనుషులు పలాయనం చిత్తగించారు ఆ క్వారీల్లో పనిచేసే యంత్రాలు, నిర్మాణాలతో గాని వీరికి ఎలాంటి సంబంధం లేదు. కార్మికులు కూడా ఎప్పటి నుంచో పనిచేసే వారే. దీంతో జనం జగన్‌ను ఇంటికి పంపి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టేలా ఫలితాలు రాగానే క్వారీల నుంచి వెళ్లిపోయారు. ఇదేసమయంలో టీడీపీకి చెందిన ఒక ప్రముఖ కుటుంబంతో ఉన్న బంధుత్వం, పరిచయాలతో రాఘవరెడ్డి పైస్థాయిలో సానుకూలత ఏర్పాటు చేసుకొని తన క్వారీల్లోకి తిరిగి ప్రవేశించారు. వైవీ అనుచరులు నిర్వహించిన క్వారీల్లోకి కూడా తిరిగి పల్లవ సంస్థ ప్రవేశించి పెరల్‌కు లీజు పునరుద్ధరణ ప్రయత్నంలో ఉంది.



రామాయపాలెం వ్యూ

రెండు కుటుంబాల మధ్య వివాహ వేడుకతో కక్షలు కార్పణ్యాలు మాయం

- చదువులో దూసుకుపోతున్న యువత
- ఊరంతా కలిసి అభివృద్ధివైపు అడుగులు
- రోడ్లు, ఆలయాల నిర్మాణం, నీటి సౌకర్యాలతో ముందడుగు
- విరోధాలు వదిలిన గ్రామానికి రాజకీయంగానూ తోడ్పాటు

ఆసక్తికరంగా రామాయపాలెం చరిత్ర

పల్లెను బాగుచేసిన పెళ్లి

అదో చిన్న కుగ్రామం. అక్కడ ఒకే సామాజిక తరగతికి చెందిన 100 కుటుంబాలు నివాసం ఉంటాయి. ఎర్రమోతు, మలసాని కుటుంబాల మధ్య 60 ఏళ్ల క్రితం ఒక ఇంటి స్థలంపై ఏర్పడిన వివాదం చినికిచినికి గాలివానగా మారి 30 ఏళ్లపాటు కక్షలు కార్పణ్యాలతో కుటుంబాలు రగిలిపోయాయి. సమీప బంధువులు సైతం శత్రువులుగా మారి కత్తులు దూసుకునే వరకు వెళ్లాయి. ఆ గ్రామమే మద్దిపూడి మండలంలోని రామాయపాలెం. ఓ వివాహంతో ఆ గ్రామంలో శాంతి నెలకొంది. మలసాని కుటుంబానికి చెందిన నాగేశ్వరరావుతో ఎర్రమోతు కుటుంబానికి చెందిన రాధకు 1994లో వివాహం చేయడంతో బంధుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి రెండు వర్గాలు ఒకేమాట ఒకేబాటగా కలిసిపోయాయి. గ్రామ అభివృద్ధికి బాటలు వేశాయి. ఆసక్తికరంగా ఉన్న ఈ గ్రామ ప్రత్యేకతపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న కథనం...

మద్దిపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొన్నేళ్ల క్రితం రామాయపాలేనికి చెందిన యర్రమోతు లక్ష్మయ్య, మలసాని గురవయ్య కుటుంబాలు గ్రామంలో పెద్దవి. ఇంటి స్థలం సమస్యలో ఇరు కుటుంబాల మధ్య వివాదం చెలరేగింది. కొట్లాటలు జరిగి.. కేసులు పెట్టుకొని.. కోర్టుకెక్కారు. కోర్టుకెళ్లారు. అక్కడి నుంచి గ్రామంలో భయానక వాతావరణం ఉండేది. ఏ ఎన్నికలొచ్చినా నువ్వా నేనా అన్నట్టు సాగేవి. పోట్లాటలు దాటి కొట్లాటల వరకు వెళ్లేవి. మలసాని, ఎర్రమోతు కుటుంబాల మధ్య బంధుత్వం ఏర్పడ్డాక ఆ గ్రామంలో ఘర్షణలు ఆగిపోయాయి. ఎన్నికల్లోనూ ఐక్యంగా ముందుకెళుతున్నారు. గ్రామస్థులు స్థానిక సంస్థల ఎన్నికల్లో మలసాని నాగేశ్వరరావును రెండు సార్లు సర్పంచిగా గెలిపించారు. మరో రెండుసార్లు ఆయన బలపరిచిన అభ్యర్థులు సర్పంచులుగా గెలిపించారు. ప్రస్తుతం నాగేశ్వరరావు సతీమణి రాధ సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. విరోధులు సైతం అన్నీ మర్చిపోయి సోదర భావంతో కలిసిపోయారు. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా తమ పిల్లలను చదివించి ప్రయోజకులను చేశారు. గ్రామానికి చెందిన అనేకమంది యువకులు అమెరికా, లండన్, ఆస్ట్రేలియాల్లో స్థిరపడ్డారు. మరికొంత మంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

- అభివృద్ధికి దామచర్ల వేసిన పునాదికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మరింత పదును పెట్టారు.
- దారిడొంక లేని రామయపాలేనికి ప్రస్తుతం మూడువైపులా రూ.కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయించారు. నియోజవర్గ కేంద్రమైన కొండపికి, జిల్లా కేంద్రమైన ఒంగోలుకి, మండల కేంద్రమైన మద్దిపూడికి రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి.
- ఇటీవల గ్రామంలో మిగిలిపోయిన అంతర్గత రోడ్లను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.30 లక్షల నిధులు కేటాయించారు. వాటితో గ్రామంలోని ప్రధాన రహదారులన్నీ సిమెంట్ రోడ్లుగా మారాయి.
- ప్రతి శివరాత్రికి, సంక్రాంతికి కార్తిక మాసంలో గ్రామస్థులంతా కలిసి బంధుమిత్రులతో సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మొత్తం మీద మూడు దశాబ్దాల పాటు కక్షలు, కార్పణ్యాలతో అట్టుడికిన పల్లెలో ఓ వివాహం కారణంగా శాంతి సౌరభాలు వెదజల్లడమే కాకుండా అభివృద్ధి రూపురేఖలు మారిపోవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దామచర్ల బాటలోనే మంత్రి స్వామి



రూ.3 కోట్లతో నిర్మించిన శివాలయం

దామచర్ల చొరవతో అభివృద్ధికి నాంది

- కక్షలు వదిలి ఐక్యంగా నిలిచిన రామాయపాలెం అభివృద్ధికి రాజకీయంగా తోడ్పాటు లభించింది.
- దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు హయంలో గ్రామాభివృద్ధికి నాంది పలికారు.
- చిమట అట్లేరు నుంచి రామాయపాలెం చెరువుకు సప్లయి చానల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. సప్లయ్ చానల్ వల్ల భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయం అభివృద్ధి చెందింది.
- గ్రామంలో అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి



ఐక్యమత్యంతోనే అభివృద్ధి సాధ్యమని నిరూపితమైయింది. గ్రామానికి చెందిన ఎన్నారైలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు గ్రామాభివృద్ధిలో కలిసి రావడం మంచి పరిణామం. గ్రామంలో నిర్వహించే సంబరాల్లో గ్రామస్థులు ఐక్యంగా పాల్గొనడం సంతోషాన్ని కలిగిస్తోంది. ఇదేవిధంగా భవిష్యత్తులో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా. - మలసాని కోటేశ్వరరావు



విశాలమైన సీసీ రోడ్డుతో సుందరంగా రామాయపాలెం

ఎన్ఆర్ఐల సహకారంతో అభివృద్ధి

- ఇతర దేశాల్లో, రాష్ట్రాల్లో స్థిరపడిన యువకులు జన్మభూమిపై మమకారంతో గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు.
- రూ.10 లక్షలు ఖర్చుపెట్టి శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుద్ధజల కేంద్రం నిర్వహణ గ్రామస్థులకే అప్పగించారు.
- గ్రామంలో ఐక్యతకు చిహ్నంగా ఆంజనేయ స్వామి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహం చుట్టూ గ్రానైట్ రాళ్లతో అతి సుందరంగా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు.
- గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని రూ.2 కోట్లుపైగా వెచ్చించి పునర్నిర్మించారు.
- గ్రామం నలువైపులా గమిటి రాళ్ల, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలను గ్రామస్థులంతా కలిసి ఐక్యంగా నిర్వహించారు. రామాలయాన్ని పునర్నిర్మించారు.



ఎర్రకొండ వద్ద అక్రమ మైనింగ్‌పై విచారణ చేస్తున్న తహసీల్దార్, మైనింగ్ అధికారులు

ఎట్టకేలకు కదలిక

- ఎర్రకొండలో అక్రమ మైనింగ్‌పై విచారణ
- ముందస్తు సమాచారంతో కనిపించని టిప్పర్లు, యంత్రాలు

తాళ్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. మండలంలోని వెలుగువారిపాలెం ఎర్రకొండలో జరుగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలను గుర్తించేందుకు మైనింగ్, రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. 'కొండను కొల్లగొడుతున్నారు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాలతో తహసీల్దార్, మైనింగ్ అధికారులు ఎర్రకొండను పరిశీలించారు. అయితే, అధికారులు వస్తున్నట్లు సమాచారం అందడంతో టిప్పర్లను, యంత్రాలను అక్కడినుంచి తరలించారు. ఇరుశాఖల అధికారులు తమవద్ద రికార్డుల ఆధారంగా గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని గుర్తించారు. గ్రామపంచాయతీ తీర్మాణం మేరకు 1.50హెక్టార్ల విస్తీర్ణంలో గ్రావెల్ తరలింపునకు అనుమతి ఉందని మైనింగ్ అధికారులు వెల్లడించారు. గతంలో రత్నా గ్రానైట్స్ 13.50హెక్టార్ల భూమిలో గ్రానైట్ తవ్వకానికి అనుమతి తీసుకోగా రెండేళ్ల క్రితమే లీజ్ రద్దయినట్లు వెల్లడైంది. లీజ్ రద్దయి ప్రభుత్వ భూమిగా ఉన్నప్రాంతంలో దాదాపు వంద అడుగుల మేర గ్రావెల్‌ను తవ్వి తరలించారు. మైనింగ్ అధికారులు మాత్రం తమ పరిధిలో అక్రమ మైనింగ్ జరిగినట్లు కొంత మేర గుర్తించారు. రెవెన్యూ అధికారులు మాత్రం రెవెన్యూ పరిధిభూమిలో ఎంతమేర అక్రమంగా గ్రావెల్ తవ్వారో నిర్ధారించేందుకు పూర్తిస్థాయిలో సర్వే జరపనున్నట్లు తెలిపారు. ఎర్రకొండలో ఎన్ని ఎకరాల్లో గ్రావెల్ తరలింపునకు అనుమతి ఇచ్చారు, ఎంతమేర గ్రావెల్ తరలించాలని గ్రామస్థులు అధికారులను ప్రశ్నించినా స్పష్టమైన సమాధానం చెప్పలేక నీళ్లనమిలారు. ఇరుశాఖల అధికారులు సర్వే చేసినట్టు సంతకాలు పెట్టాలని గ్రామస్థులను కోరగా నిరాకరించారు. పూర్తిస్థాయిలో సర్వే జరిపి ఎంతమేర అక్రమంగా గ్రావెల్ తరలించారో నిర్ధారించాలన్నారు. అప్పటివరకు సంతకాలు పెట్టబోమని గ్రామస్థులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు, గనులశాఖ సర్వేయర్ ఆసిఫ్, సాంకేతిక నిపుణులు శీలం సురేష్, రెవెన్యూ అధికారులు ఏసుదాసు, ఏసురత్నం, వీఆర్‌వోలు శివారెడ్డి, రమణారెడ్డి, విలేజ్ సర్వేయర్లు మల్లికార్జున, భవానీ, టీడీపీ నాయకుడు సీహెచ్ వీరనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు నిర్ధారణైతే చర్యలు

రెవెన్యూ, మైనింగ్ అధికారులు జాయింట్ సర్వేలో తనిఖీ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా అక్రమ మైనింగ్ పాల్పడిన వ్యక్తులపై నిబంధనలమేరకు చర్యలు తీసుకుంటామని భూగర్భ, గనుల శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ ఉన్నతాధికారులకు నివేదించారు. తనిఖీ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా అక్రమంగా గ్రావెల్ తరలించిన వారికి సంజాయిషీ నోటీసులు ఇస్తామన్నారు. తదుపరి నిర్ధారణ చేసుకున్న తర్వాత అపరాధ రుసుం ఏమేరకు కట్టాలో డిమాండ్ నోటీస్ ఇస్తామని చెప్పారు. అక్రమ తవ్వకాలు జరుగకుండా కట్టడి చేస్తామని నివేదించారు.

కందులు కొనుగోలు చేస్తాం

- 12 నుంచి పంట వివరాలు నమోదు
- జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కందులను కొనుగోలు చేసేందుకు ఈనెల 12వ తేదీ నుంచి రైతు సేవా కేంద్రాలలో పంట వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ కోరారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో మంగళవారం మార్క్‌ఫెడ్, సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా గుర్తించి ఖరీఫ్ 2024 కంది పంట ఉత్పత్తులను మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో 70,817 హెక్టార్లలో 73,091 మంది రైతులు కంది పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్నారన్నారు. 72,391 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా వేశామన్నారు.

అందువల్ల రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ద్వారా ఎక్కువ లాభం పొందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో కంది సాగుచేసిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకునే సమయంలోనే పంట నూర్పిడి తేదీని కూడా నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా సరుకును అమ్ముకునే తేదీ రిజిస్టర్ మొబైల్ నెంబరుకు సమాచారం వస్తుందన్నారు. డబ్బులు ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు అకౌంట్లలో జమచేస్తామని, అందువల్ల రైతులు రైతుసేవా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు



మార్క్‌ఫెడ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ముఖహాజరు కష్టాలు

- సక్రమంగా నమోదు కాక జీతం కట్
- కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఆందోళన
- ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోని పరిస్థితి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ముఖహాజరు నమోదు కాక ఇబ్బంది పడుతున్నారు. ముఖ హాజరు నమోదుకు సంబంధించి జిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి అమలుచేస్తున్నారు. అయితే మారుమూల ప్రాంతంలో ఉద్యోగులు హాజరు నమోదు కాకపోవడంతో వారు విధులకు హాజరుకానట్లుగా నమోదవుతుంది. దీంతో జీతాల్లో కోత పెడుతుండటంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య పథకం కింద జిల్లావ్యాప్తంగా 600 మందికిపైగా పనిచేస్తున్నారు. వారంతా ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబరు 1 నుంచి కాంట్రాక్టు ఉద్యోగులు ముఖహాజరు నమోదు చేస్తేనే జీతాలు చెల్లింపులు ఉంటాయని ప్రకటించారు. వారంతా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంతోపాటు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసత్రులలో పనిచేస్తున్నారు. పనిచేసే చోటి నుంచే మొబైల్ ఫోన్ నుంచి హాజరు నమోదు చేయాల్సి ఉంది. అయితే అక్కడ సెల్‌ఫోన్ సిగ్నల్స్ సక్రమంగా ఉండకపోవడంతో, సిగ్నల్స్ ఉన్నా నెట్‌వర్క్ లేకపోవడం వంటి కారణాలతో ముఖహాజరు నమోదు కావడం లేదు.

అందరికీ కట్

ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు హాజరువుతున్నా ఉద్యోగి ముఖహాజరు నమోదు కాకపోతుండటంతో వారికి ఆరోజు జీతం పోయినట్లే. ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు అనేకసార్లు ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నా ఇంత వరకు సమస్య పరిష్కరించలేదు. కొత్త విధానం అక్టోబరు నెలలో ప్రారంభించగా నవంబరు నెలలో జీతంలో ఒక్కొక్క ఉద్యోగికి నెలకు రూ.4 వేల నుంచి ఆరువేల వరకు కోత పడింది. తామంతా విధుల్లో ఉన్నా జీతం కట్ అయిందని కలెక్టర్ నుంచి వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల వరకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. కొన్నిచోట్ల ముఖహాజరు వేసినా ఉద్యోగి హాజరుకాలేదని నమోదవుతోంది. ఇలా అనేక సమస్యలతో వైద్యశాఖలో పనిచేసే ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఉద్యోగుల జీతం కట్ కాకుండా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు ఉద్యోగులు కోరుతున్నారు.

కొప్పోలురోడ్డులో అక్రమ కట్టడాలకు నోటీసులు

- 16వ తేదీలోపు తొలగించాలన్న అధికారులు

ఒంగోలు(రూరల్), డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి అక్రమంగా కట్టడాలు చేసిన వారికి మంగళవారం 9వ డివిజన్ సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది నోటీసులు ఇచ్చారు. గృహాల వద్ద లేని వారి తలుపుల వద్ద నోటీసులు అంటించారు. అదేవిధంగా నాగార్జునసాగర్ కాలువ ఆక్రమించి గృహాలు నిర్మించిన వారికి కూడా నోటీసులు ఇచ్చారు. ఈ నాగార్జున కాలువ నుంచి ఒంగోలు నగరంలోని మురుగు నీరు పోతురాజుకాలువకు ప్రవహిస్తుంది. ఈనెల 16వ తేదీలోపు ఆక్రమణలను తొలగించాలంటూ నోటీసులో ఆదేశించారు.



ఇళ్లకు నోటీసులు అందజేస్తున్న ఉద్యోగులు

మొత్తం 50 మంది ఆక్రమణదారులకు ఈ నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.శ్రీకాంత్, వీఆర్వో ఎం.రమ, హెడ్‌కానిస్టేబుల్ జి.సుభాంజనేయులు, శానిటరి కార్యదర్శి నారాయణరెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

- కీలక అంశాలపై నివేదికతో పాల్గొంటున్న కలెక్టర్ అన్సారియా
- పలు శాఖల అధికారులతో సమీక్ష
- వీసీ ద్వారా ఇతర శాఖల అధికారుల హాజరు

ఒంగోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో కలెక్టర్ల సదస్సు జరగనుంది. అమరావతిలోని సచివాలయంలో జరిగే ఈ సదస్సులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహిస్తారు. మంత్రివర్గం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ముఖ్యకార్యదర్శులందరూ పాల్గొనే ఈ సదస్సులో ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, ఆయా జిల్లాల్లో ఎలా జరుగుతుంది, అలాగే కీలకమైన అభివృద్ధి అంశాలు, వాటి కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష చేయనున్నారు. వ్యక్తిగతంగా మాట్లాడే అవకాశం తక్కువ కావడంతో ఆయా శాఖల వారీ అంశాలపై నివేదికలు ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. నాలుగు రోజుల క్రితమే అందుకు సంబంధించిన అజెండాను జిల్లాలకు పంపడంతో తదనుగుణమైన నివేదికలతో ఈ సదస్సుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరుకానున్నారు. ప్రభుత్వం సూచించిన పథకాల పురోగతి నివేదికలతో పాటు కీలకమైన వెలిగొండ, జాతీయ రహదారులు, రైల్వే లైన్ల భూసేకరణ, జలజీవన్ మిషన్, పర్యాటక రంగ అభివృద్ధి, ఇతరత్రా కొన్ని అంశాలను ప్రత్యేకంగా నివేదిస్తున్నట్లు సమాచారం. సచివాలయంలో జరిగే కలెక్టర్ల సదస్సుకు జిల్లాల్లో ఇతర అందరూ ముఖ్యమైన అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యేలా ప్రభుత్వం ఆదేశించింది. దీంతో రెండు రోజుల సదస్సుకు ఇక్కడి ప్రకాశం భవన్ నుంచి కీలక శాఖల అధికారులు వీసీ ద్వారా హాజరుకానున్నారు. ఇదిలా ఉండగా కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై మంగళవారం రోజంతా ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ విస్తృతంగా సమీక్షలు చేశారు. వెలిగొండపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఉండటంతో ఆ ప్రాజెక్టు అంశాలపై అటు ఇంజనీరింగ్, ఇటు భూసేకరణ, పునరావాసానికి సంబంధించి అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

పేదలకు నాణ్యమైన భోజనం అందించాలి

● కమిషనర్ వెంకటేశ్వరరావు
● అన్న క్యాంటీన్లు, అక్షయపాత్ర వంటశాలల తనిఖీ


క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అతి తక్కువ ధరకే ఆకలి తీర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లలో అందించే ఆహారం అందరూ మెచ్చేలా నాణ్యతగా, రుచిగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని అన్న క్యాంటీన్ల ద్వారా అందిస్తున్న అక్షయ పాత్ర వంటశాలను, అలాగే నగరంలోని పలు అన్న క్యాంటీన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజు పేదలకు అన్న క్యాంటీన్లలో అందించే ఆహారం నాణ్యతతో ఉండాలన్నారు. అలాగే వంటశాలలో పరిశుభ్రత పాటించాలని, ఆహారపదార్థాలకు అవసరమయ్యే సరుకులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరింత మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం అన్నక్యాంటీన్లను తనిఖీ చేసిన కమిషనర్, ఒక్కో కేంద్రంలో మూడు పూటలా ఎంతమందికి ఆహారం అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో పలువురు ప్రజలో మాట్లాడారు.

సత్యసాయి మందిరంలో నిర్మాణానికి విరాళం


చెక్కును అందజేస్తున్న ఎన్ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం మండమూరు రోడ్డు జడ్పీకాలనీలోని భగవాన్ సత్యసాయి మందిరంలో ఉన్న పేద విద్యార్థుల స్కూలులో రెండు రూముల నిర్మాణానికి దాతలు మంగళవారం రూ.19 లక్షల విరాళాన్ని అందజేశారు. సంతనూతలపాడుకు చెందిన ఎన్ఆర్ఐ సూదనగుంట రాఘవేంద్రప్రసాద్, ఆయన సతీమణి కళ్యాణిలు ఇందుకు సంబంధించిన చెక్కును మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు, తమ జిల్లాకు సేవ చేయాలనే ఉద్దేశంతో విరాళాన్ని అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీమన్నారాయణ, వీసీహెచ్.సుబ్బారావు, సిద్ద సాయిబాబు, చంద్రశేఖర్‌రెడ్డి, శనిగేపల్లి సుబ్బారావు, మంత్రి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు


గాయపడిన సాయినందకిశోర్

నాగులుప్పలపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపుతప్పి యువకుడు గాయపడిన సంఘటన నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రోడ్డులో జరిగింది. అద్దంకి పట్టణానికి చెందిన సాయి నందకిశోర్ బి.నిడమానూరు గ్రామంలోని మేనమామ సుబ్బారావు వద్ద ఉంటూ ఒంగోలులో కంప్యూటర్ కోర్సులు నేర్చుకొంటున్నారు. ఈక్రమంలో మంగళవారం క్లాసులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతున్న క్రమంలో నిడమానూరు వద్ద రోడ్డు మరమ్మతులకు తోలిన కంకర కుప్పల వద్ద జారి పడడంతో ఆయన గాయపడ్డారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో ఒంగోలుకు తరలించారు.

చెప్పుల బంకులో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

టంగుటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెప్పుల బంకులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈసంఘటన టంగుటూరులోగల కొండపి రోడ్డులోని స్టేట్ బ్యాంకు వరుసలో ఉన్న దుకాణంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్టేట్ బ్యాంకు పక్కన స్థానిక అరుంధతీనగర్‌కు చెందిన పసుమర్తి కోటేశ్వరరావు చెప్పులు కుట్టుకుంటూ అమ్ముకోవడంతోపాటు బంకు ఒకటి నిర్వహిస్తున్నాడు. రోజూలాగే బంకు నిర్వహించిన కోటేశ్వరరావు చీకటిపడగానే యథావిధిగా షాపు మూసి ఇంటికి వెళ్లాడు. ఇంతలో ఒక్కసారిగా బంకులోనుండి మంటలు వచ్చాయి. మంటల దెబ్బకు బంకు, అందులోని చెప్పులు అగ్నికి కాలిపోయాయి. అక్కడి వారు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈప్రమాదం వలన రూ.2లక్షల విలువైన చెప్పులు కాలిపోయినట్లు బాధితుడు కోటేశ్వరరావు వాపోయారు. ప్రమాదానికి కారణం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయిఉండవచ్చని అనుమాస్తున్నారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేను పక్కాగా నిర్వహించాలి


సూచనలు ఇస్తున్న జడ్పీ సీఈవో

చీమకుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వేను పక్కాగా నిర్వహించాలని జడ్పీ సీఈవో చిరంజీవి తెలిపారు. మంగళవారం ఆయన రామతీర్థం పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించారు. మైక్రో, స్మాల్, మీడియం పరిశ్రమలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. నిర్ణీత గడువులోపు సర్వే కచ్చితంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహకారం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి


ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భారతి

ఒంగోలు(క్రైం), డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): ఖైదీలకు ఉచిత న్యాయ సహకారం ప్రభుత్వం అందిస్తుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి పేర్కొన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఒంగోలులోని జిల్లా జైలులో ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయాధికారి భారతి మాట్లాడుతూ ఉచిత న్యాయ సహకారం అవసరమైన వారికి న్యాయసేవాధికారి సంస్థ ద్వారా అందిస్తామన్నారు. ఖైదీలకు జైలులో మౌలిక సదుపాయలతో పాటు వారి కుటుంబసభ్యులు కలిసేందుకు ములాఖత్‌లు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. జిల్లా న్యాయ సేవసహకార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు మాట్లాడుతే జైలులోని గ్రంథాలయంలో అనేక రకాల పుస్తకాలు ఉన్నాయిని, అవి చదువుకొని జీవితాన్ని మంచిగా మార్చుకోవాలన్నారు. తొలుత జైలును పరిశీలించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో జైలు ఇన్‌చార్జి పర్యవేక్షణాధికారి వి.రమేష్, మెడికల్ ఆఫీసర్ బ్రహ్మతేజ తదితరులు పాల్గొన్నారు.

15 లోగా పంటల బీమా పొందాలి : ఏవో

నాగులుప్పలపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగుచేసిన రైతులు ఈ నెల 15వ తేదీ పంటల వారీగా ప్రీమియం నగదు చెల్లించి బీమా పొందాలని ఏవో వెంకట్రావు సూచించారు. మండలంలోని చేకూరపాడు, చదలవాడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రబీలో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. వరి ఎకరానికి రూ.215, శనగ రూ.368, మిరప రూ.525, మినుము రూ.103, జొన్న రూ.60 చొప్పున చెల్లించి బీమా పొందాలని తెలిపారు. రాయితీపై వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామని ఆయన చెప్పారు. అనంతరం సాగు చేసిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో చేకూరపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

నేడు నోటిఫికేషన్ ● 14న ఎన్నిక

కొండపి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి చెరువుల నిర్వహణలో భాగంగా ఆయకట్టు, సాగునీటి వనరుల రక్షణ, జవాబుదారీతనం కోసం సాగునీటి సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనుంది. సాగునీటి సంఘాలకు కమిటీల ఏర్పాటు ద్వారా రైతులు చెరువులను కాపాడుకోవడంతోపాటు ప్రభుత్వం సాయం అందిపుచ్చుకుని చెరువుల అభివృద్ధి, నిర్వహణకు వీలు కలుగుతుంది. అందులో భాగంగా మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఆరుగురు సభ్యులను రైతులు ఎన్నుకోవాల్సి ఉంటుంది. వీరిలో నుంచి ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోనున్నారు. ఈప్రక్రియ నిర్వహణలో భాగంగా బుధవారం నోటిఫికేషన్ వెలువడనుంది. తహసీల్దార్ కార్యాలయాల వద్ద నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల నోటిఫికేషన్ విషయాన్ని ప్రచారం చేస్తారు. 14వ తేదీన ఎన్నికను పూర్తి చేస్తారు. 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఆయా చెరువులకు ఆరుగురు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులుగా ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 1 గంట నుంచి వీరిలో నుంచి ఒక అధ్యక్షుడిని, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. 5వేల ఎకరాలలోపు ఆయకట్టు ఉన్న చెరువులను మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలో ఉన్నాయి. 5నుంచి 25 వేల ఎకరాల్లోపు ఆయకట్టు ఉన్న చెరువులు మీడియం ప్రాజెక్టులుగా ఉండగా, 25 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్నవి మేజర్ ప్రాజెక్టులుగా కొనసాగుతున్నాయి.

ఒక మీడియం, 37 మైనర్ ఇరిగేషన్ కమిటీలకు ఎన్నికలు..

కొండపి నియోజవకర్గంలోని ఆరు మండలాల్లోని ఒక మీడియం ప్రాజెక్టుకు, 37 సాగునీటి చెరువుల కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. కొండపి మండలంలో ఆరు, టంగుటూరు మండలంలో 3, జరుగుమల్లి మండలంలో 3, పొన్నలూరు మండలంలో 5, మర్రిపూడి మండలంలో 13, సింగరాయకొండ మండలంలో 7 మైనర్ ఇరిగేషన్ చెరువులకు సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. సింగరాయకొండ మండలంలోని పీబీ ఛానల్ మీడియం ప్రాజెక్టుకు కమిటీని దీని పరిధిలోని కె.బిట్రగుంట, సోమరాజుపల్లి-1, పాకల-1, -2, జరుగుమల్లి మండలంలోని బింగినపల్లి మైనర్ ఇరిగేషన్ చెరువుల కమిటీ ఛైర్మన్‌లుగా ఎన్నికైన వారిలో నుంచి ఈప్రాజెక్టుకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లుగా ఎన్నిక కావాల్సి ఉంటుంది.

రంగంలోకి ఆశావహులు

సాగునీటి సంఘాలకు ఛైర్మన్‌లుగా కొనసాగేందుకు అధికార పార్టీ నుంచి ఇప్పటికే పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. అన్ని మండలాల్లో కమిటీలు ఏకగ్రీవానికి అధిష్టానం ఇప్పటికే కసరత్తు ప్రారంభించగా, కొండపితోపాటు మరో రెండు మండలాల కేంద్రాల్లోని చెరువులకు అధికార పార్టీ నుంచి ఒక్కో చోట ఇద్దరు, ముగ్గురు అధ్యక్ష పదవి కావాలంటూ పార్టీపై ఒత్తిడి తెస్తున్నారు. వివాదాలు రాకుండా టీడీపీ నియోజవకర్గ అధిష్టాన నాయకులు గతంలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు సంఘాలకు అధ్యక్షులుగా పని చేసిన వారినే తిరిగి కొనసాగించే ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిసింది. అవసరాన్ని బట్టి కొన్నిచోట్ల మార్పులు చేసి ఏకగ్రీవంగా అధికార పార్టీ కైవసం చేసుకునేందుకు యత్నాలు ప్రారంభించింది.

జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు ప్రకటించాలి

● 13నుంచి సీపీఎం జిల్లా మహాసభలు
● జిల్లాకార్యదర్శి హనీఫ్


సమావేశంలో మాట్లాడుతున్న హనీఫ్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్రాభివృద్ధికి రూ10వేల కోట్ల ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని సుందరయ్యభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నిధులు కేటాయించేలా అధికార పార్టీ నేతలు ప్రభుత్వంపై వత్తిడి తేవాలన్నారు. కనిగిరిలో నిమ్జ్, దొనకొండలో పారిశ్రామిక కారిడార్ సాధనకు పోరాటాలు చేస్తామన్నారు. ప్రస్తుతం గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో ఉందని, ఆక్వా రంగం కుదేలైందని, ప్రభుత్వ విధానాలతో చిన్న పరిశ్రమలు దివాళా తీసే పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. ఆయా పరిశ్రమల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చీమకుర్తిలో ఈనెల 13వతేదీ నుంచి మూడు రోజుల పాటు సీపీఎం జిల్లా 13వ మహాసభలు జరుగుతాయన్నారు. తొలిరోజు చీమకుర్తి ఆర్టీసీ బస్టాండు నుంచి ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ప్రారంభ బహిరంగసభలో సీపీఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కారుసాల సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు హాజరవుతారని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 14,15తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటుందని, ప్రాజెక్టులపై చర్చించి భవిష్యత్ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పూనాటి ఆంజనేయులు, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానవ జీవితానికి మార్గదర్శి భగవద్గీత

● శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ


విజేతలను సత్కరిస్తున్న కమిటీ కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ జీవితానికి మార్గదర్శి భగవద్గీత అని, అది ఒక అద్భుతమైన గ్రంథమని శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధారమణ గుప్తా జంధ్యం పేర్కొన్నారు. కమిటీ ఆధ్వర్యంలో గీతాజయంతి సందర్భంగా 12వ అధ్యాయం భక్తియోగ శ్లోకాల పఠన పోటీ నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి 38మంది హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం ఒంగోలులోని బాపూజీ గోశాలలో జరిగిన పోటీలలో పాల్గొన్న వారికి కమిటీ తరపున ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి త్రిపురం మల్లిఖార్జునరావు, ఉపాధ్యక్షులు తూనుగుంట మల్లిఖార్జునరావు, సహకార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, సభ్యులు నూనె రామాంజనేయులు, చలువాది బ్రహ్మయ్య, దనిశెట్టి రామునాయుడు, సుంకు రఘు, బి.విజయరావు, తీగల సత్యవతి, దనిశెట్టి పావని, ముద్దు అరవింద లక్ష్మీ, దోగిపర్తి మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గీతాజయంతి సామూహిక పారాయణ

గీతాజయంతి సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి గీతా శ్లోకాల సామూహిక పారాయణ జరుగుతుందని స్థానిక మంగమూరు రోడ్డు శ్రీఅచలానంద ఆశ్రమ నిర్వాహకులు శ్రీ పరిపూర్ణ సిద్ధానంద తెలిపారు. భగవద్గీతలోని 700 శ్లోకాల పారాయణ జరుగుతుందని, కనుక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలి

● ఏకేయూ వీసీ మూర్తి


మాట్లాడుతున్న వీసీ మూర్తి

ఒంగోలు విద్య, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటున్నా మానవ హక్కుల పరిరక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానులే అన్న విషయాన్ని కూడా సమాజం గుర్తించాలన్నారు. ఒంగోలులోని యూనివర్శిటీ సెమినార్ భవన్‌లో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సభ ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీసీ మూర్తి మాట్లాడుతూ బాలికల విషయంలో 18సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు తల్లి సంరక్షణలో జీవించాలన్నదే ప్రధాన ఉద్దేశమన్నారు. ఆర్టికల్ 21 ద్వారా దేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవించే హక్కును కలిగి ఉన్నాడనితెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులను కాపాడటం అందరి బాధ్యత

ఒంగోలు(కల్చరల్): హక్కులను పరిరక్షించటం ప్రతి ఒక్కరి బాధ్యతని సృష్టి ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ తిమ్మిరి రవీంద్ర అన్నారు. మంగళవారం స్థానిక పేస్ ఎన్.ఆర్.ఒలంపియాడ్‌లో నిర్వహించిన మానవ హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నేషనల్ డిప్యూటీ ఛైర్మన్ తిమ్మిరి భానుచందర్, స్కూల్ డైరెక్టర్ నాగేశ్వరరావు, టి.నాగేంద్రబాబు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులను కాపాడాలి : మేయర్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులో నిర్వహించిన ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం వేడుకలకు పీడీ తేళ్ల రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ మాట్లాడుతూ దివ్యాంగుల పొదుపు గ్రూపులను బలోపేతానికి కృషి చేయాలన్నారు. గ్రూపులో లేని వారిని పొదుపు సంఘాలుగా తయారు చేయాలని చెప్పారు. పీడీ రవికుమార్ రుణాల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజరు శ్రీనివాసరావు, స్కిల్ డవలప్‌మెంట్ అధికారి రవితేజ, సైకాలజిస్ట్ ఏడుకొండలు, గ్రంథాలయసంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, పి.బాలు, సులోచన, సురేష్, శ్రీనివాసరెడ్డి, శివకృష్ణరెడ్డి, రాజు పాల్గొన్నారు.

కార్మికుడు అనుమానాస్పద మృతి

మద్దిపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి గుండ్లాపల్లిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. గుండ్లాపల్లిలోని జ్యోతి గ్రానైట్‌లో గోరిపర్తి లీలాకృష్ణ(31) గత నాలుగేళ్లుగా కార్మికుడిగా పనిచేస్తున్నారు. యథాప్రకారం మంగళవారం విధుల్లోకి వెళ్లాడు. సాయంత్రం అతను అనుమానాస్పదంగా మృతి చెంది ఉండటం గమనించి తోటి కార్మికులు పోలీసులకు సమాచారం అందజేశారు. అది ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

16నుంచి శిక్షణ తరగతులు

మద్దిపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధిపై ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.జ్యోతి మంగళవారం తెలిపారు. మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఈ తరగతులకు గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

శనగపంటపై వేపనూనెను పిచికారీ చేయాలి


వరిపైరును పరిశీలిస్తున్న ఏవో కిషోర్‌బాబు

ఒంగోలు(రూరల్), డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): శనగ పంటసాగు చేసి 25రోజులు దాటినట్లయితే తెగుళ్ల నివారణకు వేపనూనె ను పిచికారీ చేయాలని ఏవో జి.కిషోర్‌బాబు తెలిపారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం ఒంగోలు మండలంలోని దేవరంపాడు, కొత్త మామిడిపాలెం గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. దేవరంపాడులో వరి పైరు, కొత్తమామిడిపాలెంలో శనగపంటను సందర్శించి పంటల బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వాసు, ఏఈవోలు రామకృష్ణారెడ్డి, ఆదిమూర్తి, దేవరంపాడు సర్పంచ్ నన్నపనేని వెంకటేశ్వరరావు, సాగి కృష్ణంరాజు, సాగి వెంకటపతిరాజు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: రైతులు సాగుచేసిన పంటలకు బీమా చేయించుకోవాలని ఏవో జి.రమేష్‌బాబు కోరారు. మంగళవారం మల్లవరం, కొలచనకోట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీలోపు పంటలకు బీమ్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: మండలంలోని పి.తక్కెళ్లపాడు, గుమ్మళంపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా ఏవో పావని ఆయా గ్రామాల్లోని వరి, మినుము, కందిపంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న అతిథులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఏబీఎం హైస్కూలు, జూనియర్ కాలేజీల్లో సెమీక్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాలేజీ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డి.శ్రీవాణి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హైస్కూలు కరస్పాండెంట్ కొమ్మూరి రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరించాలని కోరారు. అనంతరం కాలేజీ కరస్పాండెంట్ పుష్పరాజ్ పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యుల్లత, కె.నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంగముక్కపాలెంలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు నగరం వెంగముక్కపాలెంలోని అసెంబ్లీ చర్చిలో మంగళవారం సెమీ కిస్మస్ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో పాస్టర్ పాల్ సుధాకర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వాటర్‌క్యాన్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో పాస్టర్లు కోడూరి శేఖర్‌బాబు, ఎం.సురష్, ప్రసాద్, ఆంజనేయులు, తిమోతి పాల్గొన్నారు.

కరాటేలో కేంద్రీయ విద్యార్థికి గోల్డ్ మెడల్


బహుమతులు అందుకుంటున్న హితేష్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన అంబేడ్కర్ మెమోరియల్ నేషనల్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతున్న కర్పూరపు హితేష్ గోల్డ్ మెడల్ సాధించారు. గోల్డ్‌మెడల్, మెమోంటో, ధృవీకరణపత్రాలను తన చదువుతున్న కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందుకున్నారని కరాటే మాస్టర్ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా హితేష్‌ను పలువురు అభినందించారు.

అభివృద్ధి దాతలకు సన్మానం


దాతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బసవన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను అభివృద్ధికి పలువురు దాతలు ముందుకు వచ్చారు. ఇక్కడి వెల్‌నెస్ సెంటర్‌కు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ లభించడంపై గ్రామస్థులు, వైద్యులు శ్రావణ్, జగదీష్, శిరీష, వినీలచౌదరి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం దాతలు అబ్బూరి శేషగిరిరావు, గోవిందరాజులు, మండవ లక్ష్మీనారాయణ, కొప్పోలు విశ్వనాథం, పూనాటి చిన్నఅప్పారావు, మండవ రంగారావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, సర్పంచ్ రవి, వైద్యఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ కె.బాలకోటయ్య, సీహెచ్‌వోలు రజితకుమారి, లలితమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యుత్ వాహనాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేశంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఐదేళ్లలో విద్యుత్‌వాహనాల ఉత్పత్తి, పెంపుదల పథకాలు, ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలు, కేటాయించిన నిధులపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర భారీ పరిశ్రమలశాఖమంత్రి హెచ్‌డీ.కుమారస్వామి సమాధానం ఇస్తూ దేశంలో గత ఐదేళ్లలో రెండు ఉత్పత్తి అనుబంధిత ప్రోత్సాహపథకాల కింద రూ.44,038 కోట్లు ఖర్చు చేశామన్నారు. దేశంలో 257 తయారీ యూనిట్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు యూనిట్లు ఉన్నాయని చెప్పారు.

జనసేన పార్టీలో వైసీపీ నేతల చేరిక

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన పలువురు వైసీపీ నేతలు మాజీమంత్రి, జనసేన పార్టీ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో మంగళవారం ఒంగోలులో పార్టీలో చేరారు. వైసీపీ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు గంటా రామానాయుడు, చెన్నకేశవస్వామి ఆలయ డైరెక్టర్ కిరణ్‌కుమార్‌ల పార్టీలో చేరగా బాలినేని వారికి పార్టీకండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు ములగా రమేష్, ప్రచార కమిటీ కన్వీనర్ జడా బాలనాగేంద్ర యాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని రూపొందించాలి


వాటర్‌బాటిళ్లను అందజేస్తున్న సభ్యులు

మద్దిపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని రూపొందించడంలో భాగస్వాములు కావాలని ఎంఈవో ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాలలో సన్ హెల్పింగ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను, టీ కప్పులను నివారించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల భూమిలో సారం తగ్గుతుందన్నారు. చెట్ల పెంపకం ద్వారా ఆక్సిజన్ సమృద్ధిగా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చలగాల విజయ్‌కుమార్, టీఎస్.రావు, బోయలపల్లి సభాపతి, జేఈ కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వాటర్‌బాటిళ్లను పంపిణీ చేశారు.

మత్తు పదార్థాల నివారణపై అవగాహన

సింగరాయకొండ, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై సింగరాయకొండ ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి అవగాహన కలిగించారు. సింగరాయకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల జీవితాలు నాశనం అవుతాయని, వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై టి. రాజశేఖర్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.

రేషన్ దుకాణంపై అధికారుల దాడి


రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

టంగుటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలకూరపాడులోగల రేషన్‌షాపు నెం:12పై సోమవారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ సింగరాయకొండ డీటీ శివరామక్రిష్ణ ఆధ్వర్యంలో దాడి జరిగింది. ఈ దాడిలో అదనంగా దుకాణంలో నిల్వ ఉన్న 50 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. షాపు యజమాని వేణుపై 6ఏ కేసు నమోదు చేశారు. స్టాక్‌ను వీఆర్వోనరసింహారావుకు స్వాధీనపరిచారు. కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు డీటీ తెలిపారు.

నేడు, రేపు పోస్టల్ బీమా మేళా

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తపాలశాఖ జీవిత బీమా (పీఎల్ఐ), గ్రామీణ తపాల జీవిత బీమా (ఆర్‌పీఎల్ఐ) మెగా మేళా ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ ఎం. జాఫర్ సాధిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో వెయ్యి మందికి కొత్తగా తపాలా జీవిత బీమా కవరేజ్‌ను అందించడంతోపాటు, రూ.కోటి ప్రీమియం సమీకరణే ధ్యేయంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలోని అన్ని పోస్టాఫీసులలో నిర్వహించే మేళాను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్), డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలు పరిష్కరించటానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని, మండల ప్రత్యేకాధికారి, ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామంలో రెవెన్యూసదస్సు జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ నన్నపనేని వెంకటేశ్వరరావు దేవరంపాడు పరిధిలోని అక్కాచెరువు, జగ్గరాజు చెరువును సర్వే చేసి హద్దులు వేయించాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వాసు, సర్వేయర్ విష్ణు పాల్గొన్నారు.

ఎండ్లూరులో 12 అర్జీలు

సంతనూతలపాడు: ఎండ్లూరులో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 12 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈక్రమంలో 429/1ఎ1, 429/1ఎ2, 429/1ఎ3లో 0.50సెంట్లు కింద గ్రామానికి చెందిన ధవళగిరి రామారావు, దాసరి పద్మావతి, గుర్రం కృష్ణారావులకు 2004 సంవత్సరంలో డీకే భూమి కింద కేటాయించారు. దీనిని కొందరు ఆక్రమించి ఆన్‌లైన్ చేసుకున్న దానిపై న్యాయం చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బొమ్మినేని రామాంజనేయులు, సర్పంచ్ ఎస్.పుల్లయ్య పాల్గొన్నారు.

అవీ..ఇవీ

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఎస్ఈ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్య ఘర్ సోలార్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్.ఈ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక డా.బీఆర్. అంబేడ్కర్ ఆడిటోరియంలో సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ ఏఈలు, సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాయితీపై 1 కిలో వాట్స్ యూనిట్ కి రూ.30వేలు, 2కిలో వాట్స్ యూనిట్‌కి రూ.60వేలు, 3 కిలోవాట్స్ యూనిట్ పైన వాటికి 78వేలు రాయితీ ఇస్తోందన్నారు. మొత్తం విలువ రూ.2లక్షలు ఉంటుందని అన్నారు. రాయితీపై వచ్చే ఈ పథకం కావాల్సిన వారు స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందిని లేదా పీఎం సూర్యఘర్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ పథకంపై సిబ్బంది అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ బాకాయిలు చాలా ఉన్నాయని వాటి రికవరీపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయన్నారు. విద్యుత్ సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఏవో సుబ్బారావు, ఈఈ బీవీ నాగేశ్వరరావు, సబ్ డివిజన్ పరిధిలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేను వినియోగించుకోండి

పొదిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారులు ఎంఎస్ఎంఈ సర్వే చేసుకొని ఉపయోగించుకోవాలని నగరపంచాయతీ కమీషనర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వ్యాపారులు ఈసర్వేకు సహకరించాలన్నారు. సర్వే అండ్ సపోర్ట్ యాప్‌లో వ్యాపారులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈయాప్‌లో అప్‌లోడ్ అయిన వ్యాపారులకు అవసరమైతే ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈవిషయాన్ని పట్టణంలో మున్సిపల్ అధికారులతో కలిసి సర్వేను పరిశీలించి అవగాహన కల్పించామన్నారు.

వైద్యుల బదిలీలను నిలిపివేయాలి

- మెడికల్ కాలేజీ నిర్మాణపనులు ప్రారంభించాలి
- సీపీఎం నేతల డిమాండ్



వైద్యశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి). స్థానిక సర్వజన వైద్యశాలలో వైద్యుల బదిలీలను నిలిపి వేయాలని కోరుతూ వైద్యశాల వద్ద మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సోమయ్య మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న మెడకల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన వైద్యశాలలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులను బదిలీ చేయడం పశ్చిమ ప్రాంత ప్రజలకు వైద్యసేవలను దూరం చేయడమే అన్నారు. ఇటువంటి చర్యలను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలన్నారు. వైద్యసేవల కోసం ఈ ప్రాంతం ప్రజలు సుదూర ప్రాంతాలకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్ళాల్సి వస్తోందన్నారు. ఈ క్రమంలో కొందరు తమ ప్రాణాలకు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిచిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ప్రారంభించి వైద్యులను వైద్యశాలలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రఫీ, రూబెన్, రాజు, నన్నేషా, భాషా, సురేష్ కుమార్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

14న నీటి సంఘాలకు ఎన్నికలు

- తహసీల్దార్ చిరంజీవి



తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని తన చాంబర్‌లో తహసీల్దార్ చిరంజీవి మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని భూపతిపల్లి, తిప్పాయపాలెం వేములకోట, శివరాంపురం, పెద్ద యాచవరం, పెద్ద నాగులవరం, మార్కాపురం-2 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలు ఈ నెల 14న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు టీసీ మెంబర్ ఎన్నిక పూర్తవుతుందన్నారు. నీటి సంఘం ఎన్నికలలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ నెల 11న బుధవారం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించన్నుట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ సదస్సు మండలంలోని పెద్దయాచవరం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం నుంచి నిర్వహిస్తామన్నారు.

టీడీపీ అభ్యర్థులకు అశోక్‌రెడ్డి శుభాకాంక్షలు

గిద్దలూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తరఫున రాజ్యసభ సభ్యత్వం కోసం నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు బీద మస్తాన్‌రావు, సాన సతీష్‌ను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ ముఖ్య నాయకులతో నామినేషన్ వేసిన ఇరువురికి అభినందనలు తెలిపారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

పెద్దదోర్నాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11, 12వ తేదీలలో రెండు రోజులు, 16న, 17 తేదీన రెండురోజులు లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎల్ఎస్‌డీజీఎస్)పై ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులకు ప్రత్యేకశిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఎన్నికైన సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది హాజరు కావాలని ఆయన తెలిపారు.

భూ అక్రమాలకు చెక్

- రెవెన్యూ గ్రామసభలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి
- రైతుల నుంచి అర్జీలు స్వీకరించిన అధికారులు



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి) : భూ ఆక్రమణల నిరోధక చట్టంతో ప్రభుత్వ భూములు ఆక్రమించిన కబ్జాదారుల భరతం పడతామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోలభీమునిపాడులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు ఎమ్మెల్యే కందుల ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వ అదోగతి పాలైందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను బయటకు తీసి కబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ప్రజలకు కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : గ్రామీణ ప్రాంతాలలో ఉండే ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. మంగళవారం ఎర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 86 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ బాలకిషోర్ తెలిపారు. భూ సమస్యలు, చెంచు గిరిపుత్రుల నివాస పట్టాల కోసం, భూ హద్దుల కోసం ఆర్జీలు వచ్చాయన్నారు. వాటిలో 5 అక్కడికక్కడే ఆన్‌లైన్ చేశామన్నారు. అలాగే ఎప్పటినుండో నివాస పట్టా లేక ఇబ్బందులు పడుతున్న గిరిజన వృద్ధురాలు కుడుముల పొలమ్మకు సబ్ కలెక్టర్ చేతుల మీదుగా నివాస పట్టా అందజేశారు. కార్యక్రమంలో డీటీ నలగాటి మల్లికార్జున నాయుడు, సర్పంచ్ శ్రీశైలపతి నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి : మండల ప్రజలు రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని డీటీ షాజీద అన్నారు. మంగళవారం స్థానిక కంభాలపాడు పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. అసైన్డ్‌మెంట్, పట్టాల్యాండ్‌లో సమస్యలు, కుటుంబ భూముల భాగపంపిణీలో సమస్యలకు పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. సదస్సులో మొత్తం 67 అర్జీలు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఎక్కువగా ముటేషన్ కోసం దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఆర్ఐ నరసింహారావు, సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

తర్లుపాడు :మండలంలోని మంగళకుంట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ విజయభాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై వచ్చిన అర్జీలు స్వీకరించి 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఈవోఆర్‌డీ సుకుమార్, సర్వేయర్ సురేష్ కుమార్, వీఆర్‌వో మస్తానయ్య, పలు శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ అన్నారు.పెద్దారవీడులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పెద్దారవీడు రెవెన్యూ సదస్సులో 28 భూసంబంధ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఖలీల్, ఎంఆర్ఐ గోపి, వీఆర్వోలు,ప్రజలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మండలంలోని ఎగువ చెర్లోపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 12 అర్జీలు అందినట్లు తహసీల్దారు కే శాంతి తెలిపారు. అన్ని అర్జీలు పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు కోసం దరఖాస్తు చేశారని, పరిశీలించి త్వరలోనే సమస్య పరిష్కరించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి, గ్రామ ప్రజలు గ్రామంలో నెలకొన్న మరుగు గుంటలను పూడ్చాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసి పరిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయరు షేక్.చాంద్‌భాష, దోర్నాల పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావు, టీడీపీ టీఎన్‌టీయూసీ ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





మంగళకుంటలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్, పెద్దారవీడులో మాట్లాడుతున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

అదానీ గ్రూపు అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

సీపీఐ సీనియర్ నాయకులు చెన్నయ్య



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదాని గ్రూప్ కంపెనీల అవినీతిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో సమగ్ర విచారణ చేయించాలని సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ నాయకులు పిలుపులో భాగంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ డీటీ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. మణిపూర్‌లో జరిగిన హింసాత్మక పరిస్థితులపై పార్లమెంట్‌లో చర్చించాలని అన్నారు. సాయుద బలగాల ప్రత్యేక రక్షణ చట్టాని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఒప్పందాల కోసం ఆదాని నాలుగు రాష్ట్రాలలో దాదాపు రూ.2100 కోట్లు ముడుపులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వ హాయంలో ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా రూ.1750 కోట్లు ముడుపులుగా ముట్టినట్లుగా తెలుస్తోందన్నారు. దీని ఫలితంగా 25 సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రజలపై రూ.1,10కోట్ల మేర విద్యుత్ చార్జీల భారం పడు తుందన్నారు. ఈ అంశాలపై పార్లమెంటులో చర్చించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ.కృష్ణ గౌడ్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మన్నె సాంబశివరావు, మొగిలి చిన్నవెంకటేశ్వర్లు, చట్టం వీరయ్య తదితరులు ఉన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అంకమ్మరావు

మార్కాపురంరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బైకు అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన మార్కాపురం పట్టణంలో మంగళవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో నివాసం ఉంటున్న రాజు, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో మొదటి కుమారుడు కార్తీక్ రెండవ కుమారుడు యశ్విన్ (16)లు ఉన్నారు. వీరిలో కార్తీక్ గుంటూరు జిల్లా పేరేచర్లలోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. యశ్విన్ పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం వేకువ జామున కార్తీక్‌ను రైలు ఎక్కించేందుకు అన్న బైకుపై యశ్విన్ వెనుక కూర్చున్నాడు. అన్నదమ్ములు ఇంటి నుంచి రైల్వేస్టేష్‌కు వెళ్లే మార్గంలో రాయవరం వద్ద రైల్వే వర్ బ్రిడ్జిపై బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. దీంతో బైకు వెనుక కూర్చున్న యశ్విన్ తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ఘటన స్థలంలోనే ఆయన మృతి చెందాడు. బైకు నడుపుతున్న కార్తీక్ గాయాలతో బయటపడి వైద్యసేవలు పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్ఐ అంకమ్మరావు తన సిబ్బందితో కలిసి పరిశీలించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీశైలానికి పాదయాత్ర

- మొక్కు తీర్చుకున్న ముత్తుముల అభిమానులు



శ్రీశైలం వెళుతున్న అభిమానులు

గిద్దలూరు టౌన్ : ఎమ్మెల్యేగా ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపుతో గిద్దలూరు నుండి శ్రీశైలానికి ఆయన అభిమానులు ఇరువురు పాదయాత్ర చేపట్టారు. ఆదివారం గిద్దలూరు నుండి టీడీపీ నాయకులు దూదేకుల దస్తగిరి, పిడతల రవి శ్రీశైలానికి పాదయాత్ర చేపట్టగా మంగళవారం వారి పాదయాత్ర యర్రగొండపాలెం నియోజకవర్గంలోని చిన్నదోర్నాలకు చేరింది. ఈ సందర్భంగా పాదయాత్ర చేపట్టిన దస్తగిరి, రవి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం సాధిస్తే శ్రీశైలానికి కాలినడకన వస్తామని మొక్కుకున్నామన్నారు. ఆ మొక్కు ఇప్పుడు తీర్చుకుంటున్నామన్నారు. గెలిచిన అనంతరం ప్రస్తుతం పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహకారం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భారతి

ఒంగోలు(క్రైం), డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): ఖైదీలకు ఉచిత న్యాయ సహకారం ప్రభుత్వం అందిస్తుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి పేర్కొన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఒంగోలులోని జిల్లా జైలులో ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయాధికారి భారతి మాట్లాడుతూ ఉచిత న్యాయ సహకారం అవసరమైన వారికి న్యాయసేవాధికారి సంస్థ ద్వారా అందిస్తామన్నారు. ఖైదీలకు జైలులో మౌలిక సదుపాయలతో పాటు వారి కుటుంబసభ్యులు కలిసేందుకు ములాఖత్‌లు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. జిల్లా న్యాయ సేవసహకార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు మాట్లాడుతే జైలులోని గ్రంథాలయంలో అనేక రకాల పుస్తకాలు ఉన్నాయిని, అవి చదువుకొని జీవితాన్ని మంచిగా మార్చుకోవాలన్నారు. తొలుత జైలును పరిశీలించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో జైలు ఇన్‌చార్జి పర్యవేక్షణాధికారి వి.రమేష్, మెడికల్ ఆఫీసర్ బ్రహ్మతేజ తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువుకు సేవాభూషణ్ అవార్డు



యోగా గురువును సన్మానిస్తున్న న్యాయాధికారి వసంతరావు

గిద్దలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధసేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగాగురువు బీ.ఎస్.నారాయణరెడ్డికి ప్రతిభ సేవాభూషణ్ అవార్డు లభించింది. కాకినాడలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకులు నారాయణరెడ్డికి సేవా భూషణ్ అవార్డును వినియోగదారుల ఫోరం న్యాయాధికారి వసంతరావు, ఇతర అతిథుల చేతుల మీదుగా అందచేశారు. సేవా కార్యక్రమాలతోపాటు అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించిన నారాయణరెడ్డిని పలువురు అభినందించారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం

గిద్దలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీహజరత్ ఖాదర్‌వలి స్వామి దర్గాలో 173వ ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం కళాశాల రోడ్డులోని ఖాదర్‌వలి స్వామి దర్గాలో ఉరుసు మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని వేలాదిమంది దర్శించుకున్నారు. ముస్లింలతోపాటు హిందూ భక్తులు కూడా పెద్దఎత్తున ఉరుసు మహోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దర్గా కమిటీ అధ్యక్షులు పఠాన్ లతీఫ్‌ఖాన్, దర్గ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గౌరవ వేతనాలు విడుదల చేయాలి

గిద్దలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మసీదులలో పనిచేస్తున్న ఇమామ్, మౌజనులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని గిద్దలూరు తాలూకా ప్రభుత్వ చీఫ్ ఖాజీ షేక్ నాయబ్ రసూల్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గౌరవ వేతనాలు విడుదల కాకపోవడంతో ఇమామ్, మౌజన్‌లకు చందాల రూపంలో ముస్లింలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంటున్నదన్నారు.

నేడు మకర విళక్కి

గిద్దలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఈ నెల 11న బుధవారం ప్రతిష్ఠ మహోత్సవాలు, విళక్కి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఉదయం శిఖర ప్రతిష్ఠ మహోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం మకరవిళక్కి (కర్పూర నగరోత్సవం), రాత్రి మహా పడిపూజ నిర్వహిస్తున్నట్లు, భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

బీసీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నేతలు




నేతలను కలిసిన బీసీ నాయకులు

పుల్లలచెరువు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర బీసీ నాయీబ్రహ్మణుల కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివరావు, టీటీడీ బోర్డు మెంబర్లు వైద్యం శాంతారావు, నరేష్‌లను పుల్లలచెరువు నాయీబ్రహ్మణ మండల నాయకులు ఒంగోలులో మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం సతంపేటలో కలిసి వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ముటుకూరి శ్రీనివాస్, సీహెచ్ రాములు, కొండలు, ముటుకూరి శ్రీను, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పురుగు ఉధృతి నివారణకు సూచనలు

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం



కొమ్మనూరులో పొలం పరిశీలిస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి). మండలంలోని నికరంపల్లి, పెద్దనాగులవరం గ్రామాలలో ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు మంగళవారం రైతులతో కలిసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామాలలో రైతులు సాగుచేస్తున్న వివిధ రకాల పంటలను పరిశీలించి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రైతుసేవా కేంద్రాలలో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగుల నివారణ కోసం బెంజోయెట్ 100 గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. రబీ సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న పైర్లను ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన ద్వారా శనగ, మిరప, మొక్క జొన్న, మినుము పైర్లకు బీమా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఓబయ్య, రైతు సేవా కేంద్రాల సిబ్బంది గణేష్, నవ్య భారతి, రైతులు పాల్గొన్నారు.

కొమరోలు : రైతులు తప్పనిసరిగా పంటబీమా చేసుకోవాలని ఏవో రాజశ్రీ తెలిపారు. మండలంలోని హనుమంతురాయినిపల్లి నల్లగుంట్ల గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయంపై అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాజశ్రీ మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటకు తప్పనిసరిగా పంటబీమాను రైతులే చేసుకుని లబ్ధిపొందాలన్నారు.ఈ సీజన్‌లో ప్రకాశం జిల్లాలో శనగ, జొన్న, మినుము, వరి, మొక్కజొన్న, ఎండు మిర్చి వంటి పైర్లకు బీమా చేయించు కోవచ్చన్నారు. పంటబీమా చేయించుకున్న రైతులు ఈ క్రాప్ చేయించుకొంటే బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని కొమ్మునూరు, కొత్తకోట గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో ఎం.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు రైతులు సాగు చేస్తున్న పైర్లకు ప్రీమియాన్ని చెల్లించాలని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ కొమ్మునూరు సర్పంచ్ రామసుబ్బారెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు : మిర్చిపై ప్రస్తుతం నల్లనల్లి ఉధృతంగా ఉందని, దీనివలన ఎక్కువగా కుచ్చు ముడత తెగులు వస్తుందని వెంటనే నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖాధికారి రమేష్ అన్నారు. మండలంలోని తాడివారిపల్లి, రోలుగుంపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. . కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకులు దేవేంద్ర గౌడ్, సావిత్రి, రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండంలోని గంగాపాలెం, నరసాయపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది. కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంది, మినుము, మిరప పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కేవీ.శేషారెడ్డి మాట్లాడుతూ రబీలో సాగు చేస్తున్న మినుము, శనగ, మొక్కజొన్న మిరప పైర్లకు రైతులే బీమా చెల్లించాలన్నారు. కావున రబీలో సాగు చేసిన రైతులు మీసేవ కేంద్రాలలో బీమా నగదు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో ఎల్ మాల్యాద్రి రెడ్డి, డి.దనేశ్వర నాయక్, విఏఏలు నాగేంద్ర కుమార్, మంత్రు నాయక్, రైతులు పాల్గొన్నారు.



నికరంపల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

పెద్దదోర్నాల : ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని రైతులు సద్వినియోగ పర్చుకోవాలని ఏవో జవహర్ లాల్‌నాయక్ అన్నారు. మండలంలోని గంటవానిపల్లె, యడవల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మిరపలో నల్లి ఆశించడం గమనించారు. సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో చైతన్య కుమార్, వీహెచ్ఏ సంధ్యాబాయి, రైతులు పాల్గొన్నారు.

ముఖాముఖి

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ఆర్.శ్రీకాంత్, ఇన్‌చార్జ్ తహసీల్దార్, ముండ్లమూరు



ప్రశ్న: రెవెన్యూ సదస్సులతో ప్రయోజనం ఉందా?

జవాబు: రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుంది. రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలను గ్రామాల్లో జరిగే సదస్సుల్లో పరిష్కరిస్తున్నాం.

ప్ర: ఏఏ అంశాలకు సంబంధించి అర్జీలు వస్తున్నాయి?

జ: గ్రామ సభల్లో భూముల సర్వే ఇతర అంశాలపై అర్జీలు వస్తున్నాయి. గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: మండలంలో భూ ఆక్రమణలు ఎక్కువగా జరుగుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి?

జ: మండలంలో భూ ఆక్రమణలకు గురవుతున్న విషయం తన దృష్టికి రాలేదు. ఎవరైనా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్ర: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యానికి కారణం?

జ: మండలంలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు పరిష్కరించటానికి ప్రధానంగా పది గ్రామాలకు వీఆర్‌వోలు లేరు. మూడు నాలుగు గ్రామాల చొప్పున ఇన్‌చార్జ్ వీఆర్‌వోలు కొనసాగుతున్నారు.

ప్ర: స్పందనలో వచ్చిన అర్జీలు పరిష్కారం కావడంలేదు?

జ: నూతన ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లో వివిధ సమస్యలపై అనేక అర్జీలు వచ్చాయి. ఇప్పటివరకు ఏడు అర్జీలు మాత్రమే పరిష్కరించాల్సి ఉంది. అవి ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నాయి.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యల పరిష్కారం

» మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి

ముండ్లమూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించనున్నట్టు మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రెవెన్యూపరమైన సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చినట్లయితే పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించినివే కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. వాటిని సంబంధిత శాఖలకు పంపుతామన్నారు. ముందుగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సభలో రెవెన్యూకు సంబంధించి 31 అర్జీలు, పింఛన్ల కోసం 55, హౌసింగ్‌కు సంబంధించి 48 అర్జీలు వచ్చినట్ట తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు.

కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఏ.స్రవంతి, ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, ఏవో ఫరూక్, మండల సర్వేయర్ కోటంరాజు, వీఆర్‌వోలు సీహెచ్ బ్రహ్మతేజ, గురవయ్య, అయ్యపరెడ్డి, గ్రామ సర్వేయర్ కోటిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరు: ఉమామహేశ్వర అగ్రహారంలో అర్జీలు స్వీకరిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపునకు చర్యలు

దర్శి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వేదికగా మారాయని తహసీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని వెంకటచలంపల్లి, చలివేంద్ర గ్రామాల్లో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుండటంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వెంకటచలంపల్లిలో శ్మశాన వాటికకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు పేర్కొన్నారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ శ్మశాన వాటికకు భూమి కేటాయించేందుకు చర్యలు చేపట్టారు రెండు గ్రామాల్లో 25 అర్జీలు దాఖలయ్యాయి. అధికశాతం భూముల హక్కుల బదలాయింపు, ఆన్‌లైన్ పాస్‌పుస్తకాల పంపిణీ తదితర సమస్యలపై వచ్చాయి కార్యక్రమంలో ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, వెంకటచలంపల్లి సర్పంచ్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: కట్టకిందపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమణారావు

కురిచేడులో 25 అర్జీలు

కురిచేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో ప్రజా సమస్యలు అక్కడిక్కడే పరిష్కారం అవుతున్నాయి. కురిచేడు మండలంలో మూడవ రోజు మంగళవారం ఆవులమందలో జరిగిన గ్రామసభలో తహసీల్దార్ రజనీకుమారి, మండల ప్రత్యేకాధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ప్రజలనుంచి 25 అర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువ శాతం మ్యుటేషన్స్ కోసమే వచ్చాయి. వీటి ని త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, వీఆర్వోలు శేషగిరి, క్రిష్ణ, ఆయకట్టు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని పడమట కట్టకిందపల్లిలో మంగళవారం జరిగిన గ్రామ సభకు చల్లా రత్తమ్మ అధ్యక్షత వహించారు. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రమణారావు మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. గ్రామస్థుల నుంచి 72 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం. పానకాలరావు, దేవదాయ శాఖ ఈవో నరసింహబాబు, వీఆర్వో శివశంకర్, రసూల్‌రహీం, మండల సర్వేయర్ స్నేహ, యారవ శ్రీనివాసులు, షేక్ అబ్దుల్, గట్ల కొండారెడ్డి, మితికెల నారాయణయాదవ్, బి.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలి

కనిగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని జిల్లా బాలల హక్కుల సంరక్షణాధికారి పి.దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఏరువారిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోనే ఏరువారిపల్లి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా ప్రకటించినట్టు చెప్పారు. ప్రతి గ్రామాన్ని బాల్యవివాహ రహిత గ్రామంగా మార్చేందుకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలన్నారు. బాల్యవివాహాలు ప్రోత్సహించినా, జరిపించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు అలాగే, గ్రామాభ్యుదయానికి, ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పరచేందుకు కృషి చేయాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటించాలన్నారు. ఈసందర్భంగా హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ గఫార్, సీడీపీవో సరోజని, ఎం.ముంతాజ్, సీఐ ఖాజావలి, ఎంపీడీవో హనుమంతరావు, ఎంఈవో యు.నారాయణరెడ్డి, సర్పంచ్ వెంకటయ్య, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



ఏరువారిపల్లి గ్రామంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్న ర్యాలీ

వైభవంగా మహాఅంబలం పూజ

పామూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద మంగళవారం మహాఅంబలం పూజ, గ్రామోత్సవం, అఖండ భజన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ముందుగా దేవస్థానంలో అర్చకులు చిమట పట్టాభిస్వామి, కార్తీకేయ స్వామి ఆధ్వర్యంలో అఖండ అష్టదశ కలిశపూజలు నిర్వహించారు. సాయంత్రం అంబలం పూజ సందర్భంగా దేవస్థానం వద్ద నుంచి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దేవస్థానం వద్ద ప్రత్యేక వేదికపై అరటి బోదెలతో నిర్మించిన మండపాల్లో శివయ్య, అయ్యప్ప, సుబ్రమణ్యం, స్వామి వార్లను అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు గోస్టు కల్యాణ మండపంలో బిక్షను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మణికంఠస్వామి, కావిటి సుబ్బయ్య, గుత్తిరాజ, ఇర్రి కోటిరెడ్డి కంభాల రోశయ్య, ఓగూరి ఏడుకొండలు, రాచూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు

నిరుపయోగంగా ఆపరేషన్ థియేటర్‌లు

» తాళ్లూరు, తూర్పుగంగవరం పీహెచ్‌సీల్లో శస్త్ర చికిత్సలు నిలిపివేత

» ఇబ్బందులు పడుతున్న మహిళలు

» పట్టించుకోని అధికారులు

తాళ్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు, తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని వసతులుఉన్నా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగడంలేదు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య ఆయుస్మాన్ మందిర్‌లకు(ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు)వెళ్లి కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటే ప్రోత్సాహక నగదు అందజేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది. ఆచరణలో అందుకు భిన్నంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్లు జరగటంలేదు. కరోనా సయంలో ఆపరేషన్లు నిలిపివేసిన అధికారులు పునరుద్ధరించేలా జరిగేలా చర్యలు తీసుకోలేదు.

తాళ్లూరులోని పీహెచ్‌సీ పూర్వం నుంచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు అధికంగా వస్తుంటారు. అయితే, ఐదేళ్లుగా ఆపరేషన్లు జరగక పోవటంతో ఆపరేషన్ థియేటర్ నిరుపయోగంగా ఉంది. ఆపరేషన్ గది వర్షానికి కారుతూ అపరిశుభ్రంగా ఉంది.

తూర్పుగంగవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించి ఏడేళ్లు కావస్తున్నా కు.ని ఆపరేషన్లు మాత్రం ఆశించిన స్థాయిలో జరగటం లేదు. ఆసుపత్రి ఏర్పడిన నాటినుండి 2019 వరకు కేవలం 8 కు.ని ఆపరేషన్లు మాత్రమే జరిగాయి. ప్రస్తుతం తూర్పుగంగవరం పీహెచ్‌సీలో ఉన్న వైద్యులకు కుటుంబనియంత్రణ ఆపరేషన్‌లపై జిల్లా వైద్యశాఖ శిక్షణ ఇప్పించక పోవటంతో ఆపరేషన్లు నిర్వహించటం లేదు.

ఈరెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతినెలా 18మంది ఆపరేషన్లు చేయించాల్సి ఉంది. నేడు ఆపరేషన్ చేసే వైద్యులు లేకపోవటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యయప్రయాసలకోర్చి ఒంగోలు, దర్శి అద్దంకి, చీమకుర్తి, ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు వెళుతున్నారు. తాళ్లూరు ప్రాంతానికి చెందిన ఎక్కువమంది బాలింతలు ఆపరేషన్ల కోసం ఒంగోలు రిమ్స్‌కు వెళుతున్నారు. పీహెచ్‌సీల్లో ఆపరేషన్ థియేటర్‌లు తాళాలు తెరుచుకోపోగా, మిగిలిన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. గత కొంతకాలంగా తాళ్లూరు, తూర్పుగంగవరం ఆరోగ్య కేంద్రాల్లో కు.ని ఆపరేషన్లు జరగకున్నా జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోపోవటాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆరోగ్యవైద్య శాఖ అధికారులు స్పందించి స్థానిక పీహెచ్‌సీల్లో కుటుంబనియంత్రణ ఆపరేషన్‌లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.



తాళ్లూరులో మూతపడిన ఆపరేషన్ థియేటర్, అపరిశుభ్రంగా ఆపరేషన్ గదిలోని బెడ్లు



తెరుచుకోని తూర్పుగంగవరంలోని ఆపరేషన్ థియేటర్

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

ముండ్లమూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల అగ్రికల్చర్ కళాశాల డీన్ డాక్టర్ ప్రసన్నరాణి అన్నారు. మంగళవారం ముండ్లమూరులో జరిగిన రైతు సదస్సుకు మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ప్రసన్నరాణి మాట్లాడుతూ భూమి ఆరోగ్యకంగా ఉంటేనే పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నేల ఆరోగ్యంగా ఉన్న సమయంలో వాతావరణ మార్పులను తగ్గించటంలో సహాయ పడుతుందన్నారు. ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ఎరువుల వినియోగాన్ని తగ్గించటం, పశువులు, ఎరువులు ఎక్కువగా వాడటంవల్ల పర్యావరణ సంరక్షణ, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో దర్శి ఏడీఏ బాలాజీ నాయక్, దర్శి ముండ్లమూరు ఏవోలు ఫరూక్, బాలకృష్ణ నాయక్, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ టీవీ రెడ్డి, బాపట్ల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాపట్ల అగ్రికల్చర్ కళాశాల డీన్ డాక్టర్ ప్రసన్నరాణి

సస్యరక్షణ చర్యలతో నష్ట నివారణ

పామూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన అధిక వర్షాలతో కంది, మినుము పైరులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట నష్టాన్ని నివారించుకోవచ్చునని ఏవో కె.రాధ సూచించారు. మండలంలోని బలిజపాలెం, బొట్లగూడూరు గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా నిమ్మ తోటలు, కంది పైరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ హెచ్‌వో కుసుమ, వీఏఏ హరికృష్ణ, ఎంపీఈవో నాగశివాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

దొనకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ యువ నాయకుడు షేక్ ఫయాజ్ సొంత నిధులతో సమకూర్చిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులను మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈనెల 16 నుంచి డిగ్రీ కాలేజీ విద్యార్థులకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో స్థానిక గౌతమీ కాలేజీ విద్యార్థులకు టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌతమీ కాలేజీల ఛైర్మన్ గుండారెడ్డి, సీఈవో నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ రామయోగి దాత ఫయాజ్‌ను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుందుర్తి లక్ష్మణ్, ఎం.సురేష్, పోతిపోగు చెన్నయ్య ఎం.చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

దొనకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలో ఈనెల 13, 14, 15 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు పేర్కొన్నారు. మహాసభలకు సంబంధించి మంగళవారం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కర్నా హనుమయ్య, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

దొనకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు అన్నారు. మంగళవారం సీఐటీయూ అనుబంధం పారిశుధ్య కార్మికుల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చిరుపల్లి అంజయ్య, అధ్యక్షుడిగా చిన్నబాలకోటయ్య, కార్యదర్శిగా కొండా ఏసుదాసు, ఉపాధ్యక్షుడిగా వైదన ఇశ్రాయేలు, కోశాధికారిగా పి.లూకయ్య తదితరులను ఎన్నుకున్నారు. కార్మికులకు ఎటువంటి సమస్యలు ఎదురైన పరిష్కారానికి నూతన కమిటీ బాధ్యతగా పనిచేయాలని రంగారావు సూచించారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

తాళ్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుగ్రామాలకు పది రోజులుగా నిలిచిపోయిన మంచినీటిని సరఫరాను మంగళవారం పునరుద్ధరించారు. సోమవారం 'మంచినీటి సరఫరా బంద్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. రామతీర్థం ప్రాజెక్ట్ వద్దగల పంపింగ్ మోటార్లు చెడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. మోటార్లకు మరమ్మతులు చేసి మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో పలుగ్రామాల ప్రజల ఇక్కట్లు తీరాయి.

గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలి



నిలిచిపోయిన గృహాలను పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

దర్శి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారి పి.శ్రీనివాసప్రసాద్ సూచించారు. మండలంలోని వెంకటచలంపల్లి సమీపంలో దర్శి పట్టణ వాసులకు కేటాయించిన హౌసింగ్ కాలనీని మంగళవారం ఆయన పరిశీలించారు. అధికశాతం ఇళ్ల మధ్యలో నిలచిపోయిన విషయాన్ని గుర్తించారు. ఇంకా అనేకమంది లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టలేదు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులోగా మధ్యలో నిలచిపోయిన గృహాల నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్లాట్లు తీసుకున్న లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టకపోతే రద్దు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ డీఈ నిరీక్షన్‌రావు, ఏఈ షేక్ షకీర్‌బాషా ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

పీసీపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో కె.ప్రకాశరావు అన్నారు. మంగళవారం మండలంలోని గుంటుపల్లి, లక్ష్మక్కపల్లిలో రైతులు సాగుచేసిన పైర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో వచ్చిన మార్పులతో కంది పైరులో తెగుళ్ల సోకే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రబీకి సంబంధించి పంట నమోదుతో పాటు బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో పుల్లయ్య, గ్రామ సహాయకులు అఖిల్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న ఎంఈవో కరుణకుమారి

పామూరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): చదువుకొంటేనే బంగారు భవిషత్తు ఏర్పడుతుందని ఎంఈవో కరుణకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం ఎస్సీ పాలెంలో డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బడి ఈడు పిల్లలను, చదువును మధ్యలో మానివేసిన పిల్లలను గుర్తించి వారి చేత తిరిగి పాఠశాలలో చేరుతామని లిఖిత పూర్వకంగా లెటర్‌ను రాయించుకొన్నారు. కార్యక్రమంలో స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, మాజీ సర్పంచ్ పోతురాజు వెంకట్రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, మహిళా సంరక్షణ కార్యదర్శి షేక్ షానవాజ్, మహిళా పోలీస్ ఉమాదేవి, అంగన్‌వాడి కార్యకర్త అమల పాల్గొన్నారు. అనంతరం మానవహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు.

మహాగర్జన సభను విజయవంతం చేయాలి

పామూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్గీకరణ పేరుతో రెండు కులాల మధ్య చిచ్చు పెట్టారని మాలల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి శాంతరాజు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు కోటికాల బాల బాదుర్ల ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 15న గుంటూరులో జరగనున్న మాలల మహా గర్జన సభను విజయవంతం చేయాలన్నారు. మంగళవారం మండలంలోని నుచ్చుపొద, అయ్యవారిపల్లి, బొట్లగూడూరు, ఇనిమెర్ల, గోపాలపురం, మోట్రావులపాడు, కంభాలదిన్నె, తదితర గ్రామాల్లో వారు పర్యటించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొలనీడి బాబు, జొన్నలగడ్డ గోవిందయ్య, దమ్ము శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ కన్వీనర్‌గా శ్రీధర్

కనిగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవహక్కుల అడిషనల్ కన్వీనర్‌గా కనిగిరికి చెందిన సామాజికవేత్త గుత్తి శ్రీధర్ ఎంపికయ్యారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా విశాఖపట్టణంలోని సెంట్రల్ లైబ్రరీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫౌండర్, నేషనల్ ఛైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తాము చేస్తున్న సమాజ సేవలను గుర్తించి బాధ్యతాయుతమైన పదవులలో నియమించినందుకు డాక్టర్ సంపత్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీధర్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మనస్తాపంతో మహిళ బలవన్మరణం

కురిచేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో సోమవారం రాత్రి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటన మండలంలోని దేకనకొండలో చోటుచేసుకుంది. కోలుకొండ సుజాత(36) అదే గ్రామానికి చెందిన నరసింహరావుతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఇద్దరూ అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. సోమవారం రాత్రి కుటుంబంలో గొడవ జరిగినట్లు సమాచారం. మనస్తాపంతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఉదయం కుటుంబసభ్యులు చూసి ఇరుగు పొరుగువారికి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దర్శి సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబసభ్యులే చంపి ఉరి వేశారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి



సీనియర్ అసిస్టెంట్ అజయ్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ శ్రేణులు

పామూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అదానితో చేసుకొన్న చీకటి ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ఎస్‌డీ మౌలాలి డిమాండ్ చేశారు. అవినీతిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలపై పార్లమెంట్‌లో చర్చ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యావసర ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో విద్యుత్ అనుమతుల కోసం అదాని లంచాలు ఇచ్చినట్లు అమెరికాలో కేసులు నమోదయ్యాయన్నారు. వాటిపై చర్చించి నిజనిజాలు నిగ్గు తేల్చాలన్నారు. అదానితో చేసుకొన్న ఒప్పందాలను రద్దుచేసి, విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీరాం అజయ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వజ్రాల సుబ్బారావు, కె.ప్రభాకర్, ఆర్. సూరిబాబు, పి.రఘునాధరెడ్డి, వెంకటరెడ్డి, ప్రసాద్, మహేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని బస్టాండ్ సెంటర్‌లో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారి మూడవ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా అమ్మవారికి పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. పోలేరమ్మను, పోతులూరయ్యను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు దుర్భాకుల నగేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.




ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ





అమరావతి సచివాలయంలో కలెక్టర్ల సదస్సు జరిగే సమావేశ మందిరం



తేమ శాతం పేరిట తకరారు.. సహకరించని అధికారులు.. మొండికేస్తున్న మిల్లర్లు.. చేను దాటని గింజలు.. రోడ్లపైనే ధాన్యం నిల్వలు.. అనుమతి కోసం అన్నదాతల నిరీక్షణ.. గోతాలు లేక, కాటా కూలీలు రాక అవస్థలు.. ఇదీ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి. చివరి గింజ వరకు కొంటాం.. తేమ శాతంలో వెసులుబాటు ఇచ్చాం.. వ్యవసాయశాఖ మిల్లర్ల కోసం కాకుండా రైతుల కోసం పనిచేయాలి.. అని ప్రభుత్వం చెప్తున్నా క్షేత్రస్థాయిలో కొర్రీలతో కొనుగోళ్లు సక్రమంగా జరగడంలేదు. పంట పండించేందుకు.. దానిని ప్రకృతి అవాంతరాల నుంచి రక్షించేందుకు.. ఎంతగా రైతులు కష్టపడ్డారో అంతకు మించి విక్రయించేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. ఓ పక్క వాయుగుండం కంటిపై కునుకు లేకుండా చేస్తుంటే ఆర్.ఎస్.కెలు, మిల్లుల చుట్టూ రైతులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అయినా అధికారులు, మిల్లర్లు కనీసంగా కూడా కనికరించడంలేదు. చాలామంది గిట్టుబాటు ధర రాకపోయినా, వచ్చినరేటుకు చేలల్లోనే ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు.

కొనుగోళ్లకు.. కొర్రీలు



కరకట్టపై ఆరబోసిన ధాన్యం

- తేమ శాతం పేరిట తకరారు
- అన్నదాతకు నో.. దళారులకు సై
- కొనసాగుతున్న ధాన్యం రైతుల కష్టాలు
- అనుమతి రాక పొలాలు, రోడ్లపైనే నిల్వలు
- గోతాలు లేక, కాటా కూలీలు రాక అవస్థలు
- చేసేదిలేక దళారులకు తెగనమ్ముకుంటున్న వైనం
- వ్యవసాయశాఖ విఫలం.. కొరవడిన మిల్లర్ల సహకారం
- బ్యాంకు గ్యారెంటీల నుంచి గన్నీ సంచుల వరకు గందరగోళం
- మరో రెండు వారాల్లో లక్ష్యం పూర్తి.. ఆ తర్వాత స్పష్టత కరువు
- పల్నాడులో 2 లక్షల టన్నుల దిగుబడి.. కొనుగోలు లక్ష్యం 5 వేల టన్నులే



చేలల్లోనే ఉన్న ధాన్యం బస్తాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దేనికీ వెనకాడకుండా ధాన్యం రైతుల కోసం కొనుగోళ్లలో అనేక మార్పులు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం.. కొరవడిన మిల్లర్ల సహకారంతో రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. ఒకవైపు వాయుగుండం హెచ్చరికలతో అన్నదాత వణికిపోతున్నా అధికారుల్లో చలనం లేదన్న విమర్శలున్నాయి. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చెయ్యాలని పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖలను మంత్రి మనోహర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోవడంలేదు. వాతావరణ పరిస్థితుల్లో ముమ్మరంగా వరి నూర్పిడులు జరుగుతున్నాయి. అయితే ఆ స్థాయిలో కొనుగోళ్లు జరగడంలేదు. ఈ ఏడాది ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని సంతోషంగా ఉన్నా రైతులను అమ్మకాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు లక్ష్యం పరిశీలిస్తే మొక్కుబడిగానే ఉన్నట్టు చెప్పవచ్చు. ఒక్క గుంటూరు జిల్లాలో మినహా బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కడా గోతాలు అందుబాటులో లేవు. అత్యధిక సాగు జరుగుతున్న బాపట్ల జిల్లాలో గోతాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని గుంటూరు జిల్లాలో 1.84 లక్షల ఎకరాల్లో వరి సాగైతే కేవలం 1.05 లక్షల గోతాలు మాత్రమే అందుబాటులో ఉంచారు. బాపట్ల జిల్లాలో 3.8 లక్షల ఎకరాల్లో వరి సాగవగా పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసిన గోతాలు కేవలం 70 వేలు మాత్రమే. అదికూడా కొన్నామని లెక్కలు చూపటం మినహా రైతులకు అందుతున్నది అంతంతే. ఎదురుచూపులు చూడలేక చివరకు రైతులే ఒక్కో గోతానికి రూ.30 నుంచి రూ.35 వరకు ఖర్చుచేసి కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. రవాణాకు వాహనాల పరిస్థితి సరేసరి. మురా కూలీల విషయంలో మిల్లర్లు, దళారులు కలసి దగా చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కాటా కూలీలను రైతుల దగ్గరకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, దళారులు చెబితేనే వారు కదలడంలేదని చెబుతున్నారు. దళారులు కొనుగోలు చేస్తున్న ధాన్యం బస్తాల దగ్గరకు మాత్రం నిమిషాల్లో వెళ్లిపోతున్నారని, రాత్రివేళల్లోనూ కాటా వేసేస్తున్నారంటున్నారు. తాము అడిగితే ఖాళీ లేదని దాటవేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దగ్గరలోని రైస్ మిల్లుకే ధాన్యం తీసుకెళ్లొచ్చన్న పాలకుల మాటలు అమలు కావడం లేదు. దాదాపు 45 కిలోమీటర్ల దూరంలోని రైస్‌మిల్లులకు ధాన్యం తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో రైతులు అలాడుతున్నారు. ప్రభుత్వం తేమ శాతం 17 వరకు పరిమితి పెడితే, కోస్తాలోని ఐదు జిల్లాల్లో దానిని 25 శాతానికి మినహాయింపు ఇచ్చింది. తేమ శాతాన్ని ఆర్.ఎస్.కెలు పరీక్షిస్తాయని, మిల్లులు చేయాల్సిన అవసరం లేదని

(మిగతా 6వ పేజీలో)

మిల్లర్ల రివర్స్ దోపిడీ

మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనాలంటే 75 కిలోల బస్తాకు ధాన్యం కేటగిరీని బట్టి రూ.1725 నుంచి రూ.1740 చెల్లించాలి. అదే దళారుల నుంచి కొన్న ధాన్యానికి అయితే రూ.1300 నుంచి రూ.1350 వరకు వెచ్చిస్తే సరిపోతుంది. అంటే ఎంత లేదన్నా గిట్టుబాటు ధరకు, మార్కెట్ ధరకు రూ.400 నుంచి రూ.450 వరకు బస్తా ధరలో వ్యత్యాసం ఉంటుంది. అదే తేమ సాకు చూపి కోత వేస్తే మరో రూ.200 వరకు అదనం. బ్యాక్ గ్యారెంటీ సాకుతో కొంతమంది మిల్లర్లు రైతుల నుంచి నేరుగా కొనకుండా, దళారుల ద్వారా వచ్చిన ధాన్యాన్ని కొంటున్నారని సమాచారం. ఆర్.ఎస్.కేల్లోని సిబ్బంది సహకారంతో దళారుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మినట్లు చూపిస్తున్నారు. ఇందులో రైతులకు రావాల్సిన గిట్టుబాటు ధరను కూడా మిల్లర్లు దోచేస్తున్నారనేది ఆరోపణ.

ఇబ్బంది పెడితే చర్యలు

రైతులకు 70 వేల గోతాలను అందుబాటులో ఉంచాం. మరో 3 లక్షల గోతాలు మిల్లర్లు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. కొనుగోళ్లలో ఎవరికీ ఇబ్బంది రానివ్వం. తేమ శాతం విషయంలో ఎక్కడైనా మిల్లర్లు రైతులను తప్పుదారి పట్టించి నష్టం కలిగించడానికి చూస్తే చర్యలు తీసుకుంటాం. అలాంటి మిల్లర్ల గురించి రైతులు మా దృష్టికి తీసుకురావాలి.

- విలియమ్స్, డీఎం, సివిల్ సప్లైస్, బాపట్ల జిల్లా



కలెక్టర్ వెంకటమురళి

నివేదికలతో.. అమరావతికి

- మూడు రోజులుగా ముమ్మర కసరత్తు
- సచివాలయంలో నేడు, రేపు కలెక్టర్ల సదస్సు
- సమగ్ర వివరాలతో సదస్సుకు కలెక్టర్ వెంకటమురళి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు అవుతుంది. బుధ, గురువారాల్లో రాజధాని అమరావతి సచివాలయంలో జరగనున్న ఈ సదస్సులో వివిధ అంశాలపై చర్చలు, సమీక్షలు నిర్వహించనున్నారు. రెండో రోజు సాయంత్రం డీడీపీలపై ప్రజంటేషన్ జరగనుంది. కలెక్టర్లు సమర్పించే ప్రణాళికల్లో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందినవి మాత్రమే కమిటీ ఎంపిక చేసి ప్రదర్శనకు అనుమతి ఇవ్వనుంది. ఆరు నెలల పాలనలో వివిధ విభాగల పనితీరును మదింపు చేయడంతో పాటు జిల్లాల సర్వతోముఖాభివృద్ధికి రచించాల్సిన ప్రణాళికలపై సీఎం అధ్యక్షతన సమగ్రంగా చర్చించనున్నారు. ఈ సదస్సులో పాల్గొనడానికి కలెక్టర్ వెంకటమురళి సిద్ధమయ్యారు. ఈ సదస్సులో నివేదించాల్సిన అంశాలపై గడచిన మూడు రోజులుగా వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై సమగ్ర వివరాలను సేకరించారు. రెవెన్యూ సంబంధమైన అంశాలతో పాటు ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల పరిష్కారం ఏ స్థాయిలో ఉంది, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేసిన పనులు తదితర వివరాలతో పూర్తి స్థాయిలో కలెక్టర్ సదస్సులో పాల్గొనబోతున్నారు. ఆరు నెలల కూటమి పాలన సాధించిన విజయాలు, కలెక్టర్ దృష్టికి వచ్చిన లోటుపాట్లపై చర్చ జరగనుందనేది సమాచారం. వివిధ పనులు చేపట్టడానికి సమగ్ర నివేదికలు అందించి వాటికి నిధులు విడుదల చేయాలనే అభ్యర్థనను కూడా సీఎంకు కలెక్టర్ విన్నవించే అవకాశాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తొలి డీఆర్సీ సమావేశం ఇటీవలే జరిగిన సంగతి తెలిసిందే. దానిలో జిల్లాకు సంబంధించి పలు అంశాలు చర్చకు రాగా వాటిలో ముఖ్యమైనవి బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం, నల్లమడ వాగు ఆధునీకీకరణ, గుంటూరు ఛానల్ పొడిగింపు, భూ అవకతవకలపై చర్యలు వంటివి ఉన్నాయి. డీఆర్సీలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అనేక పనులు పెద్ద ఎత్తున నిధులతో ముడిపడి ఉన్నాయి. ఇదే అంశాన్ని సదస్సులో సీఎం ముందు కలెక్టర్ ఉంచనున్నట్లు సమాచారం. సూర్యలంక బీచ్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఇవ్వడానికి కేంద్రం సుముఖతతో ఉందనే అంశాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కూడా చెప్పారు. ఈ క్రమంలో పర్యాటకంగా జిల్లాను అగ్రగామిగా నిలపడానికి ఇక్కడ ఉన్న అవకాశాలతో పాటు ఏయే విభాగాలకు నిధులు ఖర్చు చేస్తే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు జనరేట్ అవుతాయనే వివరాలను కూడా సదస్సులో కలెక్టర్ వివరించనున్నట్లు తెలుస్తోంది. ఇక బాపట్ల జిల్లాగా ఆవిర్భవించి రెండున్నరేళ్లు దాటినా ఇప్పటికీ అనేక సాంకేతిక చిక్కులు వెంటాడుతున్నాయి. వీటిలో ముఖ్యంగా దాదాపు అన్ని కార్యాలయాల్లో ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేకపోవడం వల్ల పనుల్లో వేగం లోపిస్తోంది. ఇక జిల్లా అధికారులలో చాలా వరకు ఇన్‌చార్జిలే ఉన్నారు. జిల్లా స్థాయి అధికారుల పోస్టులను నోటిపై చేసే విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇప్పుడు చాలా విభాగాలకు అధికారులు లేకుండా ఇన్‌చార్జిల తోనే నడిపించాల్సి వస్తోంది. వీటిని కూడా సదస్సు ముందుంచి చిక్కుముళ్ల పరిష్కారం కోసం అభ్యర్థించనున్నట్లు సమాచారం.

ఇక అమరావతి పరుగులు



- పనులకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం
- 20 పనులకు రూ.11,467 కోట్లు కేటాయింపు

గుంటూరు, డిసెం బరు10 (ఆంధ్రజ్యో తి): ఏడీబీ, ప్రపంచ బ్యాంకుల నుంచి భారీగా నిధులు.. కూటమి ప్రభుత్వ పట్టు దల.. సీఆర్‌డీఏ అథారిటీ ప్రత్యేక దృష్టి నేపథ్యంలో రాజధాని అమరావతిలో పనులు పరుగులు తీయనున్నాయి. సీఆర్డీఏ ఈ నెల 2న సిద్ధం చేసిన ప్రతిపాదనలకు ఆ మరుసటి రోజు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ క్రమంలో గతంలో ఆగిపోయిన పనుల పునరుద్ధరణకు మంగళవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు జీవో 968ను కూడా జారీ చేసింది. ఏపీసీఆర్డీఏ ప్రతిపాదించిన 20 రకాల పనులకు రూ.11,467 కోట్లు కేటాయిం చింది. గతంలో ఆయా పనులకు సంబంధించి టెండర్ల కాలపరిమితి తీరిపోగా పనులను పునఃప్రారంభించడానికి కూటమి ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది.

లే అవుట్ల అభివృద్ధికి రూ.3,859.66 కోట్లు

భూ సమీకరణ(ఎల్‌పీఎస్) విధానంలో భూములిచ్చిన రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్ల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. తొలివిడతగా 8,496.3 ఎకరాల్లో ప్లాట్ల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి, మంచినీటి సరఫరా, వరద నీరు, మురుగునీరు పారుదల, విద్యుత్, ఐటీసీ కేబుళ్లు, రోడ్ల వెంట వాకింగ్ ట్రాకులు, సైక్లింగు ట్రాకులను రూ.3,859.66 కోట్లతో నిర్మించనున్నారు. రూ.1,585 కోట్లుతో కొండవీటి వాగు, పాలవాగు వెడల్పు, శాఖమూరు, నీరుకొండ వద్ద రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రూ.984కోట్లతో హ్యాపీనెస్ట్ ప్రాజక్టు కింద నిర్మించనున్న 12 టవర్లతో 1200 అపార్ట్‌మెంట్ల నిర్మించనున్నారు.

రాజధానిలో పనుల సందడి..

గత టీడీపీ ప్రభుత్వం వేల ఎకరాల భూములు సేకరించి రూ.10 వేల కోట్ల తో అనేక ప్రభుత్వ భవనాలను, రహదా రులు, ఇతర మౌలిక సదుపాయాలను రాజధానిలో నిర్మించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అమరావతిని శ్మశానంగా మార్చే ఉద్దేశంతో పనులను నిలిపేసింది. దీం తో రాజధాని పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. కాగా ఆరు నెలల క్రి తం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రమాణ స్వీకారానికి ముందే రాజధాని పునర్నిర్మాణంపై దృష్టి పెట్టింది. తొలుత రూ.36.5 కోట్లతో 29 గ్రామాల్లోని 24 వేల ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టింది. 2014- 19లోనే తుది దశకు చేరిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు, ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవనాలు మొదలు, గెజిటెడ్ ఉద్యోగుల భవనాలు, క్లాస్- 4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్ల నిర్మాణ పనులు సహా మొత్తం 20 రకాల పనులు తక్షణం ప్రారంభం కానున్నాయి. రూ.594.54 కోట్లతో భవనాలను పూర్తి చేయడంతో పాటు, మరో రూ.226.26 కోట్లతో తాగు నీరు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, వీధి దీపాలు, అంత ర్గత రహదారులు, భవన సంరక్షణ తదితర సదుపాయాలు కల్పించనున్నారు. రూ.594.36 కోట్లతో నాన్ గెజిటెడ్ అధికా రుల టవర్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, రూ.516.6 కోట్లతో ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల నివాసాలు, న్యాయమూర్తుల భవనాల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.



గ్రామ రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సిసోడియా, కలెక్టర్ వెంకటమురళి

గత ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే భూ సమస్యలు

- అర్జీలను పట్టించుకోలేదు
- రెవెన్యూ సదస్సులు నిర్వహించలేదు
- రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా

6



గ్రామ రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సిసోడియా, కలెక్టర్ వెంకటమురళి

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే భూ సమస్యలు

- అర్జీలను పట్టించుకోలేదు
- రెవెన్యూ సదస్సులు నిర్వహించ లేదు
- రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా

పర్చూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రజలు, రైతుల నుంచి వచ్చిన అర్జీలను పట్టించుకోకపోవడం, రెవెన్యూ సదస్సులను నిర్వహించకపోవడం వల్లే భూ సమస్యలు తీవ్రమయ్యాయని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా పేర్కొన్నారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం, తన్నీరువారిపాలెంలో మంగళవారం డీఆర్వో గంగాధర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ వెంకటమురళితో కలిసి సిసోడియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సదస్సులను నిర్వహిస్తోందన్నారు. భూ సమస్యల వల్ల కక్షలు పెరిగి, హత్యలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 22(ఏ) సిస్టం తారుమారు చేయడం వల్ల భూ సమస్యలు పెరిగాయన్నారు. ఇప్పటివరకు జరిగిన రెవెన్యూ సదస్సులో 80వేల అర్జీలు అందడం ఇందుకు నిదర్శనమన్నారు. 2017లో తప్ప ఇప్పటివరకూ రెవెన్యూ సదస్సు నిర్వహించలేదన్నారు. రైతుల సమస్యలకు సత్వర పరిష్కారానికే ప్రభుత్వం సదస్సును ఏర్పాటు చేసిందన్నారు. జవాబుదారీ విధానంతో గ్రామ సభలు నిర్వహించి రైతుల భూసమస్యలను నిర్ణీత గడువులోపే పరిష్కరించే విధంగా సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రైతుల మేలుకోరి ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వివాదాలు, సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ఈ సదస్సుల ధ్యేయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీసర్వేతో గ్రామాల్లో భూములు విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, సమస్యలు చోటుచేసుకున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం రైతులకు 1(బీ), అడంగల్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, డీపీవో కేఎల్ ప్రభాకరరావు, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డ్వామా పీడీ జి.పరీక్షిత్, ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ఏపీవో బుల్లియ్య, సర్పంచ్ ఆళ్ల వెంకన్న, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సతీష్‌చంద్ర, హౌసింగ్ డీఈ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

మందుబాబులు కనిపిస్తే చర్యలు

- సెక్యూరిటీ, కంట్రోల్ పాయింట్ సిబ్బందిని ఆదేశించిన డీఎం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆర్టీసీ కంట్రోల్ పాయింట్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం

అద్దంకిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మందుతాగి బస్టాండ్‌లో తిరుగుతూ, బల్లలపై పడుకునే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చూడాలని డిపో మేనేజర్ బీ రాంమోహనరావు సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ఆర్టీసీ బస్టాండ్‌లో తాగి నిద్రపోతున్నారు కథనంపై డిపో అధికారులు స్పందించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించే వ్యక్తులపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. ప్రతి రోజు బస్టాండ్ ప్రాంతాల్లో తాగి తిరుగుతున్నా, బల్లలపై పడుకున్నా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ సెక్యూరిటీ విభాగం సిబ్బంది, కంట్రోల్ పాయింట్ సిబ్బంది డీఎం ఆదేశించారు. పోలీస్ అధికారులతో బస్టాండ్ ప్రాంతంలో మందుబాబులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు డీఎం తెలిపారు.

ప్రయాణికులు తికమక

- ఒంగోలు బస్టాండ్‌లో అద్దంకి బస్సులు నిలిపే ప్లాట్‌ఫాం మార్పు

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ లో అద్దంకి వైపు వచ్చే బస్సులు నిలిపే ప్లాట్‌ఫారంను మార్చడంతో ప్రయాణికులు తికమక పడుతున్నారు. ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌లో అద్దంకి, నర్సరావుపేట, వినుకొండ రూట్‌లలో నడిచే బస్సులు 16, 17 నెంబర్ల ప్లాట్‌ఫాంలపై నిలుపుతుంటారు. ఆదివారం నుంచి 1, 2 ప్లాట్‌ఫాంలకు మార్పు చేశారు. అయితే మార్పు చేసినట్లు ఎలాంటి బోర్డులను ఏర్పాటు చేయలేదు. అదే సమయంలో ప్లాట్‌పాంలపై ఏయే రూట్లలో వెళ్లే బస్సులు ఆపుతారో తెలియజేసే బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నట్లు ఆర్టీసీ కండక్టర్‌లు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో మద్దిపాడు, మేదరమెట్ల తదితర ప్రాంతాలకు వెళ్లే పలువురు ప్రయాణికులు వేరే బస్సులను ఎక్కుతున్నట్లు, దీంతో మూడు రోజులుగా అద్దంకి, వినుకొండ, నర్సరావుపేట రూట్లలో తిరిగే బస్సులకు సరాసరిన రూ.2 నుంచి 3వేల రూపాయల ఆదాయం తగ్గినట్లు కండక్టర్‌లు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాట్‌ఫారమ్‌లు మార్పు చేసిన విషయం ప్రయాణికులకు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

13న హనుమత్ వ్రతం, దీక్ష విరమణ

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం, ఆంజనేయస్వామి దీక్షధారుల దీక్ష విరమణ సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. ఉదయం 7 గంటలకు దీక్షధారులతో ఆలయ ప్రదక్షిణ, 7-30 గంటలకు ఇరుముడి ద్రవ్యములతో ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం, 9 గంటలకు హనుమత్ వ్రతం, 12 గంటలకు మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి, మాల విరమణ, అన్న ప్రసాద వితరణ జరుగుతాయని తెలిపారు. ఆంజనేయస్వామి దీక్షధారులు 12వ తేదీ గురువారం సాయంత్రానికి శింగరకొండ చేరుకోవాలని సూచించారు. భక్తులకు వసతి సౌకర్యం, అల్పాహారం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భర్త, కుటుంబ సభ్యులపై ఫిర్యాదు

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి) : వేధింపులకు పాల్పడుతున్నారని భర్త, కుటుంబ సభ్యులపై గుంజి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలమేరకు.. మండలంలోని ధేనువకొండకు చెందిన రాజేశ్వరి, వెంకటరావు ప్రేమించి ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల రాజేశ్వరిని హైదరాబాద్‌లో వదిలివేసి వెంకటరావు ధేనువకొండకు వచ్చాడు. దీంతో రాజేశ్వరి కూడా ధేనువకొండకు వచ్చి పుట్టింటిలో ఉంటుంది. ఈక్రమంలో ఆదివారం భర్త వెంకటరావుతో పాటు అత్త, మామలు, ఇద్దరు ఆడపడుచులు వచ్చి రాజేశ్వరిని, తండ్రిపై దాడి చేశారు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ కన్వీనర్‌గా శ్రీధర్

కనిగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవహక్కుల అడిషనల్ కన్వీనర్‌గా కనిగిరికి చెందిన సామాజికవేత్త గుత్తి శ్రీధర్ ఎంపికయ్యారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా విశాఖ సెంట్రల్ లైబ్రరీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫౌండర్, నేషనల్ చైర్మన్ సంపత్‌కుమార్ నియామకపత్రాన్ని అందుకున్నారు.

హనుమ చరిత్ర వినడం శుభం



చాగంటిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య కుటుంబ సభ్యులు .. ప్రవచనాలు వినేందుకు హాజరైన శ్రోతలు

- సనాతన ధర్మోపన్యాసకులు చాగంటి
- కోటేశ్వరరావును సన్మానించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీతారాముల చరిత్ర ఉన్నంత కాలం హనుమంతుని శ్మరణ, చరిత్ర ఉంటుంది. అది హనుమంతునికి శ్రీరాముడు ఇచ్చిన వరం. సీతారాముల పారాయణం జరిగే ప్రతి చోటా ఉండి భక్తులను కాపాడాలని శ్రీరామచంద్రుడు ఆంజనేయునికి ఉపదేశించారు. హనుమంతుడు చిరంజీవి. హనుమంతుని చరిత్ర వినడం, ఆచరించడం, అత్యంత పవిత్రం, శుభమని ఆధ్మాత్మిక ప్రవచనకర్త, సనాతన ధర్మోపన్యాసకులు చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. ఎస్‌ఆర్ అండ్ వీఎం హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం శ్రీ హనుమత్ వైభవం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు రామాయణంలోని సుందరకాండ అంశాలను సోదాహరణంగా ప్రవచించారు. ఆంజనేయుని జన్మ వృత్తాంతం నుంచి రాముల వారితో చేసిన ప్రయాణం, రావణుడు అపహరించిన సీతమ్మ తల్లి జాడ తెలుసుకోవడంలో అంజనేయుని పాత్రను కళ్లకు కట్టినట్లు విపులంగా చెప్పారు. హనుమంతుడు సీతమ్మ వారి దగ్గర ఎంత వినయంగా ఉంటూ నమ్రతగా సమాధానం చెప్పాడో, రావణుని దగ్గర సుగుణాభిరాముని గుణగణాలు, పరాక్రమాలను వివరిస్తూ శరణుగోరమని హెచ్చరించిన తీరును వివరించారు. నోటి వాక్కును ఎంత వరకు సందర్భానుసారంగా వినిపించాలో అర్థవంతంగా చెప్పారు. సంస్కృత శ్లోకాలను వల్లెవేస్తూ అందుకు తెలుగు అనువాదం చెప్తూ పండితులు, పామరులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో చాగంటి వారి ప్రవచనాల పరంపరలో పలుమార్లు శ్రోతలు హర్షధ్వనాలతో కూడిన భక్తిభావాన్ని వెలిబుచ్చారు.

ప్రవచన పాఠం అనంతరం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఆయన సతీమణి బాల కొండమ్మ, పెద్ద కుమారుడు గౌరీఅమర్‌నాథ్, చిన్న కుమారుడు, టీడీపీ చీరాల నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఆయన నుంచి ఆశీర్వచనాలు పొందారు. బుధవారం సాయంత్రం కూడా ఆధ్యాత్మిక ప్రవచనాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి విశేష సంఖ్యలో హాజరైన భక్తులు, శ్రోతలకు ప్రసాద వితరణ జరిగింది. ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్‌ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు తగిన ఏర్పాట్లు చేశారు. ప్రవచనాలు వినేందుకు వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

చిన్నారుల హక్కులకు భంగం వాటిల్లితే ఉపేక్షించేది లేదు



చిన్నారుల బరువుని పరిశీలిస్తున్న పద్మావతి

చినగంజాం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : చిన్నారుల హక్కులకు ఎటువంటి భంగం వాటిల్లినా ఉపేక్షించేది లేదని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి హెచ్చరించారు. మండలంలోని కడవకుదురు, చినగంజాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రాలు, సోపిరాలలోని అంగన్‌వాడీ కేంద్రం, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడవకుదురు అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న సదుపాయాలను ఆమె పరిశీలించారు. కేంద్రాల్లోని చిన్నారుల బరవులను, రిజిస్టర్స్, స్టాకు రిజస్టర్స్, ఆహార పదార్థాలు, మురుగు దొడ్లు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాల పరిధిలోని బాలింతలకు బాల సంజీవని కిట్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించి తరగతుల వారీగా విద్యార్థుల హాజరు రిజస్టర్‌లను పరిశీలిచగా పాఠశాల విద్యార్థులు 20 శాతంపైగా డ్రాప్ అవుట్స్ ఉన్నారని, 30 శాతం పైగా రెగ్యులర్ ఆప్సెంట్స్‌లో ఉన్నట్లు ఆమె గుర్తించారు. స్టాక్ రూమ్‌లో కోడిగుడ్లు, బియ్యం, చిక్కీ, రాగిపిండి అధిక మొత్తంలో ఉండడంతో విద్యార్థులకు సకాలంలో అందించడం లేదని గుర్తించి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూశారు. చినగంజాం ప్రాథమిక పాఠశాల, పాఠశాలలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను, భవిత కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ముళ్లపొదలు, చిల్లచెట్లతో నిండి ఉండడంతో ఉపాధ్యాయులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంఈవో ఎస్.కోటేశ్వరరావు, సీడీపీవో టీ.రూన్నీ, జిల్లా బాలల సంరక్షణాధికారి పురుషోత్తమరావు, ఎస్.ఐ ఎస్.రమేష్, సూపర్‌వైజర్లు వాణిశ్రీ, సుమలత, ఉషాకుమారి, గ్రామ మహిళాపోలీసు కార్యదర్శి కామాక్షి, సీఆర్పీ సీ.హెచ్.సురేంద్రకుమార్, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో పోష్ యాక్ట్‌పై అవగాహన

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో మంగళవారం విద్యార్థులకు పోష్ యాక్ట్-2013 (లైంగిక వేధింపుల నుంచి మహిళలకు రక్షణ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరా వు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పూర్తి స్థాయి సంరక్షణ వాతావరణం ఉండేవిధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కమిటీ ప్రిసైడిం గ్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.నాగధనలక్ష్మి మాట్లాడుతూ సెక్సువల్ హెరాష్‌మెంట్ ఎలా ఉంటుంది, ఎలా ఫిర్యాదు చేయాలి, ఎలా పరిష్కరిస్తారు అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తనిఖీలలో పాల్గొన్న విద్యుత్‌శాఖ అధికారులు

విద్యుత్ అక్రమ వాడకందారులపై భారీ జరిమానా

ఇంకొల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలో అక్రమంగా విద్యుత్‌ను వినియోగంపై మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 95 మంది అధికలోడు విద్యుత్ వాడుతున్నట్లు గుర్తించారు. వీరికి రూ.3,27,00 జరిమానా విధించినట్లు ఇంకొల్లు విద్యుత్ ఏఈ రామకృష్ణ తెలిపారు. అనధికారికంగా ఎవరైనా విద్యుత్ వినియోగిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలలో 32మంది అధికారులు డీఈ రమేషబాబు, థామస్, హరి ప్రసాదరావు, మల్లికార్జునరావు, షర్మిల, వెంకటరత్నం పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో సత్ఫలితాలు



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న ఏవో కాశీవిశ్వనాథ్

వేటపాలెం, చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేసిన పైర్లు, పంటలకు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని ఏవో కాశీవిశ్వనాథ్ తెలిపారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి, బచ్చులవారిపాలెం గ్రామాల పరిధిలోని రైతులకు మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పురుగుమందులు పచికారి చేసేటపుడు వేపనూనెతో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. పీఎం ఫసల్ బీమా యోజన పథకం ప్రీమియం ఈ నెల 15వ తేదీలోపు చెల్లించాలని సూచించారు. ఈపంట నమోదు ఆవశ్యకతను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : రైతులు పంట దశను అనుసరించి పురుగు మందులు వాడాలని లేకుంటే పంట ఎండిపోతుందని వ్యవసాయాధికారి సుమతి పేర్కొన్నారు. మంగళవారం చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెం, వాడరేవు ప్రాంతాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏలు రమేష్, హదస్స, రైతులు పాల్గొన్నారు.

ఫసల్ బీమాను వినియోగించుకోవాలి

మార్టూరు : ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్.మేరమ్మ రైతులను కోరారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పంటలకు ఇన్స్యూరెన్స్ కింద శనగకు రూ.84, మొక్కజొన్నకు రూ.105 వరికి రూ.126 ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.సుదర్శన్, ఎస్ రాము, రైతులు పాల్గొన్నారు.

పంట కోతలు వద్దు

తుఫాన్ ముప్పు పోయేవరకూ రైతులు పంట కోతలు చేయొద్దని ఏవో వీరగంధం కిరణ్ కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని వలపర్ల, కోలలపూడి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ అధికారి క్రాంతి కుమార్, వీఏఏ హరి, నవీన్ పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ఈ-పంట నమోదు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుందని ఏడీఏ కె.ధనరాజ్ రైతులకు తెలిపారు. మంగళవారం మండలంలోని మణికేశ్వరం, కొంగపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గడువులోపు ఈ పంట నమోదును పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, ఉద్యాన అధికారి ఎస్.దీప్తి, వీఏఏలు రాణి పాల్గొన్నారు.

బల్లికురవ : రైతులు పంట బీమాను వినియోగించుకోవాలని చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి పేర్కొన్నారు. మంగళవారం కొప్పెరపాలెం, వేమవరం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పొగాకు, పత్తి, మొక్కజొన్న పంటలను ఏవో పరిశీలించారు. తుఫాన్ ఉన్న దృష్ట్యా కోతలు వద్దని సూచించారు.

సస్యరక్షణతో కత్తెర పురుగు నివారణ

పంగులూరు : సాగులో ఉన్న మొక్కజొన్న పైరుకు కత్తెర పురుగు ఆశించిందని, దాని నివారణకు తగు సస్యరక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సూచించారు. మండలంలో మంగళవారం రామకూరు, భగవాన్‌రాజుపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న మొక్కజొన్న, వరి పైరును పరిశీలించి పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పంట నమోదుతో పాటు పంటల బీమా విధిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్, వ్యవసాయ శాఖ సిబ్బంది పృథ్వీ, రైతులు పాల్గొన్నారు.



శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న ప్రతినిధులు

క్రమశిక్షణకు మారు పేరు కేవీ

అద్దంకిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రమ శిక్షణ, కష్టపడే తత్వానికి మారుపేరు హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు అని చీరాల ఉప విద్యాశాఖ అధికారి అబ్బరాజు శ్రీనివాసావు, బాపట్ల జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం రాత్రి అద్దంకిలోని గీతామందిర్‌లో యూటీఎఫ్ అద్దంకి మండలశాఖ, బాపట్ల జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డును అందుకున్న హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించారు. వినుకొండ సుధాకరరావు అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. అటు విద్యార్థులను తీర్చిదిద్దడంలో, పాఠశాల అభివృద్ధికి శ్రీనివాసరావు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో బీ సుధాకరరావు, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరకొండ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పేరిరెడ్డి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, బాబూరావు, హనుమంతరావు, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంతో వ్యాధులు దూరం

బల్లికురవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మరుగు దొడ్లను వినియోగించుకోవడం ద్వారా వ్యాధులూ దూరమవుతాయని ఎంపీడీవో కె.కుసుమకుమారి పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మలమూత్ర విసర్జనతో వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని, అందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈ నాయక్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు గోపీకృష్ణ



పవన్ గోపీకృష్ణ

పంగులూరు, డిశంబరు 10 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి పవన్ గోపీకృష్ణ రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. ఈ నెల 6వ తేదీన జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీలో రెండవ స్థానం సాధించిన చాతరాజుపల్లి పవన్ గోపీకృష్ణ 30వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి సాదిక్ తెలిపారు. కౌశల్ క్విజ్ పోటీలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైన పవన్ గోపీకృష్ణను హెచ్‌ఎం అణిత, ఎస్‌ఎంసీ చైర్మన్ గోలి సంధ్యారాణి, గ్రామ పెద్దలు చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, రావుల వెంకట నరసింహారావు, ఉపాధ్యాయులు మంగళవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

లారీ ఢీకొని బైకిస్టుకు గాయాలు

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని మోటార్‌సైకిలిస్టు కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అద్దంకి పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన వల్లెపు శివప్రసాద్ మంగళవారం ఉదయం మోటార్‌సైకిల్‌పై అద్దంకి టౌన్‌లోకి వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో గాయాలైన శివ ప్రసాద్‌ను అద్దంకి లోని వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

హుండీ దొంగ అరెస్టు

పంగులూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు పోలేరమ్మ గుడిలో హుండీలో సొమ్ము అపహరించిన నిందితుడు పూరిమిట్ల నారాయణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత శుక్రవారం తెల్లవారుజామున పోలేరమ్మ ఆలయంలో దొంగతనానికి పాల్పడిన నారాయణను మంగళవారం అలవలపాడు అడ్డరోడ్డువద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని నుంచి రూ.22వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. చందలూరుకు చెందిన కందిమళ్ల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు రేణంగివరం ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన నారాయణ అనే వ్యక్తి నాలుగు ప్రదేశాలలో చోరీకి పాల్పడినట్లు విచారణలో అంగీకరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎస్పీ, చీరాల డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ మల్లికార్జునరావు పర్యవేక్షణలో ఎస్‌ఐ వినోద్‌బాబు తన సిబ్బందితో దర్యాప్తు చేశారు. అదుపులోకి తీసుకున్న నారాయణను మంగళవారం అద్దంకి కోర్టుకు హాజరు పరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ. వినోద్‌బాబు తెలిపారు.

కొనుగోళ్లకు.. కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం పేర్కొంది. అయితే ఆర్.ఎస్.కెలు పరీక్షించినా మిల్లర్లు ససేమిరా అంటున్నారు. ఆ శాతాలను పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ సొంతగా తేమ పరీక్షిస్తున్నారు. ఆర్.ఎస్.కెలో నిర్ధారించిన దానికంటే కొన్ని మిల్లుల్లో 3 నుంచి 5 శాతం అదనంగా చూపిస్తున్నారు. తేమ పరీక్షించే పరికరంలో కప్పు కొలత మేరకే పొయ్యాల్సి ఉంటే, అంతకుమించి పొయడంతో తేమ శాతం కూడా అదనంగా చూపిస్తోంది. దీంతో అదనంగా వచ్చిన తేమకు సరిపడా తరుగు కింద తీసేస్తున్నారు. మళ్లీ పరీక్షలపై రైతులు ప్రశ్నిస్తుంటే బస్తాకు రూ. 50 నుంచి రూ.100 తీసుకుని ఆర్.ఎస్.కేల్లో అడిగినంత తక్కువ తేమ శాతం వేసిస్తున్నారని, అందుకే తాము పరిశీలించుకుంటున్నామని మిల్లర్లు దబాయిస్తున్నారు. తేమ శాతం ఒక్కో పాయింట్‌కు రూ.20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారు. వరి నూర్పిళ్లు యంత్రాలతో చేస్తున్నందున తేమ శాతం ఎక్కువగా ఉంటున్నది. తేమ శాతం ప్రభుత్వం చెబుతున్నట్టు 17 శాతమే ఉండాలంటే 10 నుంచి 15 రోజులు ఆరబెట్టాలి. చేలల్లో ధాన్యం ఆరబెట్టే పరిస్థితులు లేవు. పొలం నుంచి ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావడానికి బస్తాకు రూ.100 ఖర్చు అధికంగా అవుతున్నది. 40 కిలోల గోతానికి రూ.3.39 ధరను అధికారులు నిర్ణయించారు. అయితే ఈ ధరకు గోతం కొనే పరిస్థితి లేదు. 75 కిలోల గోతం ధర రూ.20 నుంచి 30 వరకు ఉంది. హమాలీ కూలీ క్వింటాకు రూ.25గా నిర్ణయించారు. రవాణా చార్జీలు స్థానికంగా ఎక్కడికక్కడ నిర్ణయించనున్నారు. అయితే ఇవేవీ అమలు కావడంలేదు. దీంతో రైతులు అయినకాడిక అమ్మేసుకుంటున్నారు. రాబోయే రెండు మూడు వారాల్లోనే లక్ష్యం వరకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. ఆ తర్వాత ఏమిటన్న దానిపై అధికారుల్లో స్పష్టత కొరవడింది. సరైన ప్రణాళికలు లేని కారణంగానే ధాన్యం సేకరణ విషయంలో రైతులు అగచాట్లు పడుతున్నారు. గతంలో మిల్లరు ధాన్యం సేకరణ కోసం పోటీ పడేవారు. ఈ దఫా ప్రభుత్వం తేమ శాతం నిబంధనల విషయంలో సడలింపులు ఇవ్వడంతో భవిష్యత్తులో సీఎంఆర్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్న మిల్లర్లు తాము బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన మేరకు సేకరించి మిన్నకుండి పోతున్నారని సమాచారం.

బ్యాంక్ గ్యారెటీ అయిపోయిందంటూ..

రైతు వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ లేదా అర్.ఎస్.కెలకు వెళ్లి ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించి మిల్లు అనుమతి తీసుకోవాలి. అయితే మిల్లులు రైతుల నుంచి ధాన్యం కొనాలంటే వాటికి బ్యాంక్ గ్యారెంటీ అవసరం ఉంటుంది. తుఫాన్ సమయంలో భారీగా ధాన్యం కొనుగోలుతో చాలా మిల్లులకు బ్యాంకులకు గ్యారెంటీ పరిమితి దాటిపోయింది. కొనుగోళ్లకు ఇబ్బందులు రాకుండా మిల్లులకు 1:1 నిష్పత్తిలో కాకుండా 1:2 నిష్పత్తిలో కూడా ప్రభుత్వం అనుమతులిచ్చింది. అయితే ఈ అవకాశాన్ని వారు రైతులకు వినియోగించకుండా దళారుల నుంచి ధాన్యాన్ని కొనడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ అయిపోయిందని, రెండు రోజుల్లో వస్తుందని, వచ్చాకే ధాన్యం కొనగలమని చెప్తున్న మిల్లర్లు దళారుల నుంచి మాత్రం లారీలకు లారీల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

బాపట్ల జిల్లాకు ఇన్‌చార్జి అధికారే దిక్కు

జిల్లాలో కీలకమైన ధాన్యం సేకరణ జరుగుతున్న సమయంలో సివిల్ సప్లయిస్ డీఎంగా పౌరసరఫరాలశాఖ అధికారే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ధాన్యం సేకరణ సమయంలో డీఎంను కలెక్టర్ సరెండర్ చేశారు. ప్రత్యామ్నాయం కింద డీఎస్‌వోకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఏ విషయంలోనూ ఫలితాలు చూపించలేని పరిస్థితి నెలకొంది. గతంలో డిసెంబరు మూడో వారంలో ధాన్యం చేతికొచ్చేది. కానీ ఈ సారి దాదాపు ఈ నెల మొదటి వారంలో నూర్పిళ్లు మొదలైనా కొనుగోళ్లకు సన్నద్ధతలో వ్యవసాయశాఖ వైఫల్యం స్పష్టంగా కనబడింది. తుఫాన్ ప్రభావంతో వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడవడం వంటివన్నీ అన్నదాతలను వెంటాడడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఇప్పటి వరకు 28,000 మెట్రిక్ టన్నుల ధాన్యం అన్నదాతల చేతికి రాగా మద్దతు ధరకు సేకరించింది కేవలం 5,800 మెట్రిక్ టన్నులే. దాదాపుగా 15,000 టన్నుల ధాన్యం దళారుల పరమైంది. సేకరణ లక్ష్యాన్ని 50,000 టన్నులుగానే నిర్దేశించుకున్నారు.



శ్మశానంలో తొలగించిన చిల్లచెట్లు

ముక్తేశ్వరంలో శ్మశానం పరిశుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిట్టడవులను తలపిస్తున్న మరు భూములు అని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మంగళవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో అధ్వానంగా ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ మీరా వలి, గ్రామ సర్పంచ్ పర్యవేక్షణలో కార్మికులు తుమ్మ చెట్లను యంత్రాలతో తొలగించారు. అనంతరం ప్రజలకు ఇబ్బందులు లేకుండా శ్మశాన వాటిక రోడ్డును శుభ్రం చేయించారు.

గోతులను అలా కప్పేశారు!

- గుండ్లకమ్మ బ్రిడ్జిపై కాంక్రీట్‌తో లేయర్ వేయాలని మంత్రి గొట్టిపాటి ఆదేశం
- అయినా అధికారుల మీనమేషాలు
- తాత్కాలిక మరమ్మతులతో మమ



గుండ్లకమ్మ బ్రిడ్జిపై గోతులకు ఇటీవల చేసిన తాత్కాలిక మరమ్మతులు.. మరలా పడుతున్న గుంతలు

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ నదిపై దర్శి రోడ్డులో ఉన్న బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు తరచూ గోతులు పడుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతుండడంతో పట్టుమని పది రోజులు కూడా గడవకముందే మరలా యథావిధిగా గోతులు పడుతున్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడడంతో పాటు ఏ సమయంలో కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. 4 దశాబ్దాల కిందట గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జిని నిర్మించారు. 17 సంవత్సరాల కిందట బ్రిడ్జిలోని కొన్ని ఖానాలు కుంగడంతో రాకపోకలు తాత్కాలికంగా నిలిపి వేసి మరమ్మతులు చేసి పునరుద్ధరించారు. అప్పటి నుంచి వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూనే ప్రయాణిస్తున్నారు. బ్రిడ్జిపై గోతులు పడి శ్లాబులో వినియోగించిన ఇనుప చువ్వలు కూడా బయటపడ్డాయి. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు అప్పుడప్పుడు తాత్కాలికంగా తారుతో గోతులు పూడ్చి సరిపెడుతున్నారు. ఇటీవల అద్దంకి మండలంలో మోదేపల్లిలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లే క్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బ్రిడ్జి పరిస్థితిని గమనించారు. మోదేపల్లిలో సభకు హాజరైన ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. గుండ్లకమ్మ బ్రిడ్జిపై కాంక్రీట్ లేయర్ వేసి గోతులు పూడ్చాలని ఆదేశించారు. అయితే అనంతరం తారుతోనే మరలా గోతులను తాత్కాలికంగా పూడ్చి మమ అనిపించారు. గోతులు పూడ్చి పక్షం రోజులే కాగా మరలా మరమ్మతుల చేసిన ప్రాంతాలలో గోతులు పడుతున్నాయి. ఇలా తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రయోజనం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, వాహనాల రద్దీకి తగ్గట్టు కొత్త బ్రిడ్జి ఏర్పాటుపై మంత్రి గొట్టిపాటి ప్రత్యేక దృష్టి సారించాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

ఏలూరి చొరవతో రైతులకు ఊరట

అలేరు వాగు భూసేకరణ ఫార్మర్స్ కమిటీ అధ్యక్షుడు విజయకుమార్

నాయుడువారిపాలెం/కారంచేడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దకాలంగా పరిష్కారానికి నోచుకోని ఆలేరు వాగు (లెఫ్ట్ ఆర్మ్) కాలువ నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో సాధ్యమైందని ఆలేరు వాగు భూసేకరణ ఫార్మర్స్ కమిటీ అధ్యక్షుడు విజయకుమర్ అన్నారు. మంగళవారం కారంచేడు మండలం నాయుడువారిపాలెం గ్రామంలో ఆలేరు వాగు భూసేకరణ ఫార్మర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతుల సమస్యలపై ఎమ్మెల్యే ఏలూరి చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. రైతులకు సంబంధించి ఏమైనా భూ సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కమిటీ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో కమిటీ వైస్ ప్రెసిడెంట్ నల్లూరి శ్యాంప్రసాద్, కార్యదర్శి తాళ్లూరి రామారావు, జాయింట్ సెక్రటరీ నాయుడు శ్రీనివాసులు, కోశాధికారి నాయుడు వెంకట్రావు, పెంట్యాల నాయుడమ్మ, వెంకటరామ భూపాలరావు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



వాడరేవు రెవెన్యూ సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భూ సంబంధిత రెవెన్యూ సమస్యలను రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని పరిష్కరించుకోవాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు చెప్పారు. మండల పరిధిలోని వాడరేవులో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారితో మాట్లాడారు. సమస్యలను నిర్దిత కాలవ్యవధిలో పరిష్కరించేవిధంగా చర్యలు చేపడతామని తెలపారు. సమస్యల పరిష్కార దిశగా అర్జీదారులకు అవగాహన కల్పించాలని అధికారులకు చెప్పారు. సదస్సులో తహసీల్దార్ గోపీకృష్ణ, డివిజనల్ సర్వేయర్ మునలయ్య, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చినగంజాం : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని స్పెషల్ ఆఫీసర్ డీఎల్‌డీవో పద్మావతి అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో మ్యూటేషన్ కోసం మూడు, భూ కొలతలకు ఐదు, కులధ్రువీకరణకు ఐదు, ఆదాయపు ధ్రువీకరణకు ఒకటి, 1బీ కోసం ఒకటి, అడంగల్‌కు ఆరు అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, మండల సర్వేయర్ సుబ్బారావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : మండలంలోని ఇసుకదర్శి గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 25 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టీ ప్రశాంతి తెలిపారు. ఈ సదస్సుకు స్పెషల్ ఆఫీసర్ డీఆర్‌డీఏ పద్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోనంకి రెవెన్యూ భూములకు సంబంధించి 25 అర్జీలను గ్రామస్థులు ఇవ్వగా, పట్టాదారు పాస్ పుస్తకాలకు 3, సర్వేకు 5 అర్జీలు అందాయి. కార్యక్రమంలో డీటీ నాగలక్ష్మి, ఆర్ఐ రహమాన్ బాషా, మండల సర్వేయరు ఏడుకొండలు పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : భూ సమస్యలపై 48 అర్జీలు అందినట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. పూసలపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

పంగులూరు : రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రత్యేకాధికారి, మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ అన్నారు. ముప్పవరం, జాగర్లమూడివారిపాలెంలో తహసీల్దార్ పి.సింగారావు నేతృత్వంలో రెవెన్యూ సదస్సు లు నిర్వహించారు. ముప్పవరం సదస్సులో డిజిటల్ సిగ్నేచర్ సమస్యలు నాలుగు, ఎఫ్ లైన్ సమస్యలు మూడు, ఆర్వోఆర్ సమస్య లు 20 రాగా, డిజిటల్ సిగ్నేచర్ 4, రీప్లేస్‌మెంట్ సమస్యలను వెంటనే పరిష్కరించా రు. జేవీపాలెంలో ఎఫ్‌లైన్ 6, మ్యూటేషన్ చేయాలని 7దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ సింగారావు తెలిపారు. సర్వేయర్ సురేష్‌బాబు, ఆర్ఐ బాబయ్య, నాయకులు ఏడుకొండలు, స్వామి, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలి



సభలో మాట్లాడుతున్న అడ్వకేట్ రామకృష్ణారెడ్డి

చినగంజాం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ హక్కులు, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చీరాల బార్ అసోసియేషన్ సీనియర్ అడ్వకేట్ ఆసోది రామకృష్ణారెడ్డి అన్నారు.

ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల వారి అధ్వర్యంలో మంగళవారం జరిగిన న్యా య విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మా ట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని రామకృష్ణారెడ్డి సూచించారు. న్యాయ విజ్ఞాన సదస్సులో మానవ హక్కుల గురించి, బాలల హక్కులు, బాల వివాహాల నిరోధక చట్టం, మత్తు పదార్థాల నిరోధక చట్టం తదితర విషయాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి.రత్నకుమారి, లోక్ అదాలత్ ఇన్‌చార్జి వి.వీరరాఘవులు, పారా లీగల్ వలంటీర్ ఎంవీ.రామారా వు, ఎస్.ఎం.సుభాని, సామాజిక కార్యకర్త ఎస్‌డీ మతీన్, పాఠశాల బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి

అద్దంకిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ మం దులు వాడుకుంటూ పింఛన్ రానివారు ఈ నెల 12, 13 తేదీల్లో ఒంగోలు ఏఆర్‌టీ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని అద్దంకి ఐసీటీసీ సెంటర్ కౌన్సిలర్ రమేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. బాధితులు వారి ఆధార్ కార్డు, ఫోన్, బ్యాంక్ పాస్ పుస్తకం, బాధితుల గ్రీన్ బుక్‌తో దరఖాస్తు చేయాలని సూచించారు.

18న విశ్రాంత ఉద్యోగుల భవనం ప్రారంభం

అద్దంకిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అద్దంకి యూనిట్ నూతన భవన ప్రారంభోత్సవం కార్యక్రమం పట్టణంలోని భాగ్యనగర్ 4వ లైన్‌లో ఈ నెల 18వ తేదిన ఉదయం 9గంటలకు జరుగుతుందని అధ్యక్షుడు షేక్ మస్తాన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అనంతరం పెన్షనర్స్ డే వేడుకలు జరుగుతాయని, పెన్షనర్లు, దాతలు, శ్రేయోభిలాషులందరు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మహిళకు రక్త దానం

అద్దంకిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు రోటరీ క్లబ్ ప్రోత్సాహంతో రక్తదానం చేశారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రక్తహీనతో బాధపడుతున్న ఫాతిమాకు బీ నెగిటివ్ రక్తం అవసరం కాగా రోటరీ బ్యాంక్ డైరెక్టర్ మురళీసుధాకర్ ప్రోత్సాహంతో సాయిసురేష్ ద్వారా రక్తం సేకరించి అందజేశారు.

పోలియో వ్యాధిగ్రస్తురాలికి సాయం

మార్టూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గడ్డం బజారులో పోలియో వ్యాధి గ్రస్తురాలైన రామసుబ్బులు అనే మహిళకు మంగళవారం హెల్పింగ్ హాండ్స్ సభ్యులు కొంతనగదు, నిత్యావసరవస్తువులను అందచేశారు. కార్యక్రమంలో పఠాన్ ఖాదర్‌వలి, ఎస్‌కే కాలేషావలి, పుట్టా అయ్యప్పస్వామి, పుట్టా వెంకటేశ్వర్లు, జాఫర్, నరసింహారావు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

వేటపాలెం, చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విఘ్నేశ్వరకాలనీ శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు మంగళవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

ధర్నాను జయప్రదం చేయండి

ఇంకొల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మండల కార్యాలయాల వద్ద ఈ నెల 16వ తేదీన జరిగే ధర్నాను రైతులు జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు, కార్యదర్శి రామారావు కోరారు. మంగళవారం రైతు నాయకులతో సమావేశం నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్య లు, ఎరువులు బ్లాక్‌లో అమ్మడాన్ని నిరసిస్తూ ధర్నా చేయన్నుట్లు తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ శీనానాయక్

ప్రతిభ విద్యార్థులకు చేయూత

బల్లికురవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ ప్రతిభ చూపే విద్యార్థులకు బ్యాంక్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు బల్లికురవ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కె. శీనానాయక్ తెలిపారు. మంగళవారం గుంటుపల్లి గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 7, 8, 9 తరగతులలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న బి.అమృత, డి.మహిమ తేజస్వీ, యు. గాయత్రిలకు ఒక్కొక్కరికీ రూ.5వేల నగదు చెక్కులను ఏపీజీబీ శాఖ ప్రగతి విద్యాజ్యోతి పథకం కింద మేనేజర్ శీనానాయక్ అందజేశారు. ప్రతి ఏటా ఇలా విద్యార్థులకు చేయూతను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంక్‌లో ప్రగతి త్రివేణి, ప్రగతి కుబేర్ డిపాజిట్ స్కీం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరళకుమారి, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్లు కె.సుహిత గ్రేస్, జి.బిందు మాధవి, డి.గోపికృష్ణ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థికి బంగారు పతకం



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న హితేష్

మార్టూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన నేషనల్ స్థాయి కరాటే పోటీలలో కర్పూరపు హితేష్ అనే విద్యార్థి బంగారు పతకాన్ని సాధించాడు. మండలంలోని ఇసుకదర్శి గ్రామానికి చెందిన హితేష్ ఒంగోలులోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో 6వతరగతి చదువుతున్నాడు. చిలకలూరిపేటలో జరిగిన డాక్టరు బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ నేషనల్ లెవెల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో మొదటి బహుమతి గోల్డ్‌మెడల్‌ను సాధించారు. ఈ మేరకు కరాటే మాస్టర్ దేవరకొండ వెంకటేష్, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ చేతులమీదగా హితేష్ గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్ కావ్య

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అపోలో హాస్పటల్, కృతి ఫౌండేషన్ వారి సహకారంతో మండల పరిధిలోని దేవాంగపురి (జాండ్రపేట)లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. డాక్టర్ కావ్యారెడ్డి (గైనకాలజీ), డాక్టర్ లతశ్రీ (పీడియాట్రిక్స్), డాక్టర్ రంగనాథ్ (ఆరోథపెడిక్), డాక్టర్ గోపివర్మ (జనరల్ మెడిసిన్), అపోలో చీరాల హాస్పటల్ వైద్య నిపుణుల బృందం ఆయా విభాగాల రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. ఆహార, నియమాలను వివరించారు. హా స్పటల్ జనరల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో 250 మంది రోగులకు వైద్యసహాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమం లో కృతి ఫౌండేషన్ ప్రతినిధులు, అపోలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్ల నొప్పులను ముందే గుర్తించాలి




పరీక్షలు చేస్తున్న డాక్టర్ నవీన్

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మోకాళ్ల నొప్పులను తొలి దశలో గుర్తించి, సరైన చికిత్స చేయించుకుంటే ఆపరేషన్ అవసరం లేకుండా పీ ఆర్పీ వైద్య విధానంతో నయం చేయవచ్చని, అది శ్రీ కామాక్షికేర్ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ దివ్య తెలిపారు. శ్రీకామాక్షి కేర్ హాస్పటల్లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ జి.నవీన్‌కుమార్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ గవిని లక్ష్మీనారాయణ, అత్మలిక్ ఆఫీసర్ డాక్టర్ తాడివలస కుమార్ తదితర ఆయా విభాగాలకు చెందిన రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందలను అందజేశారు. ఈ శిబిరంలో 106 మంది వైద్య సేవలు పొందినట్లు హాస్పిటల్ ఎండీ డాక్టర్ తాడివలస దేవరాజ్ తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అవసరమైనవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం

బల్లికురవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చేసుకుంటే జీవితాలు నాశనం అవుతాయని ఐసీడీఎస్ సీడీపీవో సుధ విద్యార్థినులకు సూచించారు. మండలంలోని ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి సీడీపీవో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వలన కలుగు నష్టాల గురించి వాటి నియంత్రణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మీరాబీ, సురేఖ, అనూష, అంగన్ వాడీ కార్యకర్తలు భూలక్ష్మి, పద్మావతి, పుష్పలత, దీవెనమ్మ పాల్గొన్నారు.



డ్రైవింగ్ ట్రాక్..
ఇక అంతా ఆటోమేటికే!

తప్పులు గుర్తించనున్న సెన్సార్లు, కెమెరాలు

పరీక్షలో పొరపాటు చేస్తే ఫొటోలతో రుజువు

వేగంగా అధునాతన పనులు

నెల రోజుల్లో అందుబాటులోకి..



డ్రైవింగ్ ట్రాక్ వద్ద డిజిటల్ ట్రాక్ స్తంభాల ఏర్పాటు

డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేశారా!? అయితే నిబంధనల ప్రకారం డ్రైవింగ్ నేర్చుకోండి. గతంలోలా డ్రైవింగ్ టెస్టుకు హాజరైన సమయంలో ట్రాక్ మధ్యలోని మలుపులో కాలు కింద పెట్టడం, 8వ రౌండ్ వేసే సమయంలో లెఫ్ట్, రైట్ సిగ్నల్స్ తప్పుగా వేయడం, డ్రైవింగ్ చేస్తున్న సమయంలో వాహనం ఇంజన్ ఆగిపోవడం... వంటి తప్పులు జరిగాయా? ఇక అంతే.. మీరు తప్పనిసరిగా ఫెయిలే. ఎందుకు ఫెయిల్ అయ్యామా.. అని వాదించడానికి కూడా వీల్లేకుండా పక్కాగా మీరు చేసిన తప్పును ఫొటో తీసి చూపుతుంది అడ్వాన్సుడ్ డ్రైవింగ్ ట్రాక్. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా, తప్పులు చేస్తూ ఉంటే అన్నిసార్లు కూడా డ్రైవింగ్ టెస్ట్ ఫెయిల్ అవుతూనే ఉంటారు.

- వివరాలు 6లో

అసంపూర్తి చేయరా!?

- 167బి జాతీయ రహదారి నిర్మాణంలో తీవ్ర జాప్యం
- ఏడాదిగా ఆగిన కల్వర్టులు, వంతెనలు, కూడళ్ల నిర్మాణాలు
- ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం
- కందుకూరు బైపాస్ నిర్మాణంలోనూ ఇదే తీరు



బడేవారిపాలెం సమీపంలో అప్రోచ్‌లు కలపకుండా వదిలేసిన దృశ్యం

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి (నెం.16) అనుసంధానంగా సింగరాయకొండ (ప్రకాశం జిల్లా) నుంచి పోరుమామిళ్ల (వైఎస్సార్ జిల్లా) వరకు నిర్మిస్తున్న 167బీ జాతీయ రహదారి నిర్మాణంలో మితిమీరిన జాప్యం జరుగుతోంది. రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టిన వంతెనలు, కల్వర్టులు, కూడళ్ల వద్ద సంవత్సరాల తరబడి నిర్మాణాలను అసంపూర్తి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిగిలిన రహదారి నిర్మాణాన్ని పూర్తిచేసిన కాంట్రాక్టరు వంతెనలు, కల్వర్టులు, కూడళ్ల వద్ద కనీసం సరైన ఇండికేటర్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ సమస్యతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

- వివరాలు 6లో

4 నెలల్లో ఫిషింగ్ హార్బర్‌ను
వినియోగంలోకి తెండి!

- సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో మిగిలి ఉన్న నిర్మాణాలన్నీ రానున్న నాలుగు నెలల్లో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఫిషింగ్ హార్బర్ జిల్లాస్థాయి సలహా కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పడవల యాజమాన్య సంఘాలు, ఫిష్ మార్కెటింగ్ సంఘాలు, వారి ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. హార్బర్‌లో సౌకర్యాలను, యాంత్రిక పడవలు వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోర్టు అధికారులను ఆదేశించారు. బోట్ల ద్వారా సేకరించిన మత్స్య సంపద క్రయ, విక్రయాలు జరుపుకునేందుకు ఎగుమతిదారులను ఆహ్వానించి తగిన సౌకర్యాలు కల్పించాలని ఎంపెడా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా హార్బర్‌లో ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలు, అసంపూర్తి నిర్మాణాలు, సౌకర్యాలతోపాటు హార్బర్ నిర్వహణకు వసూలు చేయాల్సిన బెర్తింగ్ చార్జీలు, గోదాముల అద్దె, లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు హార్బర్ నిర్వహణ కమిటీల ఏర్పాటు వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో పోర్టు అధికారి ధర్మశాస్త్రి, ఏపీ మారిటైం బోర్డు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సజీత్‌కుమార్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఎంపెడా ప్రతినిధి మురళీమోహన్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు వీవీఆర్.బాబు, మెరైన్ ఎస్సై నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

ఆరు నెలల్లో
67 కొత్త బస్సులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు కొత్త బస్సులు వస్తూనే ఉన్నాయి. గడిచిన ఆరునెలల వ్యవధిలో 67 కొత్త బస్సులు జిల్లాకు చేరాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రెండు బస్సులు మాత్రమే రీజియన్‌కు కూటమి ప్రభుత్వం ఆరంభంలోనే కొత్త బస్సులను కేటాయించి కాలం చెల్లిన వాటిని పక్కన పెట్టారు. ఆత్మకూరు డిపోకు ఒక సూపర్ లగ్జరీ బస్సు, కందుకూరు డిపోకు 9 సూపర్ లగ్జరీలు, రెండు అల్ట్రా డీలక్స్ బస్సులను కేటాయించారు. కావలి డిపోకు ఒక సూపర్ లగ్జరీ, నెల్లూరు ఒకటవ డిపోకు 26 సూపర్ లగ్జరీ బస్సులు, మూడు అల్ట్రా డీలక్స్‌లు, నెల్లూరు రెండో డిపోకు 4 సూపర్ లగ్జరీలు, 4 అల్ట్రా డీలక్స్‌లు, మూడు ఎక్స్‌ప్రెస్‌లు, రాపూరు డిపోకు ఒక సూపర్ లగ్జరీ, ఉదయగిరి డిపోకు 7 సూపర్ లగ్జరీలు, ఆరు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కేటాయించారు. ప్రస్తుతం ఇవన్నీ ఆయా మార్గాలలో నడుస్తున్నాయి.



పొదలకూరు మండలంలో ఇప్పటివరకు రెండు రెవెన్యూ సదస్సులు జరిగాయి. విరువూరులో జరిగిన సదస్సులో కేవలం ఒక అర్జీ మాత్రమే వచ్చింది. మంగళవారం తాటిపర్తిలో జరిగిన సదస్సులో మూడు అర్జీలు మాత్రమే అధికారులకు అందాయి.

నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులు పాల్గొనలేదు. కోర్టు వాయిదా ఉందని తహసీల్దారు వెళ్లిపోగా, ప్రత్యేక అధికారి గైర్హాజరు అయ్యారు. దీంతో డీటీ, వీఆర్వోలే మొక్కుబడిగా సదస్సు నిర్వహించారు.

భూ సమస్యలు అధికంగా పెరిగిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలన్న ఉన్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రారంభించింది. రెవెన్యూ యంత్రాంగమే ప్రజల వద్దకు వెళ్లేలా ఉన్నత లక్ష్యంతో మొదలైన సదస్సులు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. సదస్సుల నిర్వహణపై ముందస్తు సమాచారం లేకపోవడంతో చాలా మంది రావడం లేదు. అలాగే తమ సమస్యలు చెప్పుకునేందుకు బాధితులు కూడా ఆసక్తి చూపడం లేదు. ఇక్కడ అర్జీలు ఇచ్చినా పరిష్కారం దొరకదన్న అపనమ్మకం వారిలో నెలకొన్నట్లు వస్తున్న అర్జీల సంఖ్యను బట్టి అర్థమవుతోంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- ఆశించిన స్థాయిలో జరగని రెవెన్యూ సదస్సులు
- అర్జీలు ఇచ్చేందుకు ఆసక్తి చూపని భూ బాధితులు
- ఉన్నతాధికారులకు చెప్పుకునేందుకే మొగ్గు
- ముందుగా ప్రచారం చేయడంలో విఫలం
- కొన్నిచోట్ల డుమ్మా కొడుతున్న అధికారులు

లక్ష్యం ఉన్నతం..
ఫలితం శూన్యం!



చిట్టమూరు : బోగోలు పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో తన భూమికి సంబంధించి రికార్డులో తన పేరు గల్లంతు అయ్యిందని తహసీల్దారు సురేష్‌బాబును ప్రశ్నిస్తున్న మహిళ

జిల్లాను భూ సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఆక్రమణలు, రికార్డుల మార్పులు చేయడమే కాకుండా రీసర్వే కూడా తప్పుల తడకగా మారడంతో ఊహించని విధంగా భూ సమస్యలు పెరిగిపోయాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుప్పలు తెప్పలుగా అర్జీలు వచ్చి పడుతున్నాయి. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో వస్తున్న అర్జీలు సగానికిపైగా భూ సమస్యలే ఉంటున్నాయంటే పరిస్థితి ఎంత సీరియస్‌గా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితులను గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. ఆయన కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్జీలు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నడుం బిగించింది. ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని అమల్లోకి తీసుకురావడమే కాకుండా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు నిర్ణయం తీసుకుంది. డిసెంబరు 6 నుంచి జనవరి 8వ తేదీ వరకూ ప్రతి గ్రామం, వార్డులో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశించింది. ఇందుకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేకాధికారి, జిల్లాకు ఓ ఐఏఎస్ అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించింది.

- **ప్రజల్లో కనిపించని స్పందన**

రెవెన్యూ సదస్సులకు ఆయా గ్రామ వీఆర్వో మొదలు తహసీల్దార్ వరకూ ప్రతి ఒక్కరూ హాజరు కావాలి. ప్రతి రెవెన్యూ రికార్డులను దగ్గర ఉంచుకోవాలి. వచ్చే అర్జీలను బట్టి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలి. కానీ ఈ పరిస్థితి చాలా చోట్ల కనిపించడం లేదు. కొన్ని చోట్ల తహసీల్దార్లు కూడా హాజరు కావడం లేదు. ఇక ప్రత్యేకాధికారుల జాడ కనిపించడం లేదు. మంత్రులు లేదా ఎమ్మెల్యేలు వస్తుంటే వీరు కనిపిస్తున్నారు. దీంతో కిందిస్థాయి సిబ్బందే సదస్సులను తూతూమంత్రంగా ముగిస్తున్నారు. కొన్నిచోట్ల ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో సదస్సుల్లో అర్జీలు చాలా తక్కువగా వస్తున్నాయి. ఈ నెల 9వ తేదీ నాటికి రెవెన్యూ సదస్సుల్లో 459 అర్జీలు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే గత సోమవారం నాడు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 256 అర్జీలు వస్తే అందులో 130 అర్జీలు రెవెన్యూ శాఖకు చెందినవే కావడం గమనార్హం.



జలదంకి : బీకే అగ్రహారంలో జరిగిన సదస్సులో తక్కువగా హాజరైన ప్రజలు

- **ఉన్నతాధికారులకు ఇచ్చేందుకే మొగ్గు**

అటు రెవెన్యూ సదస్సుల్లో గానీ ఇటు కలెక్టర్ గ్రీవెన్స్‌లో గానీ వస్తున్న భూ సమస్యల్లో ఆర్‌వోఆర్ (రైట్స్ ఆఫ్ రికార్డ్స్)కు చెందినవే ఎక్కువగా ఉన్నాయి. రెవెన్యూ సదస్సుల్లో అలాంటి 245 అర్జీలు రాగా, అసైన్డ్ భూములకు సంబంధించి 92, భూ సరిహద్దులకు సంబంధించి 41 అర్జీలు అందాయి. అయితే అర్జీదారులు మండల స్థాయి అధికారులకు సమస్యలు చెప్పుకునేందుకు ఇష్టపడడం లేదు. వారికి చెప్పినా ప్రయోజనం ఉండదన్న అభిప్రాయం వీరిలో ఎక్కువగా ఉంటోంది. దీంతో దూరమైనా జిల్లా కేంద్రానికి వచ్చేందుకే ఆసక్తి చూపుతున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయ ఒత్తిళ్లతో మండల స్థాయిలోనే ఇష్టానుసారం అక్రమాలు జరిగాయి. భూ బాధితులు జిల్లా కేంద్రానికి వచ్చేందుకు మొగ్గు చూపుతుండటంలో ఇదే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది. మండల స్థాయిలో అర్జీలు ఇచ్చినా పరిష్కారం దొరుకుతుందన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేటి నుంచి కలెక్టర్ల సదస్సు

అమరావతి వెళ్లిన కలెక్టర్ ఆనంద్ ● ప్రధాన శాఖలపై సీఎం సమీక్ష

నెల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం బుధవారం అమరావతిలో జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు కలెక్టర్ ఓ ఆనంద్ బయలుదేరి వెళ్లారు. బుధ, గురువారాల్లో ఈ సదస్సు జరగనుంది. ప్రధాన శాఖలపై సీఎం సమీక్షించనున్నారు. జిల్లాలో వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిపై చర్చించనున్నారు. ప్రధానంగా స్వర్ణాంధ్ర-2047పై సదస్సు జరగనుంది. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రతీ జిల్లాకు ఒక విజన్ ప్లాన్ రూపొందించాలని గత కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను ఆదేశించింది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల సలహాలు, సూచనలు తీసుకున్న అధికార యంత్రాంగం స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్‌ను ప్రభుత్వానికి అందించింది. దాని ప్రకారం ఎలా ముందుకెళ్లాలన్నదానిపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.12.23 లక్షల కోట్లుకాగా అందులో నెల్లూరు జిల్లా వాటా రూ.57,887 కోట్లుగా ఉంది. రాష్ట్రంలో జిల్లా ఏడవ స్థానంలో నిలిచింది. వ్యవసాయ రంగంలో రూ.22,505 కోట్లతో ఐదవ స్థానంలో ఉండగా, పారిశ్రామిక రంగంలో 11,699 కోట్ల జీవీఏతో 11వ స్థానంలో, సేవా రంగంలో 23,683 కోట్లతో ఆరవ స్థానంలో ఉంది. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా జిల్లా స్థూల ఉత్పత్తిని 2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.1.38 లక్షల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతీ ఏడాది 15 శాతం వృద్ధి సాధించేలా ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. కాగా గోదావరి-పెన్నా నదుల అనుసంధానం అంశంపై కూడా కలెక్టర్ల సదస్సులో సమీక్షించేలా షెడ్యూల్ నిర్ణయించారు. రూ.6020 కోట్ల అంచనాతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును 2026 జూన్‌లోపు పూర్తి చేసేందుకు ఉన్న అవకాశాలపై చర్చించనున్నారు.



‘సోమశిల’కు తగ్గిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. సోమవారం 4,751 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా మంగళవారం 2,988 క్యూసెక్కులకు చేరింది. డ్యాంలో 72.603 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,550, కండలేరుకు 1,250, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువ 150 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

- **‘కండలేరు’లో 55.5 టీఎంసీలు**

రాపూరు (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాంలో 55.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 4800 క్యూసెక్కులు ఉండగా, వివిధ కాలువల ద్వారా అవుట్ ఫ్లో 1,795 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు పేర్కొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు
నేడు నోటిఫికేషన్

- 14న డబ్ల్యూఏలకు పోలింగ్ ● 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక
- ఏకగ్రీవం చేసుకునేందుకు అధికార పార్టీ వ్యూహం

నెల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే హద్దుల ఖరారు, ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు. ఇక మిగిలిన పోలింగ్ ప్రక్రియకు బుధవారం నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. జిల్లాలో మొత్తం 765 సాగునీటి సంఘాలు (డబ్ల్యూఏ), 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు(డీసీలు), ఐదు ప్రాజెక్టు కమిటీలు (పీసీలు) ఉన్నాయి. తొలుత డబ్ల్యూఏలకు నోటిఫికేషన్ ఇస్తారు. పోలింగ్ ఏ వేదికలో జరుగుతుందన్న సమాచారాన్ని ఎన్నికల అధికారులు ఆయా గ్రామాల్లో దండోరా వేస్తారు. 14వ తేదీన డబ్ల్యూఏలకు సంబంధించి సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను స్థానిక రైతులు ఎన్నుకుంటారు. ఇక అదే రోజున డీసీలకు సంబంధించి ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్ ఇస్తారు. ఎప్పుడు, ఎక్కడ.. ఎన్నిక నిర్వహించేదన్న సమాచారాన్ని డబ్ల్యూఏ అధ్యక్షులకు తెలియజేస్తారు. వీరంతా కలిసి 17వ తేదీన డీసీ పాలకవర్గాలను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ప్రాజెక్టు కమిటీ పాలకవర్గాల ఎన్నిక జరుగుతుంది. అయితే ఇది ఏ తేదీన నిర్వహిస్తారన్నది ఇంకా ఖరారు చేయలేదు. కాగా సాగునీటి సంఘాల ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలను తలపిస్తుంటాయి. పదేళ్ల తర్వాత ఎన్నికలు జరుగుతుండటంతో గ్రామాల్లో సందడి నెలకొంది. చాలా వరకూ ఏకగ్రీవం చేయాలని అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. చాలా గ్రామాల్లో ఇప్పటికే రైతులంతా ఎవరిని ఎన్నుకోవాలన్నదానిపై ఒక నిర్ణయానికి వచ్చారు. అయితే కొన్ని గ్రామాల్లో పోటీ తప్పేలా కనిపించడం లేదు. ప్రతిపక్ష పార్టీల నేతలు తమ అనుమాయులను పోటీకి దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



ప్రీక్రిస్మస్ వేడుకలకు హాజరైన క్రైస్తవులు

వైభవంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్సీ మైదానంలో మంగళవారం రాత్రి ప్రీ క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి క్రైస్తవ కూటమి సభ్యులు వందలాదిగా తరలివచ్చారు. సింహపురి ఐక్య క్రిస్మస్ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సువార్తికుడు బ్రదర్ అనీల్‌కుమార్ లైవ్ ద్వారా ప్రసంగించారు. ఆయన ప్రసంగం క్రైస్తవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. లైవ్ వర్షిప్ నైట్, కేక్ కటింగ్, క్రిస్మస్ ట్రీ ఆవిష్కరణ జరిగాయి. ఈ వేడుకల్లో నెల్లూరు బిషప్ ఎండీ ప్రకాశం, సింహపురి ఐక్యవేదిక వ్యవస్థాపకుడు బర్నబాను, నెల్లూరు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి డేవిడ్ దయాసాగర్, క్రైస్తవ నాయకులు ఊరందూరు సురేంద్రబాబు, సాల్వేషన్ ఆర్మీ మేజర్ యేసురాజ్యం, పాస్టర్‌వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు గడ్డం హనోక్, తదితరులు పాల్గొన్నారు.

16వ నెంబరు జాతీయ రహదారి సమీపంలోని గుడ్లూరు మండలం రావూరుకు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ఇది. రైల్వే లెవల్ క్రాసింగ్‌లు ప్రమాదాలకు కారణమవుతుందని ఇటీవల ఆఘమేఘాల మీద రూ.2కోట్లు వెచ్చించి ఈ అండర్ పాస్ నిర్మాణం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు అండర్ పాస్ నిండా వర్షపు నీరు నిలిచింది. దీని నిర్మాణానికి ముందు రైలు వచ్చే సమయంలో గేటు వేస్తే పది నిమిషాలు ఆగి వెళ్లేవా రమని, ఇటీవల ఇంజనీరింగ్ అధికారుల డిజైన్ చేసి నిర్మించిన పుణ్యమా అని 6కిలో మీటర్లు దూరం వెళ్లి పొలాలకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొందని చుట్టుప క్కల మాగాణి భూములున్న రైతులు వాపోతున్నారు. అండర్ పాస్ నుంచి వెళ్లొద్దని స్టాప్ బోర్డు చేయడం విడ్డూ రంగా ఉందని వాహనదారులు నవ్వు కుంటున్నారు.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)

నవ్విపోదురుగాక.. ఇంజనీర్లకేం సిగ్గు..!



రావూరుకు వెళ్లే రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిలో నీరు చేరటంతో పెట్టిన స్టాప్ బోర్డు



రావూరు రైల్వే అండర్‌పాస్‌లో 8 అడుగుల లోతున నిలిచిన నీరు

రోడ్డు మార్జిన్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పట్టణంలోని నాగులబావి వీధిలో ఇటీవల కోతకు గురైన సిమెంట్‌రోడ్డు మార్జిన్, గుంతలకు మంగళవారం పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'ఆదమరిస్తే అంతేసంగతులు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ ఈవో షేక్ కరీముల్లా మార్జిన్, గుంతల్లో మట్టి తోలి చదును చేయించి, వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)



గేటు రావాలంటే బాహుబలి రావాలా?

- విరిగిపడిన తూము గేటు
- కొనసాగుతున్న మరమ్మతులు
- త్వరగా నీరివ్వాలని తరలివచ్చిన రైతులు

లింగసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము మొదటి గేటు మరమ్మతులు మంగళవారం కూడా కొనసాగాయి. ఉదయం నరసారావుపేటకు చెందిన మెకానిక్ నిపుణులు షేక్ షమీం బాషా, ఆయన సిబ్బంది, ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది తూము గేటును పైకి లాగే పనులను ప్రారంభించారు. అయితే ఇద్దరు వ్యక్తులు తూము లోపలికి వెళ్లి విరిగిపడ్డ గేటు కింది భాగంలో ఇనుప తాడు కట్టి పైకి లాగేందుకు ప్రయత్నించినా ఒక్క అంగుళం కూడా కదలలేదు. పదే పదే ప్రయత్నించి గేటు రాక పోవడంతో, బాషా బీమ్‌ను ఏర్పాటు చేయించారు. అలాగే మరో ఇనుప తాడు, మరికొన్ని పరికరాలను కందుకూరు నుంచి తెప్పించి సాయంత్రం నాలుగు గంటలకు పనులు చేశారు. రాత్రి కూడా ఈ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ, రాత్రికి గానీ బుధవారం మధ్యాహ్నం లోపు గేటును బయటకు లాగేస్తామన్నారు.



కాలువ తూము వద్ద గేటును పైకి లాగేందుకు యత్నిస్తున్న మెకానిక్ షమీం బాషా, అధికారులు, సిబ్బంది

● రైతుల ఆందోళన

ప్రాజెక్టు కుడి కాలువ తూము నాలుగురోజులుగా తమ పొలాలకు నీరు విడుదల కాకా పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ పంటలు ఎండిపోతున్నాయని త్వరగా నీరివ్వాలని ఉదయం నుండి సాయంత్రం వరకు అనేక మంది ప్రాజెక్టు వద్దకు తరలి వచ్చి నిరీక్షించారు. చాలా మంది రైతులు కూడా గేటును పైకి లేపేందుకు అధికారులకు కూడా సాయపడ్డారు. గేటు రాకపోవడంతో నిరాశగా సాయంత్రం 6గంటలకు ఇళ్లకు తిరిగివెళ్లారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర



డ్యాం వద్ద కూర్చొని ఉన్న రైతులు

రావు ప్రాజెక్టు నిర్వహణకు, అభివృద్ధికి భారీగా నిధులు కేటాయింప జేసి, అధికారులను, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

డ్రైవింగ్ ట్రాక్.. ఇక అంతా ఆటోమేటికే!

- తప్పులు గుర్తించనున్న సెన్సార్లు, కెమెరాలు
- పరీక్షలో పొరపాటు చేస్తే ఫొటోలతో రుజువు
- వేగంగా అధునాతన పనులు
- నెల రోజుల్లో అందుబాటులోకి

నెల్లూరు (క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మొదటివిడతలో చిత్తూరు, అనంతపురం, కర్నూలు, విజయవాడలో అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ ట్రాక్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండో విడతలో నెల్లూరులోని ఆర్టీవో కార్యాలయంలో ట్రాక్ ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించిన ఆర్ఎఫ్ఐడీ కెమెరాలు, సెన్సార్లు, స్తంభాలు, ఇతర సామగ్రి జిల్లాకు చేరాయి. నెలలో పనులు పూర్తికానున్నాయి. ఆ తర్వాత అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ ట్రాక్‌పై ట్రయల్ వేయాల్సి ఉంటుంది.

● పోల్స్‌పై కెమెరాలు

అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ ట్రాక్‌లో పోల్స్‌పై కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ట్రాక్ కింద సెన్సార్లు అమరుస్తారు. సెన్సార్లలో డ్రైవింగ్ టెస్టుకు సంబంధించిన పారా మీటర్స్ పొందుపరుస్తారు. ఈ క్రమంలో సెన్సార్లు ట్రాక్‌పై రూట్ మ్యాప్ ప్రకారం నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతున్నారా.. లేదా? అని చూస్తుం టాయి. ఇక పోల్స్‌పై ఉన్న కెమెరాలు ఎక్కడెక్కడ తప్పు చేశారో ఫొటోలు తీస్తాయి. ఇలా డ్రైవింగ్ టెస్ట్ పూర్తయ్యేసరికి హాజరైనవారు ఎక్కడెక్కడ ఎన్నెన్ని తప్పులు చేశారోనని ఫొటోలతో వారికి చూపించి ఎందుకు ఫెయిల్ అయ్యారో.. కూడా చూపుతుంది. నిబంధనల మేరకు డ్రైవింగ్ టెస్ట్ పాస్ అయితే ధమ్ వేయించుకొని పంపుతారు. ఈ ట్రాక్ అందుబాటులోకి వస్తే అధికారులు చేసేదేమి ఉండదు. చిత్తూరులో అందు బాటులోకి వచ్చిన అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ ట్రాక్‌లో డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరైన వారిలో ఫెయిల్ అయ్యే వారి సంఖ్య అధికంగా ఉన్నట్లు సమాచారం. కాబట్టి వాహన దారులు ఇక నుంచి జాగ్రత్తగా నడుచుకోవాలి.



కార్యాలయానికి వచ్చిన డిజిటల్ ట్రాక్ స్తంభాలను పరిశీలిస్తున్న ఆర్టీవో అధికారులు



నెలలో అందుబాటులోకి..

అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ ట్రాక్ పనులు జరుగుతున్నాయి. నెల రోజుల్లో పూర్తవుతాయి. సెన్సార్ల ద్వారా డ్రైవింగ్ టెస్ట్ ఫలితాలు వెలువడుతాయేతప్ప అధికారులు, సిబ్బంది చేసేదేమీ ఉండదు.

- డీ చందర్, డీటీసీ

మరుగుదొడ్ల వినియోగం ఆరోగ్యవంతం

● జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మరుగుదొడ్లను వినియోగించుకోవడం గ్రామీణ ప్రజల గౌరవంతోపాటు ఆరోగ్యవంతమైన జీవితాలకు ఆధారమవుతుందని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ తెలిపారు. ప్రపంచ టాయిలెట్ దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ బహిర్భూమికి ఎవరూ వెళ్లకూడదనే లక్ష్యంతో ఉండాలన్నారు. సామాజిక మరుగుదొడ్లను కేవలం నిర్మించడంతోనే సరిపోదని, వాటిని సక్రమంగా ఉపయోగిస్తేనే లక్ష్యం నేరవేరుతుందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ మరుగుదొడ్ల లబ్ధిదారుల కు, ఉత్తమ సామాజిక శానిటరీ కాంప్లెక్స్‌లకు పురస్కారాలు అందజేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విద్యారమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కారుడ్రైవర్ కళ్లలో కారం కొట్టి దాడిచేసిన వ్యక్తులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని మూలాపేట కోనేటిమిట్టకు చెందిన మురళీ కారు డ్రైవర్. సోమవారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మాస్క్ వేసుకుని అతని ఇంటి వద్దకు వచ్చారు. ఆ సమయంలో మురళీ ఇంట్లో లేకపోవడంతో అతని నెంబర్ సేకరించి కావలికి వెళ్లేందుకు కారు కావాలని కోరారు. అయితే అతను తన వద్ద కారు లేదని చెప్పడంతో వేరే వ్యక్తులను సంప్రదించి ఫేత్తేఖాన్‌పేటలో ఉన్న మురళీ వద్దకు వచ్చారు. కారు బాడుగ విషయమై మాట్లాడుతూ ఆకస్మాత్తుగా మురళీ కళ్లలో కారం కొట్టి రాయితో దాడిచేసి పరారయ్యారు. బాధితుడు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ పథకం ప్రకారమే దాడి జరిగినట్లు పోలీసులు భావించి ఆ దిశగా విచారిస్తున్నారు.

కారు అద్దాలు పగులగొట్టి దోపిడీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలో నిలిపి ఉన్న కారు అద్దాలు పగులగొట్టి అందులో ఉన్న నగదు బ్యాగులను అపహరిం చుకొని వెళ్లిన ఘటనలు చోటుచేసుకున్నాయి. కేసులు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. పొగతోట నాల్గో వీధిలో సత్యనారాయణ కుటుంబం నివసిస్తోంది. ఆయన కుమారుడు రాహుల్‌బాబు ఈఎన్‌టీ వైద్యుడు. సత్యనారాయణ కొంతకాలంగా ఆనారోగ్యంతో బాధపడుతూ ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పెంచలయ్య వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం సత్యనారాయణ కుమారుడు, కోడలితో కలిసి కారులో పెంచలయ్య వైద్యశాలకు వెళ్లారు. అక్కడ వీరి కారు డోర్ అద్దాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులో ఉన్న హ్యాండ్ బ్యాగును దోచుకెళ్లారు. చికిత్స అనంతరం బాధితులు కారు వద్దకు వచ్చి చూడగా అద్దం పగలగొట్టి ఉంది. హ్యాండ్‌బ్యాగ్ కనిపించకపోవడంతో చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. చోరీకి గురైన హ్యాండ్‌బ్యాగ్‌లో రూ.60 నగదు, క్రెడిట్, డెబిట్ కార్డులు ఉన్నాయని రాహుల్‌బాబు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నర్తకి సెంటర్ సమీపంలోనూ

నగరానికి చెందిన హర్ష సోమవారం రాత్రి పని నిమిత్తం నర్తకి సెంటర్‌కు వచ్చారు. సెంటర్‌లో తన కారును పార్క్ చేసి సమీపంలోని దుకాణానికి వెళ్లారు. ఆ సమయంలో గుర్తుతెలియని దుండగులు కారు అద్దాన్ని పగులగొట్టి అందులో ఉన్న బ్యాగ్‌ను అపహరించుకుని వెళ్లారు. పని ముగియడంతో కారు వద్దకు చేరుకున్న వర్ష అద్దం పగులగొట్టి ఉండటం, కారులోని బ్యాగ్ కనిపించకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో పోలీసులు సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితులను గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు.

అసంపూర్తి చేయరా!?

- 167బి జాతీయ రహదారి నిర్మాణంలో తీవ్ర జాప్యం
- ఏడాదిగా ఆగిన కల్వర్టులు, వంతెనలు, కూడళ్ల నిర్మాణాలు
- ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం
- కందుకూరు బైపాస్ నిర్మాణంలోనూ ఇదే తంతు

కందుకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ (ప్రకాశం జిల్లా) నుంచి పోరుమామిళ్ల (వైఎస్సార్ జిల్లా) వరకు జరుగుతున్న 167బీ జాతీయ రహదారి నిర్మాణపనుల్లో అంతులేని జాప్యం జరుగుతోంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరాయకొండ, కందుకూరు మార్గంలో మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాల వద్ద, ఓగూరు సమీపంలో, మాల్యాద్రి కాలనీ సమీపంలో, కందుకూరు- మాలకొండ రహదారిలోని చెర్లోపాలెం, బడేవారిపాలెం వద్ద ఎర్రవాగుపై, పందివాగుపై అసంపూర్తి నిర్మాణాలు ఉన్నాయి.

● ఈ మార్గంలో నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల వద్ద , బైపాస్ రోడ్డులు నిర్మాణం జరుగుతున్న గ్రామాల వద్ద కూడళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేసి ఉన్నారు.

● పందివాగుపై వంతెన నిర్మాణం జరుగుతుండగా మిగిలిన చోట్ల వంతెనల నిర్మాణాలు పూర్తయినా అప్రోచ్‌లను నిర్మించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అక్కడి వరకు నూతన రహదారిపై వేగంగా వస్తున్న వాహనాలు సరైన ఇండికేటర్లు కూడా లేక షడన్ బ్రేక్‌లు వేసి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ పరిస్థితిపై జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదని వాపోతున్నారు. రాత్రివేళలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

● వంతెనలు, కల్వర్టుల వద్ద అప్రోచ్‌లను తాత్కాలికంగా బీటీతో సరిచేసినా కొంతవరకు ఇబ్బంది లేకుండా ఉంటుందని పలుచోట్ల మట్టితోను, మరికొన్ని చోట్ల మెటల్ వేసి వదిలేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో సమస్య మరింత జఠిలమైందని చెబుతున్నారు.

● కందుకూరు బైపాస్ నిర్మాణంలోను..

167బీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కందుకూరుకు బైపాస్ నిర్మాణంలోను మితిమీరిన జాప్యం జరుగుతోంది. ఈ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మొదట పనులు ప్రారంభించినది కందుకూరు బైపాస్ పనులే. అయినా ఇంతవరకు పనుల్లో ఆశించిన పురోగతి లేదు. దీనికితోడు బైపాస్ డీపీఆర్ రూపకల్పనలోను లోటుపాట్లు ఉండటం, పలు వాగులు, వంకలతోపాటు పట్టణంలోని వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా వెళ్లిపోయేందుకు వీలుగా వంతెనల నిర్మాణం జరగకుండా బైపాస్ నిర్మాణం జరగటం ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యతో కందుకూరు పట్టణంలోను అనేక ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. కొద్దిపాటి వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే అతి భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఆందోళన కలిగిస్తోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. కందుకూరు బైపాస్ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయటంతో పాటు వరదనీరు సాఫీగా వెళ్లేలా అవసరమైన చోట్ల కల్వర్టులు, వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



పందివాగు వంతెన సమీపంలోని అప్రోచ్ రోడ్డు దుస్థితి

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

● బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందిస్తున్న కండక్టర్ ఇస్మాయిల్

అనంతసాగరం, 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న అనంతసాగరం వాసి ఇస్మాయిల్ విధినిర్వ హణలో తన నిజాయితీ చాటుకున్నాడు. సోమశిల నుంచి ఆత్మకూరుకు మంగళ వారం ఉదయం బస్సు వస్తుండగా, పాతదేవరాయ పల్లికి చెందిన నరసయ్య సెల్‌ఫోన్ బస్సులో పడిపోయింది. దాన్ని భద్రంగా ఉంచి నరసయ్యకు అందించాడు. దీంతో ఇస్మాయిల్‌ను పలువురు అభినందించారు.

రైల్వే పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేయండి

● రైల్వే మంత్రిని కోరిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర ఎంపీలతో కలిసి ఆయన కేంద్ర మంత్రిని కలిశారు. రైల్వే పెండింగ్ ప్రాజెక్ట్‌ల త్వరగా పూర్తిచేయాలని ఎంపీ కోరారు. ప్రధానంగా కావలియార్డు, వేదాయపాళెం, అల్లూరు రోడ్డు, వెంకటాచలం, గూడూరు, పడుగుపాడు, తెట్టు-ఉలవపాడు, వెంకటేశ్వరపాళెం తదితర 11 లెవెల్ క్రాసింగ్‌లపై వెంటనే ఆర్‌వోబీ, ఆర్‌యుబీలను నిర్మించాలని కోరారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైను పనులను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా బిట్రగుంట రైల్వే ప్రాంతాన్ని అభివృద్ధి చేయలని, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సంబంధించిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ యూనిట్‌ను బిట్రగుంటలో ఏర్పాటు చేయలని కోరారు.



కేంద్రమంత్రి రాజీవ్‌రంజన్ సింగ్‌తో ఎంపీ వేమిరెడ్డి

● మత్స్యకారుల సమస్యలపై

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : కేంద్ర మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తోనూ ఎంపీ వేమిరెడ్డి భేటీ అయ్యారు. జిల్లాలోని మత్స్యకారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. విడవలూరు మండలం పొన్నపూడి పాతూరులో ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు చేయాలని కోరారు. పైడేరుకు ఇరువైపులా డ్రెడ్జింగ్, రివిట్‌మెంట్ పనులు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

● 885 మంది గైర్హాజరు

వెంకటాచలం, డిసెంబరు 10(ఆంధ్ర జ్యోతి): విక్ర మ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో మంగళవారం నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయని వీఎస్‌యూ పరీక్షల నిర్వాహ ణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 8,722 మంది విద్యా ర్థులకు గాను 7,837 మంది హాజరు కాగా 885 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

మామిడి పంటకు రూ.45 వేల బీమా

ఉలవపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మామిడి పంటకు ఎకరానికి రూ.2,250 చెల్లించి బీమా చేయించుకుంటే వాతావరణంలో మార్పులు, విపత్కర పరిస్థితులతో పంటకు నష్టం కలిగితే రూ.45వేల వరకు పంట నష్టం ఇన్సూరెన్స్ వస్తుం దని జిల్లా ఉద్యాన అధికారి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక రైతుసేవా కేంద్రం-2లో జరిగిన వాతావరణ ఆధారిత పంట-బీమాపై మామిడి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ నెల 15 నుంచి వచ్చే ఏడాది మే నెల వరకు బీమా వర్తిస్తుందన్నారు. ఎఫ్‌పీవో గ్రూపులు, రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐసీ ఇన్సూరెన్స్ కంపెనీ డిప్యూటీ మేనేజర్ ధనుంజయ, ఎఫ్‌పీసీ డైరెక్టర్ బాలచంద్ర, మండల ఉద్యాన అధికారి జ్యోతి, కావలి, వింజమూరు, సంగం ఉద్యాన అధికా రులు, కందుకూరు డివిజన్‌లోని గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యన అధికారి సుబ్బారెడ్డి

పీజీ పరీక్షలకు అనుమతులు

అల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ విద్యాసంస్థల్లో పీజీ పరీక్షా కేంద్రానికి అనుమతులు లభించినట్లు ప్రిన్సిపాల్ ఎ.హరిప్రసాద్ తెలిపారు. ఈ విషయంపై మంగళవారం ఆయన కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లుగా తమ విద్యాసంస్థల్లో పీజీ కళాశాలను నిర్వహిస్తున్నా పరీక్షలు రాసేందుకు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకే విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీని కోరగా ఆయన స్పందించి అనుమతులు మంజూరు చేశారని తెలిపారు. తొలుత జంబ్లింగ్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించాలని తదుపరి సాధారణ స్థితిలో పరీక్షలు నిర్వహించేలా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు ముప్పా గంగిరెడ్డి, నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనంకు త్రెడ్డింగ్ చిత్రపటం బహూకరణ

సంగం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జండాదిబ్బకి చెందిన ఆనం అభిమాని సూరాయపాళెం పవన్‌కుమార్ త్రెడ్డింగ్‌తో తయారు చేయించిన చిత్రపటాన్ని మంగళవారం మంత్రి రామనారాయణరెడ్డికి బహూకరించారు. కాకినాడకు చెందిన త్రెడ్డింగ్ ఆర్టిస్టు 240 శీలలు, ఏడు కిలోమీటర్ల దారం, 4,500 లైన్లతో ఆనం చిత్రాన్ని తయారు చేశారు. ఈ చిత్రపటాన్ని నెల్లూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయనకు అంద చేశారు. కార్యక్రమంలో వెంగారెడ్డిపాళెం సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి, సిద్దీపురం శ్రీనివాసులురెడ్డి ల్గొన్నారు.



తెడ్డింగ్ చిత్రపటాన్ని మంత్రి ఆనంకు అందచేస్తున్న అభిమాని

రాష్ట్రస్థాయి కౌశల్-2024కు గురుకుల విద్యార్థి

లింగసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదపవనిలోని అంబేడ్కర్ గురుకుల విద్యార్థిని ఒంగోలు ఉమామహేశ్వరి కౌశల్-2024 పోస్టల్ ప్రజంటేషన్‌కు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. గురుకులంలో 8వ తరగతి చదువుతున్న ఉమామహేశ్వరి ఈ నెల 6న జిల్లాస్థాయి ఆన్‌లైన్ పరీక్షను జిల్లాస్థాయిలో ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థిని, పరీక్షకు సిద్ధం చేసిన ఉపాధ్యాయులు ప్రవీణ, శ్రీవిద్యలను ప్రిన్సిపాల్ అభినందించారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

● శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి



కావలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశామని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ఈ వారం ముఖాముఖీ...

? : పనుల మెరుగుదలకు ఏ చర్యలు తీసుకుంటున్నారు.

! : రోడ్లపై చెత్త కాని, డంపర్ బిన్‌లు కాని కనిపించకుండా ఉండేలా చూస్తాం.

? : కొత్త ప్రణాళిక ఉంటుందా.

! : ఇంటింటా సేకరించిన చెత్తను బంపర్‌బిన్‌లలో పోయకుండా ప్లాస్టిక్ డబ్బాలలో ఉంచి వాటిని ఐరన్‌మెన్‌లతో తయారు చేసిన ప్రదేశాలలో భద్రపరుస్తారు. అక్కడకు ట్రాక్టర్లు వచ్చి చెత్త తీసుకెళతాయి.

? : ట్రాక్టర్లు తీసుకెళ్లే చెత్తను ఎక్కడకు తరలిస్తారు.

! : తుమ్మలపెంట రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రాంతంలో కాం పాక్ట్ వాహనదారులకు అందజేస్తారు. వారు డంపింగ్ యార్డుకు తరలిస్తారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



మూడేళ్లుగా 'పది'లో ఉత్తమ ఫలితాలు
క్రీడలతోపాటు ఎన్‌సీసీలోనూ ప్రావీణ్యం

ఫలితాల్లో రోల్ 'మోడల్'

వలేటివారిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ పాఠశాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా చుండి ఆదర్శ పాఠశాల ఫలితాల్లో పేరు తెచ్చుకుంటోంది. 551 మంది విద్యార్థులు చదివే ఈ పాఠశాలలో టీచర్లు ప్రత్యేక తరగతులు, ఉత్తమ విద్యను అందిస్తున్నారు. చదువు ఆటల్లోనూ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు.

గత ఏడాది పది ఫలితాల్లో..

పాఠశాలలో చదివిన పది విద్యార్థి బొమ్మారెడ్డి జగన్ 588 మార్కులతో నియోజకవర్గ టాపర్‌గా నిలిచాడు. అలాగే ఇంటర్‌లో దోసకాయలపాటి మాధురి 981మార్కులతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విద్యార్థికి ప్రభుత్వం ఇచ్చే రూ.50వేల ప్రోత్సాహక నగదును అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా నగదు, ప్రశంసాపత్రంను అందుకుంది. అలాగే అప్పటి ఎమ్మెల్యే మా ను గుంట మహీధర్ రెడ్డి విద్యార్థి ప్రతిభను గుర్తించి రూ.13వేలు సొంత నగదును అప్పటి సబ్ కలెక్టర్ శోభిత చేతుల మీదుగా అంద జేశారు. 12మంది విద్యార్థులు ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీట్లు పొందారు.



కీడలో వచ్చిన అవార్డులు (ఫైల్)

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లో..

విద్యార్థులు పి.రాకేష్, సీహెచ్.హృత్విక్ సాయి కోటి, బి.నవ్యశ్రీలు ఏడాదికి రూ.12 వేలు చొప్పున 4ఏళ్లకు రూ.48వేలు స్కాలర్‌షిప్ పొం దుతున్నారు. అంతేగాకుండా 28మంది ఎన్‌సీసీకి ఎంపికైనారు. వీరికి ట్రిపుల్‌ఐటీ, మెడికల్, ఇంజ నీరింగ్, ఎంసెట్‌లో 3శాతం రిజర్వేషన్ వర్తించ నుంది. అలాగే నేషనల్ చిల్డ్రన్స్ సైన్సు కాంగ్రె స్‌కు రాష్ట్రస్థాయిలో చెరువుపల్లి హృత్విక్ ఎంపికై య్యారు. మోడల్‌స్కూల్ వృత్తి విద్యా కోర్సుల్లో నియోజకవర్గంలోనే హబ్ స్కూల్‌గా ఎంపికైంది. అంతేగాకుండా స్పోర్ట్స్ జగనన్న ఈవెంట్స్‌లో విద్యార్థులు ఎన్నో అవార్డులు సాదించారు.

దాతల సహకారంతో

పాఠశాల క్రీడాకారులకు క్రీడా పరికరాలు లేవని ప్రిన్స్‌పల్ చెప్పడంతో వలేటివారిపాలెం జడ్పీటీసీ దంపతులు ఇంటూరి భారతి - హరిబాబులు రూ.10వేలు అందజేశారు. అయ్యవారిపల్లె టింకం కొండలరావు అనే వ్యాపారవేత్త రూ.5వేల విలువ చేసే షైక్‌సెట్‌ను బహూకరించారు.

ప్రథమ స్థానంలో నిలవడమే లక్ష్యం



మోడల్ స్కూల్‌ను అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దా లన్నదే తమ లక్ష్యం. ప్రత్యేక తరగతులు, క్రీడల్లో శిక్షణ ఇస్తున్నాం.

\- శ్రీవెంకటేశ్వర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, చుండి

భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



అయ్యవారిపల్లెలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



సీతారామపురం: అర్జీ స్వీకరిస్తున్న అధికారులు

వలేటివారిపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. అయ్యవారిపల్లె సచివాలయంలో మంగళవారం జరిగిన సదస్సులో సబ్ కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతుల వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్‌అమీద్, సర్పంచ్ డేగా వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ ప్రసాద్, ఎండోమెంట్ ఈఓ పావని, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శేషుబాబు, వీఆర్వో నారాయణ పాల్గొన్నారు.

● జలదంకి: బి.కెఅగ్రహారంలో నిర్వహించిన సదస్సులో తహసీల్దారు ప్రమీల హాజరై అర్జీలు స్వీకరించారు. మొత్తం 26అర్జీలు అందినట్లు తెలిపారు. వీటిని 45రోజుల లోపు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీజ, వీ ఆర్వో తిరుపతయ్య, ఉపసర్పంచ్ దగుమాటి మాల్యాద్రిరెడ్డి పాల్గొన్నారు.

● సంగం: తలుపూరుపాడు, నీలాయపాళెంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఉదయం తలుపూరుపాడులో, మధ్యాహ్నం నీలాయపాళెంలో సదస్సులు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లానాయక్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తలుపూరుపాడులో పలువురు భూ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు నాజున్ని. స్థానిక నాయకులు షేక్ బాబు, ఖాదర్‌బాష పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్: గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దారు సుభద్ర పేర్కొన్నారు.అప్పసముద్రం, దాసరిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వివిధ సమస్యలపై రైతులు 68 అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో కవిత, ఆర్‌ఐ డీటీ హసీనా, ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్వోలు చెన్నకృష్ణయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● దుత్తలూరులో: బోడవారిపల్లిలో తహసీల్దారు వై.నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● గుంపార్లపాడులో..

ఏఎస్‌పేట: గుంపార్లపాడులో తహసీల్దార్ వెంటేశ్వర్లు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదారుపాసు పుస్తకాలు, మ్యుటేషన్, వన్‌బీ అడంగల్ కరెక్షన్స్ సమస్యలపై 32 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రంగారెడ్డి, ఆర్‌ఐ మస్తాన్‌వలి, వీఆర్వో రమణయ్య, సర్వేయర్లు అజీజ్, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● లింగసముద్రం: తహసీల్దార్ సీతామహాలక్ష్మి మొగిలిచెర్లలో జరిగిన రెవెన్యూ సదస్సులో 18మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ పి రమణయ్య, వీఆర్‌ఓ అమానుల్లాఖాన్, సర్వేయరు వెంకటేష్ పాల్గొన్నారు.

● ఉలవపాడు: మండలకేంద్రంలో జరిగిన సదస్సుకు 39 అర్జీలు వచ్చాయి. పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు లావణ్య పాల్గొన్నారు.

● వరికుంటపాడు: మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తహసీల్దారు హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. గణేశ్వరాపురం, నారసింహాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు 81అర్జీలు అందచేశారు. ఈ అర్జీలకు త్వరలో పరిష్కార మార్గం చూపుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేరం సుధాకర్‌రెడ్డి, ఆర్‌ఐ యశ్వంత్ కుమార్, వీఆర్వోలు మనోహర్, ప్రసాద్, సర్వేయర్లు విష్ణు, పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీలో తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో 35 మంది రైతులు వినతులు అందజేశారు. బోగోలు, అక్కరాజు వారి కండ్రిక, నాగులవరం పంచాయతీల రైతులు ఎక్కు వగా వచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వాజీద్, టీడీపీ మం డల కన్వీనర్ నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, ప్రసన్న ఆలయ ఈవో రాధాకృష్ణ, వీఆర్వోలు ఉన్నారు.

● సీతారామపురం: పబ్బులేటిపల్లి సచివాలయంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహిం చా రు. రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు,సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆ ర్వో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడు : అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు హేమంత్‌కుమార్



తలుపూరుపాడులో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దారు సోమ్లానాయక్

న్యూస్ బాక్స్

బీఎంఆర్ ఎంపికపై హర్షం

అల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఎంఆర్ ట్రస్ట్ అధినేత, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు రాజ్యసభకు ఎంపిక కావడం శుభపరిణామమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మంగళవారం ఆయన విజయవాడలో బీద మస్తాన్‌రావును కలుసుకొని పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బిట్రగుంట చైతన్య పాల్గొన్నారు.

ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు

కందుకూరు, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): జాతీయ మానవహక్కుల దినోత్స వం సందర్భంగా మంగళవారం మంగళ వా రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉచిత న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ పాల్గొన్నారు. వారి వెంట న్యాయవాది పోకూరి కోటయ్య పాల్గొన్నారు.

నాగబాబుకు ఎంపికపై హర్షం

కావలి, డిసెంబరు 10: జనసేన సీనియర్ నాయకుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదల నాగబాబుకు రాష్ట్రమంత్రివర్గంలో చోటు కల్పించేందుకు నిర్ణయం తీసుకోవడం శుభసూచకమని జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ అన్నారు. ఈ విషయంపై మంగళవారం ఆ యన స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అనంతరం జనసైనికులకు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. జనసేన జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జనసైనికులు స్థానిక ట్రంకు రోడ్డులోని బ్రిడ్జి సెంటర్‌లో బాణసంచా కల్చి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు బొబ్బా సాయి విఠల్ ఉన్నారు.

రాళ్లపాడు నీటి విడుదలపై ఎమ్మెల్యేల చర్చ

కొండాపురం, డిసెంబరు10: రాళ్లపాడు కుడి కాలువ ద్వారా మండలానికి సాగు నీటిని విడుదల చేసేందుకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో చర్చించడం హర్షనీయం అని మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, మాజీ మండల మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని అన్నారు. ఈ విషయంపై మంగళవారం వారు మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాళ్లపాడు జలాశయం కుడి కాలువ కింద మండల రైతులు ఈ ఏడాది 3వేల ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నట్లు తెలిపారు. కాలువ గేటు మరమ్మతులతో వారిలో ఆందోళన నెలకొందన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన కుందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో చర్చించి బుధవారం కాలువకు నీరు విడుదల చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

కందుకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సంస్థాగతంగా బలపడేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్ కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధరరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి గాజుల వెంకయ్యానాయుడు, భాస్కరగౌడ్, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, సురేష్, ముప్పల భూషయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు పాల్గొన్నారు.



కందుకూరు: సమావేశంలో పాల్గొన్న నేతలు

● **బూత్ కన్వీనర్ల సమావేశం**

వింజమూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోనుగుంట రామయ్య కళ్యాణ మండపంలో మంగళవారం బీజేపీ ఉదయగిరి నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్‌జీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ గ్రామస్థాయిలో బలపడేలా అందరూ కృషి చేయాలన్నారు. అలాగే బూత్‌కన్వీనర్ల నియామకం చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకురాలు మిడదాల రమణమ్మను సన్మానించారు. దివ్యాంగుడైన సచ్చు వినోద్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు డేగ మధుయాదవ్, జిల్లా ఇన్‌చార్జి వెంకయ్యానాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు పీవీ నారాయణరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కేవీ రంగారావు, అన్నీ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుస్థిరావృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ

వింజమూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై సర్పంచులు, సచివాలయం సిబ్బందికి రెండు రోజుల శిక్షణను ప్రారంభించారు. 9 లక్ష్యాలను సాధించేందుకు గ్రామ పంచాయతీలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని, నిర్దేశిత గడువులో లక్ష్యసాధనకు కృషి చేయాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా పంట నష్టం వివరాల నమోదు

వరికుంటపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో 33శాతం కన్నా ఎక్కువ పంట దెబ్బతిన్న రైతులు ఈ నెల 12వ తేదీలోగో వీఏఏల వద్ద వివరాలు నమోదు చేయించుకోవాలని మండల ఏవో రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని తోటలచెరువుపల్లి, జీ.కొండారెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బీమా పథకం కింద మామిడి పంటకు ఎకరానికి రూ.2,250లు ప్రీమియం చెల్లిస్తే నష్టపోయిన రైతులకు రూ.45 వేలు వస్తుందని ఉద్యానవన శాఖాధికారిణి జయశ్రీ పేర్కొ న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీద లక్ష్మానందకు జాతీయ సేవా పురస్కారం

కావలి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకుడిగా జాతీయ స్థాయిలో విశేష సేవలందిస్తున్న లైఫ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు బీద లక్ష్మానంద జాతీయ సేవా పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం కాకినాడలోని ఢీ కన్వెన్షన్ సెంటర్‌లో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డుపాటి దాసు ఈ సేవా పురస్కారం అందజేశారు.

ఉత్సాహంగా డివిజన్ స్థాయి జూ.కళాశాలల క్రీడా పోటీలు

ఆత్మకూరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం డివిజన్ స్థాయి జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు జరిగాయి. నెల్లూరు నెహ్రూ యువ కేంద్రం యూత్ అధికారి మహేంద్రరెడ్డి, జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ గయాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా క్రీడల పట్ల శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, ఖోఖో, పరుగుపందె, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. తదుపరి హ్యూమన్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించి, అవగాహన కల్పించారు. ముగింపులో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందచేశారు.



మెమొంటోలు, ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములు అక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దారు వై.నాగరాజు హెచ్చరించారు. మందాలనాయుడుపల్లిలో శ్మశానాన్ని అక్రమిస్తున్నారని ఫిర్యాదు అందడంతో మంగళవారం సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అక్రమణకు గురైన భూమిని పరిశీలించారు. అక్రమణదారుడిపై చర్యలు చేపట్టడంతోపాటు ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాగా మండలంలోని బోడవారిపల్లి ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాలను తహసీల్దారు సందర్శించారు. దాతల సహాయంతో పాఠశాల ఆవరణను చదును చేయించారు.

సరస్వతి విగ్రహం ఆవిష్కరణ

ఏఎస్‌పేట, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబ్బీపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవో సాయిప్రసాద్ సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల పూర్వవిద్యార్థులు, గ్రామస్థుల సహకారంతో విగ్రహన్ని ఏర్పాటు చేశామని హెచ్‌ఎం నెల్లూరు సురేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి అల్లంపాటి మాధవరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎం ఫణిధర్, జనసేన నాయకులు వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన

ఉదయగిరి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):సబ్‌డివిజన్ పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ డీఈ, ఎన్నికల నోడల్‌అధికారి చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్ డివిజన్‌లోని గండిపాళెం జలాశయానికి సంబంధించి 17 డిస్ట్రిబ్యూటరీలు, ఉదయగిరి మండలంలో 11, సీతారామపురం మండలంలో ఆరు చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 14న ఉదయం 8నుంచి 9గంటల వరకు టీసీ మెంబర్ల సమావేశం, 9.45 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల ఎన్నికలు జరుపుతామన్నారు. పోటీచేసే వ్యక్తులు తప్పనిసరిగా నీటితీరువా పన్నులు చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. పోటీ చేసే అదే సంఘంలో వ్యక్తి ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు.

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): మొగిలిచెర్ల, లింగసముద్రం, విశ్వనాదపురం, వీఆర్ కోట, చినపవని, పెదపవని, మేదరమెట్లపాలెం సాగునీటి చెరువుల సంఘాలకు ఎన్నికల నోటిఫి కేషన్‌ను బుధవారం విడుదల చేస్తున్నట్లు ఎన్నికలనోడల్ అధికారి చంద్రమౌళి తెలిపారు.

ఉద్యోగాలకు 19 మంది ఎంపిక

ఉదయగిరి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 19 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎల్.నారాయణస్వామి తెలిపారు. జాబ్‌మేళాకు 41 మంది పాల్గొనగా, వారిలో 19 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యాయరన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్ మెంట్ అధికారి అబ్దుల్‌ఖయ్యూం, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, అక్మల్, శివ పాల్గొన్నారు.

సంక్రాంతి తరువాత పనుల ప్రారంభం : మంత్రి ఆనం

మర్రిపాడు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): సోమశిల హైలెవెల్ కెనాల్ మొదటి విడత పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడి రైతులకు భరోసా ఇచ్చారు. ఈ పనులకు సంక్రాంతి తరువాత ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. మండలంలోని పొంగూరులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సు అనంతరం ఆగిపోయిన సోమశిల హైలెవెల్ కెనాల్‌ను, పొంగూరు రిజర్వాయర్‌ను మంత్రి సందర్శించారు. సీఎం చంద్రబాబు ఇటీవల సోమశిల ప్రాజెక్ట్‌ను సందర్శించి, హైలెవెల్ పంపింగ్ స్కీమును చూసి పనులు ప్రారంభించమని అధికారులను ఆదేశించమన్నట్లు తెలిపారు. మొదటి విడతగా పొంగూరు, పడమటినాయుడుపల్లి రిజర్వాయర్‌లకు మరో 2500ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. హైలెవెల్ పనులు పూర్తికాగానే వెలుగొండ ప్రాజెక్ట్ ద్వారా నీటిని తీసుకొచ్చి, 44వేల ఎకరాలకు సాగునీరు అందేలా చూస్తామన్నారు.



పొంగూరు కట్ట పనులను పరిశీలిస్తున్న మంత్రి ఆనం, తదితరులు

● **కక్ష సాధింపునకే ఆస్తుల మార్పిడి**

ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకునేందుకు గత ప్రభుత్వంలో ఆస్తుల మార్పిడి జరిగిందని మంత్రి ఆనం వ్యాఖ్యానించారు. అన్నీ హక్కులు ఉన్నా.. ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకునేందుకు వారి ఆస్తులను సైతం దేవుడి భూములుగా కంప్యూటర్ అడంగల్‌లో నమోదు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శీనానాయక్, ఆర్డీవో పావని, టీడీపీ నాయకులు గిరినాయుడు, రవీంద్రరెడ్డి, ఆరికట్ల జనార్దన్‌నా యుడు తదితరులు పాల్గొన్నారు.